శ్రీ

సంగీతకృష్ణలీల.

[ఐదంకముల నాటకము.]

గ్రంథకర్త:

సంపన్నుడుంబ శింగరాచార్యులుగారు.

జగ్గన్నపేట.

ఇందుల కీర్తనలు,

కేతవరపు రామకృష్ణశాస్త్రిగారిచే

రచియింపఁబడినవి.

భీమవోలు కాపురస్తులు బుక్కుసెల్లరు,

కురుకూరి సుబ్బారావుచే

ప్రకటింపఁబడియె.

రెండవకూర్పు 1000 ప్రతులు

కాకినాడ:

స్కేప్ అండ్ కో., లో

కె. సుబ్బారాయుడు బ్రదర్సు వారివలన ముద్రింపఁబడియె.

1924.

[వెల రు 1—0—0

ఈనాటకమునందు వచ్చుపాత్రలు.

—। పురుషులు. ।—

వసుదేవుఁడు.

కంసుఁడు.

అక్రూరుఁడు.

ఇంద్రుఁడు.

శంకరుఁడు.

బ్రహ్మ.

మంత్రి.

శ్రీకృష్ణుఁడు (కథానాయకుఁడు)

బలరాముఁడు (శ్రీకృష్ణుని సోదరుఁడు.)

రజకుఁడు.

చాణూరుఁడు.

ముష్టికుఁడు.

—। స్త్రీలు. ।—

దేవకి.

యశోద.

పూతన.

రాధ.

కుబ్జ.

సమయానుకూలముగా గొల్లఫాండ్రు మొదలగువారు కొందఱువత్తురు

శ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః

సంగీత కృష్ణలీల.

నాంది.

మ. లలితస్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మం
జులతాశోభితము సువర్ణసుమనస్సుజ్ఞేయము, సుందరో
జ్జ్వల వృత్తంబు, మహాఫలంబు విమలవ్యాసాలవాలంబునై
వెలయు న్భాగవతాఖ్యకల్పతరువుర్వి న్సద్ద్విజశ్రేయమై.

సూత్ర—ఆహా! శ్రీకృష్ణలీలానిరీక్షణ కుతూహలితచిత్తులైనయిమ్మహామహుల నారాధింపఁదగిన భాగ్యంబు సమకూరె. నేఁడుగదా సుదినము! కావున, వీరిమనస్సంతుష్టికై యెట్లుసేయవలయునో మారిషునితో నాలోచించెదఁగాక! (తెరవంకఁదిరిగి) మారిషా! మారిషా!

మారి—(ప్రవేశించి) అయ్యా! సెలవేమి?

సూత్ర—ఓయీ! ఈ మహాజనుల మనస్సంతుష్టికై క్రొత్తగా రచింపబడిన శ్రీకృష్ణలీలనాటకముం బ్రదర్శింపవలయును.

మారి—అయ్యా! ఎన్నియేని గాథలుండ నిద్దానినే యేల ప్రదర్శింపవలయును?

సూత్ర—ఓయీ! బుద్ధిమంతుఁడవైన నీకు నిట్టి సందేహమా?

క. నిగమములు వేయి చదివిన
సుగమంబులుగావు ముక్తిసుభగత్వంబుల్
సుగమంబు భాగవత మను
నిగమంబు పఠింపముక్తినివసనముబుధా!

గీ. అతిరహస్యమైన హరిజన్మకథనంబు
మనుజుఁ డెవ్వఁడైన మాపు రేపు
చాలభక్తితోడఁ జదువుఁ దా సంసార
దుఃఖరాశినుండి తొలఁగిపోవు.

మారి—అది యెవ్వరు రచించిరి ?

సూత్రి—ఓయీ వినుము.

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులం బడక సమ్మతితో హరికిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.

అమ్మహాకవిపద్యరత్నము లందందు బొందుపఱచి బాలకవి శతావధాని సంపన్ముడుంబ శింగరాచార్యులు దృశ్యప్రబంధముగా రచించెను.

మారి—(సంతోషముతో) ఓహో! అట్లయిన నింక నాలస్యమేమి ?

సూత్రి—ఏమియు లేదు. గ్రంథకర్త విజ్ఞాపన మొకటియే యవశిష్టము. మహామహులగు నో సభాసదులారా! మన్ముఖంబున గ్రంథకర్త మీకిట్లు విన్నవించుకొనుచున్నాఁడు.

క. పలికెడిది భాగవతమఁట
పలికించువిభుండు రామభద్రుండఁట నేఁ
బలికిన భవహరమగునఁట
పలికెద వేఱొండుగాథ బలుకఁగ నేలా ?

కావున నా తప్పుల మన్నించి సావధానచిత్తులరై యాలకింతురుగాక యని ప్రార్థించుచున్నాఁడను. (మారిషునివంకఁ దిరిగి) ఇంక మనము కర్తవ్యమునకుం గడంగుదము రమ్ము.

(ఇర్వురు నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

సంగీతకృష్ణలీల.

ప్రథమాంకము.

రంగము:—అరణ్యము.

[దేవకిపిద్బుగంసుని వారించుచు వసుదేవుఁడు

ప్రవేశించుచున్నాఁడు.]

(1) అనుబంధము.)

వ—బావా! నామాట వినుము. ఇంతలో నింత దురాగ్రహమేల పొందెదవు? చిన్ననాఁటనుండి పెంచి పెద్దఁజేసినదానిని నీవేచేసేత నీముద్దుచెల్లెలిని జంపనెంచుట న్యాయమా? కొంచెము యోజింపుమా! అయ్యో! ఇంత ఘోరకృత్య మెందైననున్నదా? ఎవ్వరైన కని విని యెఱింగియుండిరా? హా! హా! హా! బావా! నాపల్కులాలకింపుము. నీ పాదములపైఁ బడెదను. నిన్ను మఱింత బ్రతిమాలెదను. నీసేవ జేసెదను, నీయాజ్ఞశిరసావహించెదను. చంపకుమా, నాముద్దులమిటారిని! కరుణింపుమా, నారతనాలమూఁటను! రక్షింపుమా నారమణీలలామను! అయ్యో! ఎంతవేడుకొన్నను నీకింతయైన కనికరముజనింపదేమి. నామాట యొక్కటియైన నీ చెవిం బ్రవేశింపదేమి? నాపా

ర్ధన మించుకయు నీహృదయశిలాఫలకమును గరఁగింపదేమి ? నీవునీముద్దుచెల్లెలికి నీరతనాలచెల్లెలికి—నీబంగారుచెల్లెలికి—నీప్రేమాస్పదమైనచెల్లెలికి—నీయంతట నీవు పెంచి పెద్ద జేసి మహావైభవంబున వివాహమును గావించిన చెల్లెలికి—యిచ్చు బహుమతియా యిది ! అయ్యో ! బావా!

ఉ. అన్నవునీవు చెల్లెలికి ? నక్కట ! మాడలు సీర లిచ్చుటో
మన్ననసేయుటో ? మధుర ! మంజులభాషల నాదరించుటో
మిన్నులమోఁతలే నిజము ! మేలని చంపకు మన్న మాని రా
వన్న సహింపుమన్న తగ ! దన్న వధింపకుమన్న వేడెదన్

దేవ—అన్నా ! నేనేమితప్పుజేసితి ? నాపైనింత యాగ్రహమేమి ? ఒక యరనిమిసమైన నీయానతి మీఱకుంటినే ! నిన్నే త్రిలోకాధిపతినిగాఁ దలంచితినే ! సమస్తవిధముల దిక్కునీవేయని, సర్వకాల సర్వావస్థలయందు నమ్మియుంటినే ! ఇట్టిత్వదేవశరణ్యను—అగతికను—నూతనవధువును—మహాగ్రహావిష్టచిత్తుండవై కత్తిదూయుటధర్మమా ? నామొరాలకింపుమా ! నన్నురక్షింపుమా !

(2) అనుబంధము.

కంసు—ఆఁ ! ఏమి ప్రేలితివి ? నిన్ను కరుణింపవలయునా ? నేను మరణింపవలయునా ? నీకు నీదేహమం దెట్టి యభిమానమో నాకు నాదేహమం దట్టి యభిమాన ముండఁదగదా ? నీకల్లబొల్లియేడ్పులు విని, నీకఱుకుమాటలను నమ్మి, నిన్ను విడిచిపుత్తునా ? నేఁజత్తునా ? నన్నెవ్వరని తలంచితివి ! వైరిగంధసింధురపంచాననుండను, సర్వసర్వంసహామండలధురంధరీణదోర్దండమండితుండను, సర్వస్వతంత్రుండను, సమధికగౌరవోన్నతుండను, సమస్తజనమాన్యుండ నట్టి నేను మరణించుట మంచిదియే

గాని యొకమూలఁ గూర్చుండి స్వాతంత్ర్యములేక యొకరి యాజ్ఞకులోఁబడి యుపకారాపకారముల నొనర్చుట కసమర్థురాలవగు నబలవు నీవు బ్రహ్మకల్పాంతము జీవించుట యుక్తముగాఁబోలు. ఆహా! ఏమి స్వార్థత్యాగము! ఏమి పరోపకారపారీణత్వము! ఇంక నీవేమైన ననుము. నాక్షేమమునకంతరాయమగు నిన్ను మన్నింపను. నిన్ను క్షమింపను నీమొరాలకింపను. నీశిరముఖండింపక విడువను.

గీ. తల్లిదండ్రినయిన । దమ్ములన్నల
సఖులనైనబంధు । జనులనైన
రాజ్యకాంక్షఁజేసి । రాజులు సంపుదు
రవనిఁ దఱచు జీవి । తార్థులగుచు. (కత్తి నెత్తును.)

వసు—(కత్తి బట్టుకొని) అయ్యో! ఇది యేమన్యాయము!

కంసు—అన్యాయమా? అన్యాయమా?

వసు—కటకటా! ఏదియో యొకమాట విని యదియే నమ్మి మాపైఁ బంతము సాగించుట న్యాయమా? మేము కలనైనను నీక్షేమమే కోరుచుందుముగాని వేఱుదలంపము. నీచెల్లెలి నేల ద్రుంచెదవు. నన్నేలదుఃఖముల పాలొనరించెదవు? నీకువచ్చు నాపదకు పరులు కారణంబని తెలిసిపోని యూహాలు బన్ని పరులను హింసింపఁదగదు.

సీ. మేనితోడనబుట్టు । మృత్యువు జనులకు
నెల్లి, నేఁడైన, నూ । రేండ్లకైనఁ
దెల్లంబుమృత్యువు । దేహంబుపంచత
నందఁగర్మానుగుం । డైశరీరి
మారుదేహమునూది । మఱియొంటి దేహము
బాయును తనపూర్వ । భాగమెత్తి

వేఱొంటిపైఁ బెట్టి వెనుకభాగంబెత్తి
గమనించు తృణజలూకయునుబోలె

గీ. వెంటవచ్చుకర్మ విసరంబు మును మేలు
గన్న వేళ నరుఁడు గన్నవిన్న
తలపఁబడిన కార్య తంత్రంబుకలలోన
బాడితోడఁగానఁ బడినయట్లు.

ఇదియునుంగాక.

గీ. జలఘటాదులందు జంద్రసూర్యాదులు
గానఁబడుచుఁగాలి గదలుభంగి
నాత్మకర్మనిర్మి తాంగంబులను బ్రాణి
గదలుచుండురాగ కలితుఁడగుచు.

కంసు—చీ! చీ! పో! పో! ఇంతవఱకు నిన్నుపేక్షించితి నింక నీవు మాఱాడిన బ్రయోజనము లేకపోవుటయేగాక, పైపెచ్చు నీవు సైతముండవు. (మరల కత్తి నెత్తును.)

(3) అనుబంధము.

దేవ—అయ్యో! చచ్చితి చచ్చితి.

వసు—(ఒక చేత కత్తి పట్టుకొని యొక చేత గడ్డము పట్టుకొని బ్రతిమాలుచు) ఓకంసమహారాజేంద్రా! కొంచెము తాళుము. నామనవి నాలకింపుము. సావధానముగా నా వాక్యము నాకర్ణించి పైన చిత్తమునవచ్చిన ట్లొనరింపుము. నీకెవరడ్డము వత్తురు? మహేంద్రాదులును నీయాజ్ఞ శిరసావహించునప్పుడు మేమనఁగ నెంతవారము! నీసోదరి యష్టమగర్భము నిన్ను దునించునని గదా నీవు తలంచుచుంటివి! ఇట్టివింత యెందైన నున్నదియా? ఇది యెవరైన నమ్ముదురా? చెల్లెలఁట—కొడుకఁట—అందును, ఎనిమిదవవాఁడఁట అమితప్రేమాస్పదుండై, మహావీరుఁడై, త్రిలోకవిఖ్యా

తుఁడైన మామనఁట. చంపునఁట. ఆహాహా! ఎంతవిస్మయమెంత విస్మయము! (నవ్వి) ఓ వెఱ్ఱిబావా! బయలాడు మాటల నమ్మి యింతఘోర కార్యము నొనరింతువా? ఒకవేళ నీకట్టి దుర్మరణమే యుండిన నీచెల్లెలి నిజంపిన దప్పునా? నీ వెట్లాలోచించితివి? నీ వెంత పొరఁబడితివి! నిముసములో దుఃఖముల పాలుగాఁ దలంచితివే! జననమరణము లొక రెఱుంగుదురా? మృత్యువు సహజము. ఎప్పుడును వెంటనంటియే యుండును. ఒకరు పొమ్మనినఁ బోవునది కాదు. ఒకరు రమ్మనిన వచ్చునది గాదు. ఒకరడ్డుపడిన నాగునది కాదు. కాలమెప్పుడు తటస్థించునో యప్పుడే తప్పక వచ్చును. దీనికై యొరుల ప్రాణములు దీయవచ్చునా? పాపముగాదా? అహింసాపరమోధర్మ యను ధర్మమెఱుఁగవా? నహింస్యాత్సర్వభూతాని యను వేదప్రమాణమును వినలేదా? అందును సామాన్యహింస కాదు. స్త్రీహత్య, అందును చెల్లెలే. ఇట్టి మహాపాపంబునకు నీవంటి వదాన్యుఁడు—నీవంటి ధర్మజ్ఞుఁడు—నీవంటి పరోపకారి—దయాళువు, సమ్మతించునా? చేయవచ్చునా? త్వరపడక కొంచెము యోజింపుము. ఎందో యూరుపేరు లేని సాధారణకాంత గాదు. ఏగర్భంబున సగము నెత్తురు పంచుకొని జన్మించిన ముద్దుగుమ్మ. దయాసత్యాదిసద్గుణంబులకు నిలయంబైన మహాపుణ్యచరిత. పతివ్రతామణుల మేలుబంతి. ఇట్టి సహోదరిని వధింతువా? ఖండింతువా? కటకటా!

మ. చెలియల్కన్నియ ముద్దరా లబల నీ సేమంబ చింతించు ని
ర్మల దీనిం బయలాడు మాటలకునై మర్యాద బోఁదట్టి స
త్కులజాతుండవు పుణ్యమూర్తి వకటా కోపంబు పాపంబు నె
చ్చెలి నోహా దెగవ్రేయ బాడియగునే చింతింపు భోజేశ్వరా.

కం—విడువుము. విడువుము. ఇదిగో! నీ శరీరముగూడ భూమిపై దొరలఁబోవుచున్నది. విడువుము.

వసు—(గట్టిగఁ బట్టుకొని) అయ్యయ్యో! ఏయూరు పేరులు లేక, యే ప్రమాణమార్గములు లేక, యేకారణములు లేకను, యెవ్వరో పల్కిన పల్కులను నమ్మి యింత సాహసకృత్యమున కొడిగట్టుదువా? నాకొక శత్రుఁడు జనించునని నీవంటి ధీరోత్తముఁడు భయంపడవచ్చునా? నీవు నమ్మినట్లు శత్రువు జనించునని యే యనుకొందము. జనియించినను నీవు వీరుండవైన యెడల నెదిరించి సంగ్రామరంగంబుఁ జయంబుగాంచరాదా? నీ నీతి నీకె తెలియును. జననీజనకాది బంధువర్గము నెడ ప్రేమ లేక చరించిన నే నేమని చెప్పఁగలను! పశువులకు సైతము తోఁబుట్టువులపై ప్రేమయుండునే—ఆహా! నాప్రార్థనమునకు శిలయైనఁ గరగునుగాని నీహృదయ మించుకయుఁ గరుగకున్నదిగదా! ఎప్పుడో జనించు శత్రునిఁ దలంచి యిప్పుడు తాళలేనివాఁడవు, పైని దండధరుండు పెట్టు బాధలకెట్లు తాళఁగలవు? దురాశావేశితుండవై నిర్దయాత్ముఁడవై మాటిమాటికి కంటికిమింటికి నేకధారగాఁ గన్నీరు స్రవించుచుండ పాదంబులంబడి పాహిపాహి యని దుఃఖించు ప్రియసహోదరిని గర్జించుచు నొక్కవ్రేటున నీనిశితకరవాలధారకు బలిగావించినచో నీకెట్టి కుంభీపాకాదిమహాఘోరనరకంబులు సంప్రాప్తించునో యించుక యోజించుకొనుము. నీవు, నీసంపద, నీరాజ్యము, నీధైర్యము, నీశౌర్యము, నీస్వాతంత్ర్యము, నీసాహసము శాశ్వతమని తలంపకుము. మహానుభావు లెందఱో పుట్టిరి; ఎందఱో గతించిరి. ఒక్కఁడైన నిలచెనా? నిత్యసత్యవ్రతదీక్షాగురుఁడైన హరిశ్చంద్రుఁడు గతించెను; పరోపకార పరా

యుణుఁడగు నలమహారాజు గతించెను. కృతయుగాలంకారముగు మాంధాత గతించెను. నిఖిలరజనీచరశిక్షకుండైన శ్రీరామభద్రుఁడు గతించెను. మరియు ధర్మరాజాదులు ధర్మపరులు, సత్యమూర్తులు, దయామయులు పెక్కండ్రు గతించిరి. నీవుమాత్రము శాశ్వతబ్రహ్మకల్పముగా నుందువుగాఁబోలు ! మాప్రాణంబులు తృణప్రాయంబులు. ఘోరారణ్యంబున నెవ్వరు లేరుగదా యని తనవెంట నొంటరిగా నమ్మి వచ్చువానిని వధింపఁజెల్లునా ? నే నిట నొంటిపాటున వీరిని వధింప నెవ్వరికిం దెలియదని యెంచితివా ? జగచ్చక్షువగు సూర్యభగవానుఁ డెఱుంగఁడా? పంచభూతము లెఱుంగవా? రాత్రిందివములెఱుంగవా ? పురందరాదిత్రింశత్కోటిదేవత లెఱుంగరా ? ధర్మమెఱుంగదా ? ఇంతయెందుకు—నీఖడ్గము, నీయంతరాత్మ, నీమహాపాపదేవత యెఱుంగదా? కావున నింకనైన నీ వెఱ్ఱియూహ మానుకొనుము.

క. కర్మములు మేలు నిచ్చును
గర్మంబులు గీడు నిచ్చుఁ గర్తలు దమరుఁ
గర్మములు బ్రహ్మకైనను
గర్మగుఁడై పరుల దడవఁ గా నేరుటకే.

(4) అనుబంధము.

కం—ఓహో ! నిన్నింక నుపేక్షింప వీలు లేదు. అయినను తుదిసారి చెప్పుచున్నాఁడను. తొలఁగుము తొలఁగుము.

వసు—(తనలో) ఈమూర్ఖుఁ డెన్ని చెప్పినను వినువాఁడు కాఁడు. ఈకఠినరాక్షసుని హృదయము కరగునది కాదు. కావున నుపాయముచే నిప్పటి కీయాపత్సముద్రము నీఁదవలయును.

క. కొడుకుల నిచ్చెదనని సతి
విడిపించుట నీతి, నీకు విడిచినమీఁదన్
గొడుకులు పుట్టినగార్యము
తడఁబడదే, నాఁటికొక్క దైవము లేదే.

(వసు) అయ్యో బావా! నీకింతయైనను జాలి గల్గుటలేదా! ఇంక నేనేమి సేయుదును. అయినను నా యీవాక్యమును మాత్రి మాద రించి మమ్ము రక్షింపుము.

క, లలనకుఁ బుట్టిన కొమరుని
వలనం దెగుదనుచు గగన వాణి వలికెనం.
చలిగద వేని మృగాక్షికిఁ
గల కొడుకులఁ జంపనిత్తుఁ గ్రమమున నీకున్.

అప్పుడు నీయిష్టము వచ్చినట్లొనరింపుము. ఇట్లు గావించిన నీప్రాణం బులును, మాప్రాణంబులునుదక్కును. త్వరపడి చెల్లెలిని జంపకుము. పిమ్మట పశ్చాత్తాపము నొందకుము. చేయి మిగిలినతర్వాతఁ జేయున దేమియులేదు.

కం—తప్పక కుమారుల నెల్ల నొప్పగించెదవా ?

వసు—మిన్నువిరిగి మీఁదఁ బడినను నేనన్నృతమాడువాఁడనుగాను.

కం—మంచిది పొండు. (నిష్క్రమించును.)

వసు—నేఁటికీ మహావిపత్సముద్రము నీఁదితిమి.

క. ఎందును గాలము నిజమని
పందతనంబునను బుద్ధి బాయక ఘనులై
యొందాక బుద్ధినెగడెడి
నందాకఁ జరింపవలయు నాత్మబలమునన్.

(అందఱును నిష్క్రమింతురు.)

రంగము:—మధురాపట్టణలోని వీథి

(అక్రూరుఁడు ప్రవేశించును)

అక్రూ— కటకటా! నానాఁటికీ కంసుని పాపము వృద్ధిఁబొందుచున్నదే. ఇంతటి కఠినచిత్తుని— ఇంతటి పరమపాతకు నెవ్వారైన గని విని యెఱింగియుండిరా? వసుదేవుని ప్రార్థన మాదరించి విడిచిపుచ్చి నారదుని వాక్యములచే మరల క్రుద్ధుఁడై దేవకీవసుదేవుల ననేక బాధలను బెట్టుచున్నవాఁడు. దేవకీదేవికి జనించిన యార్గురు కుమారులనుగూడ తన ఖడ్గకాళికి బలియొసంగెను. కాని, కీడులో మేలన్నట్లు సప్తమగర్భము మాత్రము సురక్షితమయ్యెను.

గీ. దేవకీదేవికడుపులోఁ దేజరిల్లు
దీప్తగర్భంబు మెల్లన దిగిచి యోగ
నిద్ర రోహిణికడుపున నిల్పె ననియెఁ
గడుపు దిగెనంచుఁ బౌరులు గలఁగఁబడఁగ.

ఇప్పుడు తిరిగి దేవకీదేవి గర్భిణియయ్యె. ఈమారేమో గాని యానందము ప్పొంగుచున్నది. అయిన నేమి ప్రయోజనము! దురాత్ముఁడీ కంసుఁడు తన నిశితకరవాలమున కెర జేయకుండునా? (విచారించి) ఆఁ! మరచితి నారదమునీంద్రుఁడు వచించెఁగదా, విశ్వమయుండగు నారాయణుండు దేవకియష్టమగర్భమున నావిర్భవించునని. అమ్మహావాక్యమెన్నటికైన సత్యేతరము గాఁజాలునా? నిశ్చయముగ శ్రీమన్నారాయణుఁడవతరించును. భూభారంబును హరించును. నిరంతరము తనపాదారవిందములను నమ్ముకొనియున్న నావంటి సేవకులను రక్షించును. కావున నేనిప్పుడు.

సీ. అతివకాంచీగుణంబు బల్లన బిగియంగ
వైరిషడ్భూగుణ వ్రజము సడలె,

మెల్లన తన్వంగి మెయిదీవ మెరుఁగెక్క
        దుష్టాంగనాతను ద్యుతులడంగె,
నాతికల్లన భూష ణములు పల్వలుకగాఁ
        బరసతిభూషణ పంక్తులెడలె
గలకంఠికొయ్యన గర్భంబుదొడ్డగాఁ
        బరిపంథిదార గర్భములువగిలెఁ
గీ. బాలఁతి కల్లన నీళ్ళాడ ప్రొద్దులెనుగ
    సహితవల్లభలైదువ లైతనర్చు
    ప్రొద్దులన్నియుఁ గ్రమమున బోవఁదొడఁగె
    నువిదకడుపున నసురారి యుంటఁజేసి.

ఆహా! కాలవైపరీత్యమేమందును!

గీ. జ్ఞానఖలునిలోని శారదయునుబోలె
    ఘటములోనిదీప కళికవోలె
    భ్రాంతియింటనాకఁ బడియుండెదేవకి
    కాంతవిశ్వగర్భ గర్భయగుచు.

అవుగాక! ఇంక నెన్నినాళ్ళీకష్టము లుండఁగలవు? (విచారించి) నేనను కొనినట్లు దేవకీదేవిని సందర్శించుట కిది సమయముగాదు. ప్రస్తుత మచ్చటికి బోని కంసుని కొలువుకూటంబునకే యేగెదఁగాక.

(నిష్క్రమించును.)

రంగము:—కారాగృహము.

(దేవకీవసుదేవులు శృంఖలాబద్ధులై యుందురు.)

[ఇంద్రుఁడు శంకరుఁడు బ్రహ్మయుఁ బ్రవేశింతురు]

(కావలివాండ్రు యోగమాయచే నొడలు తెలియకుందురు.)

(౬) అనుబంధము.

ఇంద్రు—(చేతులుజోడించి) పరమాత్మా! పరంధామా! ఈసకల లోకపరితాపము నీకుఁగనఁబడుటలేదా ? సాధుపుంగవు లెట్లు శ్రమపడుచున్నారో, మునీంద్రులనేత్రపద్మములనుండి జలజలమని దుఃఖాశ్రువు లెట్లురాలుచున్నవో, ధార్మికోత్తముల హృదయము లెట్లు క్షోభించుచున్నవో, సర్వజగద్వ్యాపివగు నీవెఱుఁగవా? మా బాధలు బోగొట్టువాఁడవునీవే. మమ్మురక్షించువాఁడవునీవే. ఓసర్వజ్ఞమూర్తి! నీమాయనెఱుంగ నెవ్వరితరము! నిన్నువర్ణింప వేదంబులును జాలవప్పుడింక నాకా చెప్పవలసినది!

సీ. సత్యవ్రతుసి, నిత్య । సంప్రాప్తిసాధనుఁ
గాలత్రయమునందుఁ । గల్గువాని
భూతంబులైదును । బుట్టుచోటగువాని
నైదుభూతంబులం । దమరువాని
నైదుభూతంబులు । నడఁగినపిమ్మటఁ
బరగువానిని, సత్య । భాషణంబు
సమదర్శనంబును । జరపెడువానిని
నిన్నాశ్రయింతుము । నీయధీన

గీ. మాయచేత, నెరుక । మాలినవారలు
పెక్కుగతుల నిన్ను । బేరుకొందు
రెఱుఁగనేర్చువిబుధు । లేకచిత్తంబున
నిఖిలమూర్తులెల్ల । నీవ యండ్రు.

మఱియు నోజగన్నాయకా !

గీ. మంచివారికెల్ల । మంగళప్రదలయ్యు
గల్లరులకుమేలు । గానియట్టి
తనువులెన్నియైన । దాల్చి లోకములకు
సేమమెల్లఁ బ్రోద్దు । జేయుదీవు.

శంక—ఓ యనంతా! ఓకౌస్తుభభూషణా! ఓగరుడవాహనా! ఓకమలదళవిశాలలోచనా! ఇంతనిర్దయ తగునా? రక్షింపుమురక్షింపుము. జగంబులన్నియు మహావిపత్సముద్రంబున మునింగియున్నవి. ధర్మములన్నియు నశించినవి. పాపము విజృంభించినది. ఇంక నుపేక్షించుటయుక్తముగాదు. సత్వరముగా నీ వావిర్భవింపక తప్పదు. ఇది నీకొక విశేషముగాదు. ఏలయన,

ఉ. పుట్టువులేదినీ కభవ! ♦ పుట్టుట క్రీడయ గాక పుట్టుటే?
యొట్టనుడు, న్భవాదిదశ ♦ లెల్లను జీవులయం దవిద్య దాఁ
బుట్టుచునుండుగాని నిను ♦ బుట్టినదింబలెఁ బొంతనుండియుం
జుట్టగలేమిఁ దక్క క్రియలఁ ♦ జొక్కనియొక్కటివాడు వీశ్వరా.

క. ఎఱిఁగినవారలమనుచును
గొరవమాలిన యొరుక లెఱిఁగి ♦ కొందఱునీపే
రెఱిఁగియుఁదలఁపగనొల్లరు
బరతురథోగతులజాడ ♦ బద్మదళాక్షా!

బ్రహ్మ—స్వామీ! చరాచరమూలకారణా! ఆశ్రితపక్షపాతా! నిఖిలకల్యాణగుణగణసమేతా! ఆదినారాయణా! అనంతా! అచ్యుతా! ఆదిపురుషా! అవ్యయానందా! హరీ!గోవింద! గోవింద! ఇంతనిర్దయతగునా? ఎన్నఁడైన నీకిట్టినిర్దయ జనించెనా? ఎప్పుడెప్పుడు ధర్మము నశించునో, ఎప్పుడెప్పుడధర్మము విజృంభించునో, యప్పుడప్పుడవతరించి, భూభారమునుహరించి, సాధువులను రక్షించి, క్రూరులను శిక్షించి, ధర్మమును స్థాపింతునని నీవు నీభక్తుల కభయప్రదానము సేయలేదా? అందులకుఁ దార్కాణముగ ననేకావతారముల నెత్తలేదా?

మ. గురుపాఠీనమవై జలగ్రహమవై ♦ కోలంబవై; శ్రీనృకే
సరివై, భిక్షుఁడవై, హయాననుఁడవై, ♦ క్ష్మాదేవతాభర్తవై

ధరణీనాథుఁడవై, దయాగుణగణోదారుండవై లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెద మిలాభారంబు వారింపవే.

స్వామీ! దీనరక్షకా! ఇంక నాలస్యము చనదు.

క. ముచ్చిలియున్నది లోకము
నిచ్చలు కంసాదిఖలులు నిర్దయులేచన్
మచ్చికఁ గావగవలయును
విచ్చేయుము తల్లికడుపు వెడలి ముకుందా.

అమ్మా! దేవకీ! చింతనొందకుము.

మత్తకోకిలము. తల్లి నీయుదరంబులోనఁ బ్రధానపూరుషుఁడున్న వాఁ
డెల్లి పుట్టెడి; కంసుచే భయమింత లేదు; నిజంబు; మా
కెల్లవారికి భద్రమయ్యెడు నింక నీకడు పెప్పుడుం
జల్లగావలె యాదవావళి సంతసంబును బొందగన్.

శంక—అదిగో! భగవానునకు మనపైఁ గృపవచ్చినట్లున్నది. దేవకి ప్రసవవేదన పడుచున్నది. ఆహా!

క. పంకజముఖి నీళ్ళాడను
సంకటపడ ఖలులమానసంబుల నెల్లన్
సంకటముదోఁచె మెల్లన
సంకటములు లేమిదోఁచె సత్పురుషులకున్.

[దేవకీదేవికి నారాయణుఁడు జనించును.]

బ్రహ్మ—ఆహా! జగదీశ్వరుఁడావిర్భవించినాఁడు. అహో! దేవకీవసుదేవుల పురాకృత సుకృతఫలము? హరపురందరులారా! ఈ శుభ శకునంబులం దిలకించితిరా? అవ్యక్తమధురస్వనంబులతో ధారాధరంబులు గర్జించుచున్నవి. దశదిశావకాశంబులును బ్రసన్నంబులై కనుపట్టుచున్నవి. గ్రహతారకా

పరివేష్టితంబై గగనమండలము ప్రకాశించుచున్నది. నిర్మల తరంగసంగతంబులై సప్తసాగరంబు లుప్పొంగుచున్నవి. కమ్మని పరిమళంబును గమ్మని వెదజల్లుచు జల్లని మలయానిలంబు వీచుచున్నది. సరళంబులగు విహంగముల కలకలారావంబుల తోడను, లలితంబు లగుపుష్పగుచ్ఛంబులతోడను, మధురమధురంబు లగుఫలసముదాయంబులతోడను, నారామంబు లభిరామంబులై యలరారుచున్నవి. (తెరలో వీణాగానము నృత్యము జరుగును.) అదిగో! గంధర్వు లానందకందళిత హృదయారవిందులై గానంబుగావించుచున్నవారు. రంభయు, నూర్వశియు, మేనకయు, మున్నగు నచ్చర లెల్లరును మహోల్లాసంబున నాట్యమొనరించుచున్నవారు. ఆహా! ఈ వసుదేవునిఁ దిలకింపుఁడు.

సీ. జలధరదేహు, నా జానుచతుర్బాహు
సరసీరుహాక్షు, వి శాలవక్షుఁ
జారుగదాశంఖ చక్రపద్మవిలాసుఁ
గంఠకౌస్తుభమణి కాంతిభాసుఁ
గమనీయకటిసూత్ర కంకణకేయూరు
శ్రీవత్సలాంఛనాం చితవిహారు
నురుకుండలప్రభా యుతకుంతల లలాటు
వైడూర్యమణిగణ వరకిరీటు
గీ. బాలుఁ బూర్ణేందురుచిజాలు భక్తలోక
పాలు, సుగుణాలవాలుఁ గృ పావిశాలుఁ
జూచి, తిలకించి, పులకించి, చోద్యమంది,
యుబ్బి, చెలరేగి, వసుదేవుఁ డుత్సహించె.

జగదీశ్వరా! శ్రీమన్నారాయణా! భక్తవత్సలా! దీనబంధూ! కృపాసముద్రా!

క. ధరణీభారము వాసెను
పురుషోత్తమ! యీశ! నీదు పుట్టువున, భవ
చ్చరణాంబుజముల ప్రాపున
ధరణియు నాకసముగాంచె పదము నీకరుణన్.

ఇంక మనము నిర్భయులమైతిమి రండు. (నిష్క్రమింతురు.)

వసు—(ఆశ్చర్యముతోఁ జూచి) ఆహా! ఏమిది? సహస్రసూర్యు లుదయించిన నెంతప్రకాశము గల్గునో, యట్టి ప్రకాశ మీకారాగారమునంతయు నలముకొన్నది. ఈకుమారోదయ మత్యద్భుతమును గూర్చుచున్నది. బాలకుఁ డెంతసుందరాకృతితో జగన్మోహనుఁడై ప్రకాశించుచున్నవాఁడు! (చెంతకేగి చక్కఁగా జూచి) అహో! నీలమేఘశ్యాముఁడు- చతుర్భుజుఁడు- శంఖచక్ర, వనమాలా కౌస్తుభ, సమేతుఁడు- రత్నకుండలకంకణకేయూరుఁడు శ్రీవత్సలాంఛనుఁడు- మాణిక్యకిరీట విరాజమానుఁడు (గగుర్పాటుతో) ఆహా! అత్యద్భుతమత్యద్భుతము! బ్రాహ్మణోత్తములకు ధేనుసహస్రదశకంబును ధారవోసెద. (మనస్సులో అట్లుచేసి) నిశ్చయముగా నీకారాగృహమును మహాదీపమువలె వెలుఁగఁజేయు నీబాలుఁడు చతుర్ముఖములుగల బాలుఁబడసిన లోకపాలుఁడుగాని సామాన్య బాలుఁడుగాఁడు. ఆహా! నాజన్మము ధన్యమైనది. నేను కృతార్థుఁడనైతి. నాకన్నఁ బుణ్యులు లేరు. కానిచో సకలచరాచర మూలకారణుండై, సృష్టిస్థితిలయహేతుభూతుండై, బ్రహ్మాదులకు నయిత మిదమిత్థమని నిరూపింప రానియీపరమాత్మ నావంటి నీచునకు-

నావంటి క్షుద్రునకు- నావంటి తుచ్ఛునకు- నావంటి చలచిత్తునకు- నావంటియధమాధమునకు- కుమారుఁడై జనించునా? (సాష్టాంగనమస్కారముఁజేసి లేచి ఫాలంబున నంజలినుంచి) దేవాదిదేవా! పరాత్పరా! పతితపావనా! పరమాత్మా నిన్ను నే నేమని స్తుతించుటకైన వాక్యము రాకున్నది.

(6) అనుబంధము.

(ఫాలంబున నంజలినుంచి)

క. ఏ నిన్ను నఖిలదర్శను
జ్ఞానానందస్వరూపు సంతతు నపరా
ధీనుని మాయాదూరుని
సూనునిగాఁగంటి నిట్టి చోద్యముగలదే.

స్వామీ! నీవు లోకంబులన్నియును సృజింప రజోగుణంబున జతుర్ముఖుండవై, భరింప సత్వగుణంబున నారాయణుండవై, హరింపఁదమోగుణంబున రుద్రుండవై ప్రకాశింతువు. నీవు కాలమూర్తివి పురుషోత్తముఁడవు- హరుఁడవు- పరాత్పరుఁడవు- అణువుకన్న బరమాణువవై, మహత్తుకన్న మహామహత్తువై విశ్వంబునందెల్ల నిండియుందువు. నీమహిమ యవాఙ్మానసగోచరము. నీమాయ యెంతవారలకు నజేయము. దారువులలో నంతర్హితప్రకాశుండగు నగ్నిహోత్రుని చందంబున వర్తించు నిన్నెఱుంగక నిస్సారసంసారపరవశులై చెడిపోవు జీవకోట్ల మాయాంధకారంబును, నీ దివ్యలీలావతారంబులను దీపంబుచేఁ బటాపంచలు గావించి రక్షించుచుందువు. శిష్టరక్షణార్థంబును దుష్టశిక్షణార్థంబును ధర్మసంస్థాపనార్థంబును నీవావిర్భవింతువని పెద్దలు వక్కాణించుచుందురు. కావుననే, నీవిప్పుడు దుష్టరాక్షససంహారమునకై యవతరించితివి— దేవా!

శా. మింటన్ మ్రోగిన మ్రోతదాలిమినిల్ । మేండ్రింతమున్ నీవునా
యింటం బుట్టెదవంచు గంసుఁడుదొడిన్ । హింసించె నీ యన్నలన్
గంటం గూరుకు దేవు నీయుదయ మా । కారాజనుల్ సెప్పగా
బంటింపం డెదురేగు దెంచునడి నీ । పై నేఁడు సన్నద్ధుఁడై.

(7) అనుబంధము.

దేవ—(చేతులుజోడించి నమస్కరించి) నాతండ్రీ! నారాయణా

ఉ. విశ్వము లీల ద్రిప్పుచు న । విద్యకుజుట్టమవైన నీకుదా
శాశ్వతమైన కాలమిది । సర్వము వేడబమందు రట్టి వి
శ్వేశ్వర! మేలుకుప్ప నిను । నెవ్వఁడు గోరిభజించు, వాఁడపో
శాశ్వతలక్ష్మి మృత్యుజయు, । సౌఖ్యయుతుం డభయుండు మాధవా.

మరియు నోజగదీశ్వరా!

మత్తకోకిలము.

ఒంటినిల్చి పురాణయోగులు । యోగమార్గ నిరూఢులై
కంటిమందురు కాని నిక్కము । కాన రీభవదాకృతిన్
గంటి, భద్రముగంటి, మాంసపు । గన్నులం గనఁబోలదీ
తొంటిరూపు దొలంగఁబెట్టుము । తోయజేక్షణ! మ్రొక్కెదన్

బాలుఁడు—భక్తాగ్రేసరులగు నో దేవకీవసుదేవులారా! మీస్తోత్రంబునకు మిక్కిలి సంతసించితిని. మీరు పూర్వము పృశ్నియు, సుతపుండను వారలు. పండ్రెండువేల దివ్యవర్షంబులు ఘోరతపంబుగావించి సాక్షాత్కరించిన నన్ను నపుత్రకులరగుటచే మోహాబద్ధులరై మోక్షంబుగోరక నను వంటి కొమరుల నడుగ నప్పుడు వరప్రదానముఁజేసి మీ కేను బృశ్నిగర్భుండన నర్భకుండనై యావిర్భవించితి. పిమ్మట నదితికశ్యపులగు మీకు వామనుండన నవతరించితి, తిరిగి యిప్పుడు జన్మించితిని. మీరు ధన్యులరు

క. నందనుఁడనియుం, బరమా
నందంబగు బ్రహ్మమనియు, నను దలఁచుచు నా
పెందెరువు నొందెదరు, నా
యందలి ప్రేమమున భవము నందరుమీరల్.

కావున నింక నన్ను రేపల్లెలో యశోదప్రక్కనిడి యందున్న బాలికను గొనితెండు. నాయనుగ్రహంబున మీకార్యంబు నిర్విఘ్నంబై సఫలంబగును. ఇంక నేను ప్రాకృతశరీరమును వహించెద కర్తవ్యమును త్వరగా నెరవేర్పుఁడు (చతుర్బాహువులు మున్నగు లక్షణములను త్యజించి సామాన్య బాలునివలెఁ గన్పట్టును.)

వసు—(ఆనందముతో) ఆహా! కృతార్థుఁడను కృతార్థుడను. ఇంకఁ దడయరాదు. భగవదాజ్ఞ నిప్పుడే నెరవేర్పవలయు. (అని బాలునెత్తుకొనఁబోయి) అయ్యో! శృంఖలాబద్ధుఁడనైన నేనెట్లీ మహాకార్యమును నిర్వర్తింపఁగల్గుదును. (అని యిటునటు గదల సంకెలలూడి పడును) (ఆశ్చర్యముతో) ఆహా, యేమిది. ఏమివిస్మయము! సర్వమును భగవానునిలీల. (బాలునెత్తుకొని మెల్ల మెల్లగ పురిటియింటినుండి యివ్వలికివచ్చి) కటకటా! ఇందు పరమకిరాతులును, మహాకఠినచిత్తులు నగు కావలివారున్నవారు. వీరి నెట్లు దాఁటుదును! (చూచి) ఓహూ! అభ్యంతరము లేదు. వీరు నిద్రించుచున్నవారు. (కావలివాండ్రను గడచివచ్చి) కటకటా! ఒకటి గడచిన నింకొకటి దాపురమగుచున్నది. ఇచ్చట నినుపగొలుసులు దృఢములై యున్నవి. ఇఁక నెట్లు! (ఇనుపగొలుసు లూడిపడును) ఇంక భయములేదు. (ముందుజూచి) అదిగో! తాళములు కీలూడిపడియున్నవి. (కొన్ని మొగసాలలుగడచి) ఆహా! ఇది యేమి

మాయు. కవాటము లన్నియును దెఱచి యున్నయవి. (కవాటములన్నియు గడచి వెనుదిరిగి చూచి విస్మయముతో) ఆశ్చర్యమాశ్చర్యము. ఆదిశేషుఁడు క్రిందఁబడిన యినుపగొలుసులను యథాప్రకారముగా నమర్చి, కీలూడిన తాళములను జక్కఁజేసి, తెఱచిన కవాటములన్నియు మరలమూసి విశాలములైన తన ఫణాఫలకంబులను విప్పుకొని యేకగమనంబున నావెనుదగిలి వచ్చుచున్నవాఁడు. ఆహా! భగవత్కటాక్షము! ఆజగద్రక్షకునకు భక్తులయందెంతవాత్సల్యము! (పరిక్రమించును, దెరయెత్తగా యమునానది కన్పించును) నడుమనడుమ సంప్రాప్తించు నభ్యంతరములన్నియు నట్లో భగవత్కృపచేఁ దప్పిపోయినవి కాని మహాభయంకరమై నిర్వక్రనక్రక్రమ ఘోరంబై, దారుణావర్తమై, యగాధంబగు నీయమునాప్రవాహంబు నెట్లు దాఁటశక్యమగును; హా! పరమేశ్వరా! నారాయణా! అపారంబగు సంసారపారావారంబును సైత మొక్కమారు స్మరించినంతమాత్రముననే తరింపఁజేయు నీకీయమునాప్రవాహమును దాఁటించు టొక్క లెక్కయా? తల్లీ! యమునా! భగవదాజ్ఞానిర్వహణమునకై యరుగుచున్న నాకు మార్గమిమ్ము (యమునలో దిగును. యమున త్రోవ యిచ్చును.) యమునను దాఁటి యవ్వలితీరమునకు జని) ఇంకనే యభ్యంతరమును లేదు. (త్వరత్వరగా బరిక్రమించును. తెరయెత్తగా నందుని గృహముగపడును) శ్రీహరికృపచే నెల్లవారును నిద్రించుచున్నవారు (ఇంటిలోని కరిగి యశోదప్రక్కను బాలునుంచి యందున్న కుమారిక నెత్తుకొని పోయినదారినే తిరిగివచ్చును. యమున మార్గము విడచును. వసుదేవుఁడు దేవకిచెంత బాలికనుంచును. ఆదిశేషుఁడు మరల కవాటములు వేసిచనును. వసు

దేవుఁడు కాళ్ళకు చేతులకు సంకెలలను దగిలించుకొని భయపడుచున్న వానివలె నటించుచుండును; బాలిక యేడ్చును) కావలివాండ్రు (విని) వోరేవ్ వోరేవ్ దేవకమ్మ నీళ్ళాడిందిరా లేవేంరా (అని యొకనివీపుపై జరచును.)

2 (లేచి) వోరి నీకుంపతెగ? నచ్చేతట్టు బాదావేంరా?

1 దేవకమ్మ నీళ్ళాడిందిరా.

2 నిజమేనేంగా? నిజమేనేంరా?

1 నీవు చెప్పుటోడవా యేందిరా. పిల్ల యెల్లేడుత్తుందో యినబడటం లేదేంరా.

2 అవునా? నిజమేరా. మనం యిప్పుడే యెల్లి దొరగార్కి సెపుదాం పా! మామంచిబగుమోతి యిస్తాడ్రా!

1 (మరలవీపుపైఁజరచి) నీబగుమోతి పాడుగాను; సెప్పకుంటె మనను బతుకనిస్తాడ్రా యెదట?

2 అబ్బ దున్నపోతుముండాకొడుకా! సంపేశావుగదరా (పోవుదురు) (తెరవ్రాలును.)

రంగము:— కారాగృహము, ముందరియంగణము.

[తర్వాతత్వరితగమనంబున గంసుఁడును వెనుక మంత్రిలు మొదలగు వారును ప్రవేశింతురు.]

కం—(వచ్చుచు) ఓరీ! కావలీ! నిశ్చయముగా దేవకి నీళ్ళాడినదా?

1 సామీ! మాకేంపానంమీదికొచ్చింది దొరగారితో అబద్ధం మన్వి శెయ్యటానికి, నిశ్చయంగా దేవకమ్మోరు నీళ్ళాడింది.

కం—నీవు చూచితివా?

2 (తనలో) దొరగోరు సాలా సాలా తొందరతో మన్వి సేత్తున్నారు

ఇయ్యాల యీయాన సేతిలో యీనికి బొమ్మదేముడు సావు రాశినట్లే యున్నాడు సూత్తే.

1 (వడకుచు) మారాజా ! మారాజా ! నన్ను రచ్చించాల రచ్చించాల. నేను సూడలేదు.

కం—అయిన దేవకి పిళ్ళాడినదని యెట్లు చెప్పఁగల్గితివి?

1 పిల్ల యేడుపు వినఁబడినదండి.

కం—ఇదియైన నిజమేనా ?

1 నిజం నిజం మారాజా !

కం—ఆ ! ఇంక యిప్పుడే నామృత్యువును నాఖడ్గకాళికి బలియొనంగెద. (రక్తాక్షుఁడై యురుకుచుండ తలముడి విడిపోవును; ఉత్తరీయము జారిపోవును మంత్రు లుత్తరీయమునుబట్టుకొని వత్తురు. (దేవకిచెంతకు వచ్చి) ఓసి ! దేవకీ ! దేవకీ !

దేవ—(గడగడ వడకుచు) అన్నా యేమి యేమి ?

కం—నీకిప్పుడుదయించిన పుత్త్రుఁడేడి ?

దేవ—అన్నా ! పుత్త్రుఁడు లేఁడు.

కం—నీవు నాతో నెకసక్కెములాడి బ్రతుకఁదలంచితివా? (దేవకిని నరుకఁబోయి (మంత్రులచే వారింపఁబడి) నాకువృథా కాలహరణమగుచున్నది. నిన్నడుగనేల ! (అని వెదకుచు) ఎందునుం గనంబడకున్న వాఁడేమి చెప్పుమా ? ఈకారాగృహము గాఢాంధకారమయమైయున్నది. (శిశువేడ్చును) అదిగో ! రోదనధ్వని వినఁబడుచున్నది. దేవకి శిశువును బట్టుకొని యెత్తిచంపఁబోవును.

దేవ—(అడ్డమువచ్చి కాళ్ళపైఁబడి) అయ్యయ్యో! అన్నా! అన్నా! రక్షింపుము రక్షింపుము. ఇంతఘోరమాతగునా ! నాముద్దురాల

కింపవా ? ఇంతమాత్రము నన్ను కరుణింపుము. ఆకాశవా ర్త
లంబట్టియే యింతపాపకృత్యంబునకు గడంగుచుంటివా? అయి
నను నీవనుకొనినట్టిది యామశిశువుగాని మొగశిశువు కాదు.
వృథాగా నేలచంపెదవు. ఇదివఱకే నిష్కారణముగ నార్గు
రు కుమారులను వధియించితివి. ఇంకనైన సంతృప్తికాలేదా!
నీకు దయలేదా! ఆఁడుపడుచొక్కరీతిగా వాపోవుచుండ నీకుఁ
గనికరము జనింపదా? నీది హృదయము కాదా ? కేవలము
కఠినస్వరూపమైన శిలాఫలకమేనా ? కటకటా ! పెద్దపులికైన
గొంచెము జాలిపొడముునుగాని నీకేమాత్రము దాక్షిణ్యా
ముదయింపకున్న దిదియేమి పాపము! (అని దుఃఖించుచుఁ బయ్యె
దను సవరించుకొని) అయ్యో! నిష్కారణముగ వధించిన నే
నేమిసేయుదును! కొంచెము ధర్మాధర్మములను విచారింపుము.

ఉ. అన్న ! శమింపుమన్న, తగ దల్లుఁడుగాఁ డిది మేనగోఁడలే
మన్నన సేయుమన్న, విను, మానిని జంపుట రాచపాడిగా
దన్న, సుకీర్తివై మనఁగదన్న, మహాత్ములు వోవుత్రోవఁ బో
వన్న, భవత్సహోదరిఁ గదన్న, నిను శరణంబు వేఁడెదన్
(పాదములపైఁబడును.)

కంసు—(తన్ని) చీ! చీ! లెమ్ము. (మరలతన్నును)

దేవ—(ఊరక దుఃఖించుచు) అన్నా! నన్ను దన్నెదవా ? నన్ను శిర
ముపై నెక్కించుకొని లాలలు జోలలు పాడి లాలించిన నీవే
నన్ను నీకఠినపాదప్రహారముల నొప్పింపఁదలఁచిన నిన్ను నా
వంటి యబల యేమనంగలదు! నీకెవరడ్డపడఁగలరు! అడ్డపడి
నమాత్ర మెవరు బ్రదుకఁగలరు ? అన్నా ! తన్నిన తన్నితివిగా
ని. నావిషయమై నీవొనరించిన సాహసకృత్యము లంతయు
నొక్కమారు స్మరించుకొనుము.

క. కట్టా! యార్గురు కొడుకులఁ
బట్టివధించితివి యాఁడు బడుచుది కోడల్
నెట్టన జంపఁగవలెనే
కట్టిడివిగదన్నయన్న కరుణింపఁగదే.

[8 అనుబంధము.]

కం—ఛీ దుష్టాత్మురాలా! ఛీ! పాపాత్మురాలా! నీ మొగముచూడరాదు. ఒక్కపసికూనకై మహోన్నతుఁడైనయగ్రజుని మరణంబునకుఁ దలపడుచుంటివి. నీవిట్టికఠినాతికఠినురాలవయ్యును, నన్ను కఠినుఁడవనియు నాహృదయము శిలాఫలకమనియు నిందించుచుంటివి. ఆహా! నీవెంతకుటిలచిత్తవు! నీవెంతమాయలాడివి ! వదలుము వదలుము. శిశువును వదలుము. లేకున్న నిదిగో చచ్చితిని.

దేవ—(శిశువునుబట్టుకొని) అన్నా! నీవనినట్లుపుత్రుఁడేబుట్టినచో నీక్షేమముగోరక శిశువును లాగికొందునా? నీకప్పుడేయొసగకుందునా? ఇదివరకార్గుర నీయలేదా? ఇందునాదోసమేమున్నది. నిష్కారణముగ యుక్తాయుక్తములను విచారింపక నోరెఱుఁగని పసికందువును బట్టి బలాత్కారముగ నేలవధించెదవు? ఇదిబ్రతికియున్న నీకేమియుహానిలేదు. ఊరక ఖండింపకుము. (కంసుఁడుశిశువునులాగుచుండ) అయ్యో! ఆయ్యో! అన్నా ! అన్నా! నామనవినాలింపవా! నాముద్దుచెల్లింపవా? పోనీనన్ను ఖండించి పిదప శిశువును వధింపుము. నీకెంతని చెప్పుదును. నీయూహాను మరలించుకొనఁ జాలకున్నావుగదా ?

క. పుత్రుఁడు నీబ్రతుకునకును
శత్రుండనివింటిగాన సమయింపఁదగున్

బుత్రులఁగాంచనైతిని
బుత్రిదానంబు జేసి పుణ్యముగనవే

కం—ఛీ! ఛీ! పో పో (అని దేవకిని బడఁద్రోసి శిశువునులాగికొని యాకసముపైకి విసరివైచి ఖడ్గమెత్తును. శిశువు భూమిపయింబడక యాకసమున నిలిచి మహాకాళియై యగపడును. కంసుఁడువివర్ణుఁడై చూచుచుండును.)

కం—ఆహా! ఇది పరమాశ్చర్యకరముగా నున్నది. నెత్తురుకందగు పసికూన దివ్యమాణిక్యహారాలంకృతయు, దివ్యగంధానులేపనయు, దివ్యాయుధధారిణియునై యెన్మిదిహస్తంబులతో నంబరంబునం బ్రకాశించుచున్నది. అవురా! ఇది యేమి మాయమైయుండునోగదా? (ఆకాశమునుండి) ఓరోరి పశుపాతకా! బాలహింసాపరాయణా! కంసాధమా!

ఉ. తెంపరివై పొరింబొరిని దేవకిబిడ్డలఁ జిన్నికుఱ్ఱలం
జంపితి వంతనైన నుప శాంతివహింపక బాలమీఁద ను
ప్పింపగ నిస్సిరో యిదియు బీరమె నాసరసన్ జనించి నిర్క
జంపెడివీరుఁడొక్కెడెస సత్కృతినొందెడువాఁడు దుర్మతీ.

(మాయమగును.)

కం—(పశ్చాత్తాపముతో) ఆహా! మహాకాళిపల్కిన పల్కులు విన సత్యముగానే తోఁచుచున్నవి. కటకటా! నేనెంతపాపమొనరించితిని! నేనెంత దుష్కృతము గావించితిని! పరమసాధువులగు దేవకీవసుదేవుల నెంత బాధించితి, నెంత వేధించితి! ఓరీ సేవకా! వారిసంకెల లూడఁదీయుము; కాదు కాదు. నేనే యూడఁదీసెద (అట్లుచేసి) మహాత్ములారా! నాదోషమును క్షమింపుఁడు. నేను మహాపరాధిని. మిమ్మనేకవిధముల హింసించిన పరమకిరాతుఁడను.

ఉ. పాపుఁడ; బాలఘాతుకుఁడ - బంధువిరక్తుఁడ, దుష్టచిత్తుఁడన్
గోపనుఁడన్ జరన్మృతుఁడ - క్రూరుఁడ; బ్రాహ్మణహంతభంగి మీ
పాపల జంపితిం, బయలి - పల్కుల నమ్మితి, సాధులార! నా
పాపములు గ్గడింపక కృ - పాపరులై, కనరే, క్షమింపరే.

(పాదములపైఁబడి) సర్వజ్ఞులగు మీకుఁ దెలియనిదేమున్నది.

ఉ. ఒక్కఁడ బ్రాణులందఱుని - జోచితకర్మములోలిఁ ద్రిప్పఁగా
నొక్కొక మేనితోఁ బొడమి - యొక్కొకశోభవను రాకపోకలం
జిక్కులఁ బొందుచుందురు - చెల్మిని సంస్మృతితోడఁ బాయ, నే
నెక్కడి హంత? మీ శిశువు - లెక్కడి హన్యులు దూరనేటికిన్.

వసు—(లేవఁదీసి) బావా! మాకేమియును క్రోధము లేదు. అంతయు
ను గర్మాధీనము.

శా. బావా! నీవచనంబు నిక్కము సుమీ - ప్రాణుల్ గతజ్ఞానులై
నీ వేనంచు నులోభమోహమదభీ - విర్మిత్రతామోదశో
కావేశంబుల నొండొరుం బొడుతు రే - కాకారుఁడై సర్వరూ
పావిష్టుండగు నీశ్వరుం దెలియ లే - రన్యోన్యవిభ్రాంతులై.

కం—పాపాత్ముఁడని మైనదలంపక మీరు క్షమించితిరి; మీ వాత్సల్యం
బు నెంతని కొనియాడుదు! మీరు స్వేచ్ఛాప్రకార మరుగుఁ
డు. (దేవకీవసుదేవులు నిష్క్రమింతురు) (అటనున్న పీఠములపైఁ
దక్కిన వారందఱు యథోచితముగాఁ గూర్చుండిన పిమ్మట)
మంత్రిపుంగవులారా! నే నెంత యకార్యం బొనరించితిని!
నిష్కారణముగ సాధువుల కెగ్గొనర్చితిఁగదా?

1 మంత్రి—దేవా! ఏల విచారించెదరు! సర్వజనులును తమ
క్షేమము నే ప్రధానముగఁ జూచుచుకొనుటయు నందుల కంత
రాయము లెట్టివి తటస్థించినను వానిని దొలగించుకొనుటయు
లోకధర్మము.

కం—మీరనినదియును సత్యమే కాని నాచెలియలి యష్టమగర్భంబు నన్ను హరించునని గదా వారలను బాధించితిని! ఇంతమాత్రమున నాకోర్కె సఫలంబయ్యెనా? మింటినుండి బాలికారూపమును ద్యజించిన మహాకాళి వాక్యమును వింటిరి గదా! ఇంక నాకు జీవితాశ యెట్లుగల్గును. నేను నిర్భయుఁడనై ఱొమ్ముపైఁ జేయివైచుకొని యెట్లు హాయిగ నిద్రింపఁగలను!

2 మంత్రి—దేవా!

క. ఇట్టయినఁ దడయ నేటికి
బట్టనముల మందలందుఁ బల్లెల నెల్లం
బుట్టెడి పెరిగెడి శిశువులఁ
బట్టి వధించెదము మమ్ముఁ బంపు మధీశా.

1 మంత్రి—అవును. తప్పక యిట్లొనరించుటయే శ్రేయము శత్రువులు నశించిరని విచ్చలవిడిగా రాజు లెప్పుడును దిరుగఁ గూడదు. ప్రస్తుతము నొచ్చినను, అనేక వేషములతో వారు విజృంభించి పగ దీర్చుకొందురు. కావున వారు నిశ్శేషముగా నశించువఱకును నీతిజ్ఞుఁడగువాఁ డేమఱి యుండఁగూడదు. ఇదియునుం గాక, శత్రువులు స్వల్పులైయుండగనే వారిని బరిమార్పవలయు. లేకున్న దప్పక హానిసంభవింపఁగలదు. రోగమును బుట్టువులోనే యంతమొందింపకున్న వృద్ధిజెంది మరణంబొడఁగూర్పదా! కావున, మనకిప్పుడు తప్పక శాత్రవాన్వేషణంబు కర్తవ్యంబని నాకుఁ దోఁచుచున్నది. "శత్రోశ్శేషం న శేషయేత్తనుట" మీరెఱుఁగరా?

కం—మనకిప్పుడు శాత్రవు లెవ్వరు?

2 మంత్రి—మహారాజా! తా మిట్లానతిచ్చుచున్నవా రేమి

మహావీరులగు తమచే జన్యరంగముల నెవ్వరు పరాభూతులైరో, తమ కరాళకరవాలధారాజలంబున నెవ్వరి సైన్యంబులు మునింగెనో, తమ క్రోధాగ్నికిం దాళలేక మాంపాహి మాంపాహి యని యెవ్వరు చల్లచల్లగఁ బలాయనమును జెప్పిరో, అట్టి దేవత లెల్లరును మీకు శత్రువులు గారా? దేవా! ఇంతయేల? ఇటు వినుఁడు.

మ. భవదీయోజ్జ్వలబాహుచాపవిలసద్బాణావళీ భగ్నులై
దివిజాధీశ్వరు లేక్రియం జనిరొ, యే దేశంబులం డాగిరో?
శివునిం జొచ్చిరొ, బ్రహ్మ జెందిరొ, హరిన్ సేవించిరో, మౌనివృ
త్తి వనాంతంబుల నిల్చిరో, మనకు శోధింపందగున్ వల్లభా!

కం—(విచారించి) అవును. నీ వనినది నిశ్చయమే; మద్బాణాగ్నికోడి బెగడి యమరు లెల్లరును మద్వధోపాయంబును జింతించుచున్నట్లు నారదుఁడు నాకొకనాఁ డెఱింగించెను. అమరులే మనకు ముఖ్యశత్రువులు; సందేహము లేదు. వారెందునుం జనియుండరు. ఏ దేశంబులయందును డాగియుండరు. శంకరుని శరణుజొచ్చి యుండరు. బ్రహ్మనుగూడఁ జేరియుండరు. పరమకుటిలస్వభావుఁడగు నారాయణునే, పోయి ప్రార్థించి యుందురు. ఏలయన?

మ. అమరశ్రేణికి నెల్లఁ జక్రి ముఖరుండా చక్రియే ధర్మమం
దమరున్; గోవులు, భూమిదేవులు, దితిద్విడామ్నాయ, కారుణ్యస
త్యములున్, యాగ, తపో, దమంబులును శ్రద్ధా, శాంతులున్ విష్ణుదే
హము, లన్నింటిని సంహరించిన నతండంతంబునుం బొందెడిన్.

రాక్షసులందఱు—(హుంకారములు సేయుచు నట్టహాసము లొనరించుచు) మహారాజా! మీ రానతిచ్చినచో నా కార్యము నిమిషములో నెఱవేర్పఁగలము. ఆజ్ఞ నిండు.

ఉ. చంపుదుమే నిలింపులను, జంకెలఁ జంకెల దాపసావళిన్
బంపుదుమే కృతాంతకుని పాలికిఁ గ్రేపులతోడ గోవులన్
ద్రుంపుదుమే, ధరామరుల దోలుదుమే, నిగమంబుల న్విదా
రింపుదుమే, వసుంధర నారింపుదుమే, జననాథ! పంపుమా.

కం—మంచిది. అంతమాత్రముననే గాదు. ప్రతిపట్టణంబులకును, ప్రతిపల్లెలకును, ప్రతివనంబులకును, నిన్నియేల, సకల స్థలంబులకుం జని దేవతలను భంజించియు, మునిసమూహములను మందలించియు గోవులను వధించియు, బ్రాహ్మణులను ఖండించియు, వేదశాస్త్రంబుల నిర్మూలించియు, శిశువులను భేదించియు, స్త్రీలను బాధించియు, నీకు నెట్టిపనులనైనఁ గావించి విష్ణుని నామావశిష్టునిం గావింపవలయు. కాని. జాగ్రత్తగా సంచరింపవలయును, అప్పటికప్పటి కనుకూల వేషములను వైచుకొనవలయును. పూతనాదులకుఁ గూడ నాయాజ్ఞను దెల్పి యందఱుం గూడి కార్యమును జక్కఁ జేయవలయు. దేవకీవసుదేవులను మరల గారాగృహమున బంధించెద నింక మీరును మీ కర్తవ్యనిర్వాహణమునకుఁ గడంగుఁడు.—

అందఱు—ఇదిగో యిప్పుడే పోవుచున్నారము. అంతయు గన్గొనుము గాని తిరిగి రాము.

(9) అనుబంధము.

కం—మంచిది పొండు. (అందఱును పోవుదురు)

(తెరపడును.)

సంగీతకృష్ణలీల.

ద్వితీయాంకము.

రంగము:—నందుని గృహము

(యశోదయుఁ గొందఱుగోపికలు ప్రవేశింతురు.)

యశోద—ఏమే సరోజినీ! చిన్నికృష్ణయ్యారు జలకమాడింపవలయును. ఇప్పటికే చాల ప్రొద్దెక్కినది. ఎట్లు?

సరో—నాచేతిలో నిలువడమ్మా! నేను జలకమాడింపలేను. అదిగో! మేనత్త వచ్చుచున్నది. ఆమె వీనికి పినతాతమ్మగూడఁ గావలయును; చాల యోపిక గలది, నీ కొడుకు దుడుకులన్నియు నోర్చుకొనఁగలదు.

యశో—అవును. ఆమెయే పోవలయయును. నాయనమ్మా! నీమనుమనికిఁ గొంచెము నీళ్ళు పోసిపోదూ?

లలిత—(ప్రవే) అయ్యో! నా కంతకన్న పని యేమున్నది! పిలువుము నీ చిన్నికుమారుని (ముసిముసినగవులతో శ్రీకృష్ణుని దీసికొని కాళ్ళు జోడించి కూర్పుండఁ బెట్టికొని)! యశోదా!

కొంచెము తైలము తెమ్మా కృష్ణయ్యకు తలయంటుదము.

(యశోద తైలమిచ్చును.)

లలిత—(తీసికొని తలకురాయుచు, చూడవే చూడవే! ఎట్లు లేచు చున్నాఁడో చూడవే! (కృష్ణుఁడు లేవగా మరల కూర్చుండ బెట్టును; మరల నట్లే లేచును. అందఱు నవ్వుదురు.) అమ్మా! కొంచెము పసుపుదెమ్మా (యశోద యిచ్చును) (పూయును)

సరో—చూడమ్మా చూడు. నీకొడు కెంత నల్లవాఁడో! పసుపుబూసినను నల్లగనే యున్నాఁడు. ఇంతచక్కని కొడుకును జూచుకొనియేనా అమ్మా, అంత సంతోషము.

యశో—(చిరునగవుతో) నాకొడుకున కేమే! వజ్రాలుమొహరీలు నల్లనివాఁడైన మాత్రమేమి ఇంద్రనిలచ్ఛాయ. నీ పసుపువర్ణముకన్న మా చిన్నికృష్ణుని శ్యామలశరీరమే యందముగ నున్నది.

సరో—(నవ్వుచు) నిజమే,నిజమే! కాదుపాపము. ఎంతచక్కనివాఁడు. ఎంతచక్కనివాఁడు.

లలిత—ఇంక నీరు బోయకమ్మా; పిల్లవాండ్లుచాలసేపు నానకూడదు. (యశోద నీరుబోయును) శ్రీరామరక్ష—శ్రీరామరక్ష—సీతమ్మరక్ష—సీతమ్మరక్ష. (అని మూడుమారులు జలము కృష్ణునిపైఁ ద్రిప్పి తుడుచును.)

(యశోద పాడుతూ పిలువగా కృష్ణుఁడు గంతులువైచుచు ప్రవేశించును.)

(10) అనుబంధము.

యశో—సరోజినీ! కస్తూరితిలకము నీవుబెట్టవే. పాపను నాయన్న పెద్దమనిషి. నీవైనచో బాగుగాఁ బెట్టఁగలవు.

సరో—తప్పునా అమ్మా! నీకొడుకుతో అంతా అసాధ్యమే. ముందేమి మమ్ముద్ధరింపఁ గలఁడో కాని (తిలకము బెట్టగా ధూపము వేసి తొట్లలోనుంచి) అమ్మా! యిఁక నే నేగవచ్చునా?

యశో—అయ్యో! అప్పుడే పోయెదవఁటే! నీ పాటయనిన మా చిన్ని కృష్ణయ్య యెంతో ప్రేమతో వినును. ఒక్క లాలిపాట, ఒక్క జోలపాటపాడి మరిపోవే.

సరో—అట్లాగేనమ్మా!

లలి—నేనుగూడ పాడెదనులే; పాడు.

సరో—(లాలి పాట) లాలిజగదభిరామ. లావణ్యసీమా, లాలితారకనామలాలి శ్రీకృష్ణా. ॥లాలి॥ మేలైనముత్యాల మాలికలతోడ, నీలమేఘములోలు నెరిమేనితోడ, చాలలోకములేలు సత్కరుణతోడ, గ్రాలుచుందావునీవు ఘనమైన రేడా? ॥లాలి॥ ముక్కోటిదేవతలు మూగిసేవింప జొక్కిదివ్యర్షులు స్తోత్రమొనరింప, మ్రొక్కిభక్తులు, నీదుమూర్తి భావింప, జక్కగానొప్పెదవు జగముహర్షింప ॥లా॥

లలి—(కూని రాగముఁదీయుచు)—లాలి—అద్దాలతొట్లెలో నందంబుగాను, ముద్దుగ మురిపెముల్ మూటగట్టుచునూ, అద్దిరా కనుమూసినట్లిమూయుచున్న నిద్దురబోవని నేనెరుంగుదునూ, ॥లాలి॥

సరో—యశో—(పకపకనవ్వుదురు) (కృష్ణుఁడుగూడ నవ్వుచుండును.)

లలి—ఏమే? అట్లు నవ్వెదరు. నాకేమి రాగమువచ్చునా? తాళమువచ్చునా? ఏమో నాకువచ్చినట్లు నేను పాడినాను.

సరో—కోపపడకమ్మా! అదిగో! చిన్నికృష్ణయ్యగూడనవ్వుచున్నాఁడు.

(మరలనవ్వును)

లలి—నా చిన్నికృష్ణుఁడు నాపాటకు నవ్వుటలేదు. మీ తెలివితక్కువ గూర్చి నవ్వుచున్నాఁడు.

యశో—మా వాఁడు చాలబుద్ధిమంతుఁడు. ఎవ్వరినిగూర్చి నవ్వఁడు. నాలో వాఁడేదియో నవ్వుకొనుచున్నాఁడు. మీరు మీకనుకూలముగ మాట్లాడుకొనుచున్నారు.

(11) అనుబంధము.

సరో—అవునమ్మా! ఒకజోలపాటగూడ పాడెదను—(అని తొట్లనూపుచు) (జోలపాట—జోజోకుముద్దాగ జోజోయుదారా, జోజోమహాధీర జోజోకుమారా! జోజో॥ సత్యమునుధర్మమును జాలగనొనర్చి యత్యధికమగు జగములన్నియునుచేర్చి ముత్యాలతొట్లగా ముదమొప్పగూర్చి నిత్యంబుసుఖముగా నిదురింపవయ్యా' జోజో॥ తీయనిరాగముల్ దీసిపులకింప గాయిగానారదుఁడు హర్షముజనింప, వేయిచేతులతోడ వీణవాయింప బాయకతొట్టెలో బవళింపుమయ్యా. జోజో॥ మురిపెముల్ వెదజల్లుముఖకాంతితోడ, ముద్దులూరెడు చిన్ని ముంగురులతోడ, నరయనింపగు మందహాసంబుతోడ, నరజన్మమెత్తితివి నాచిన్నికృష్ణా॥జోజో॥

యశో—సరోజినీ! మంచిపాట పాడితివే; మాకృష్ణుఁడెట్లు చూచుచున్నాఁడో! ఏదో చెప్పవలెనని యున్నట్లున్నదే. (అని కృష్ణుని చెంత కరిగి) నాయనా! కృష్ణయ్యా! ఏమి! (యశోద మొగము జూచుచుఁ గృష్ణుఁడు పకపకనవ్వును)ఊ.! ఏమి?(కృష్ణుఁడు, ఊంగా—ఉంగా అని యేమోముచ్చట బెట్టును) (నవ్వును)ఊఁ. (కృష్ణుఁడు ఊఁ అనును) ఊఁ మరల నవ్వేయని నవ్వుచు) (నవ్వుచు) ఊఁ చీ పో. (అని ముద్దుపెట్టుకొని) తండ్రీ యింక నిద్రబొమ్మ (కృష్ణుఁడు తొట్టెలో ఆడుకొనుచుండును) (ముందుజూచి)

ఆహా! సరోజినీ! ఈమె యెవ్వరే యిటువచ్చుచున్నది? ఎంతచక్కగానున్నదే! చూడు చూడు.

సరో—(చూచి) అవునమ్మా! మంచిచక్కనిది.

(తర్వాత మాయా సుందరియై పూతనయను రాక్షసి ప్రవేశించును.)

యశో—అమ్మా! ఇటురమ్ము; ఇందుగూర్చుండుము.

పూత—కూర్చుండుట కేమిగాని. నీకుమారు నొక్కమారు చూడ నిచ్చెదవా?

యశో—అదేమిభాగ్యమమ్మా! అట్లే చూడనిచ్చెదను. (అని తొట్టె చెంతకరిగి కృష్ణుఁడు కదలకుండఁ బండుకొనియుండఁ జూచి) అమ్మా! కుఱ్ఱవాని కిప్పుడే నిద్రపట్టినది. కొంచెముండుము. లేచినతర్వాత చూపెదను.

పూతన—(విన్పించుకొనక తొట్టెచెంతకరిగి) నాయనా! నిద్రించుచున్నావా? మానాయనా రారా! మాఅప్ప రారా! మాతండ్రి రారా! (అని కృష్ణునివైపు జేతులుసాచి యెత్తుకొనఁబోవ)

యశో—అయ్యో! ఇదేమియాగడము, నిద్రబోవుచున్నవానిని లేపుచున్నావు.

పూత—ఇంతలోననే నీకొమరుఁడు కందిపోయెనాయేమి? పాపము! చాల యాఁకలిగొనినట్లున్నవాఁడు. రా! నాయనా! రా! ఆఁకలి యగుచున్నదా తండ్రి? (కృష్ణుఁడు ఊఁ అనును) అగుచునేయున్నదా? ఓరి నా పిచ్చితండ్రి.

క. నా చనుబాలొక గ్రుక్కం
డో చిన్నికుమార! త్రావు మొయ్యన పిదపన్
నీచెలువ మెఱుఁగవచ్చును
నాచెలువము సఫలమగును నళినదళాక్షా!

రారా! నాకన్నయ్యా! రా! (అని తొట్టిలోనుండి దింపి యొడిలో కూర్చుండఁ బెట్టుకొనును.)

యశోద—సరె! సరెలేవమ్మా. మాపిల్లవానిని ముట్టుకొనకుము. వలదువలదు. మాపిల్లవానికి నీవేమియుఁ బాలీయవలదు. నీపాలకొఱకే మాపిల్లవాఁడెదురుచూచుట లేదు. అయ్యో! అయ్యో! ఎంతచెప్పినను విననేమమ్మా! ఊరకయున్నవాన వూరకుండక నిద్రబోవువానిని లేపి పయిగా పాలుపాలని వేపుకొనుచున్నావు. చాలుచాలులే! ఇక్కడనుండి లేచి వచ్చిన దారింబొమ్ము.

సరో—ఏమమ్మా? నీకుఁగాదటమ్మా చెప్పునది! సరిసరి! బాగుగనే యున్నది. మర్యాదగా రమ్మనినందులకుఁ దగిన ప్రాయశ్చిత్తము జేయుచున్నావులే! ఈకాలములో నెవ్వరిని గౌరవింపఁగూడదు. అన్నట్లేనమ్మా, యెంతచెప్పినను కదలకున్నది.

లలిత—నీకేమి చెవుఁడా యేమి? యశోదమ్మా! చూచెదవేమి? పిల్లవానిని దీసికొమ్ము. మంచిమాటలతో నెంతజెప్పినను వినునట్టులేదు. నేను పుట్టినప్పటినుండి యెందఱినో చూచితినిగాని, యింతటి మొండిరక్కసి నెక్కడఁగూడఁ జూడలేదు.

పూత—(తనలో) ఓహో! ఈమె నన్ను గుర్తించెనా యేమి? కాదుకాదు. మాట వరుసగా నిట్లుపల్కినది (ప్రకా) అట్లు కోపపడెదరేమమ్మా? ఎందులకింతకోపము? మీపిల్లవానిని నేనేమి చేసితిని: చూడెట్లేడ్చుచున్నవాఁడో! ఎంతయాఁకలియైనదో, పాపము! నాయనా! కడుపునిండ ద్రాగి యాఁకలిని దీర్చుకొనుము.(అని పాలీయగా దానిప్రాణములతోఁగూడ, బీల్చుచు, హస్తములతో స్తనములనుబీడించుచుండ) సరెసరెలే, యందరిపిల్లలవంటివాఁడవని పాలీయవచ్చితిని.నీవందఱివంటివాడవుగావు. వింతవాఁడవు. అబ్బా!అబ్బాఁ(బాధపడుచు)విడువుము.విడువుము

అయ్యయ్యయ్యో, అయ్యయ్యయ్యో! చాలు! చాలు! చాలు! బుద్ధివచ్చె! బుద్ధివచ్చె! (విరచుకొని రాక్షస శరీరముతో భూమిపయింబడి విలవిల దన్నుకొని చచ్చును. కృష్ణుఁడు దానిపై నాడుకొనుచుండును.)

యశో—అమ్మయ్యో, అమ్మయ్యో! రాక్షసి-రాక్షసి-నాయనా! కృష్ణా! రా, బూచి బూచి. (తటాలున గృష్ణునిదీసికొనివచ్చి దూరముగఁ బోయి) (పెద్దగా) ఓహో! ఇంటిలో నెవ్వరును లేరా? రాక్షసి-రాక్షసి--(నందాదులు ప్రవేశించి రాక్షసినిద్చుకొని పోవుదురు) నాయనా! జడిసికొంటివా? (అని యూరార్చుచు) సరోజినీ! చిన్నకృష్ణుఁడు భయపడినట్లున్న వాఁడు. ఏమి సేయుదునే! (కన్నులనీరు బెట్టుకొనును.

సరో—అట్లు కన్నులనీరు బెట్టుకొనెదవేమమ్మా! నీ కుమారునకేమియు భయములేదు. కొంచెము గోధూళియు గోమూత్రంబును జల్లి యాచమనంబుఁ జేసి రక్షకట్టుము. తర్వాత కొంచెము పాలిచ్చి పరుండఁబెట్టుము. (యశోదయట్లు చేయును.)

కృ—(తనలో) ఈతొట్టిలో శకటాసురుండున్న వాఁడు. వీనిని సంహారించెదంగాక (అని యూరక కాలుచేతులాడించుచు నేడ్చుచుండును.

యశో—సరోజినీ! ఊరక కాలుచేతులాడించుచు నిట్లేడ్చుచున్న వాఁడేమే! ఇప్పుడేగదే పాలిచ్చితిని.

సరో—ఏమో నాకుమాత్ర మేమి తెలియును.

కృ—(ఊరక గిలగిలదన్నుకొనును; అందుండి శకటాసురుఁడు భూమిపైఁ బడిచచ్చును.)

యశో—అమ్మయ్యో! మరల నెవ్వఁడో రక్కసుఁడు వచ్చినాఁడే, ఇఁక వనమిందుండరాదు. అవ్వలి గృహంబున కరుగుదము (అని కృ

ష్ణుని భుజముపై నిల్పుకొని పోవుచుండ సుడిగాలి వీచి శ్రీకృష్ణుని పైకెదీసికొనిపోవును) అయ్యో? సరోజినీ! అయ్యో? లలితా: నేనేమిసేతునే, నాకృష్ణుఁడేడే, నాచిన్నికృష్ణుఁడేడే, నా ముద్దుకృష్ణుఁడేడీ, నావరాలకృష్ణుఁడేడే, అయ్యో దైవమా నేనెంతపాపజాతినైతిని. హా! నన్నుగన్నతండ్రీ! ఏమనుచుంటివి నాయనా? భుజముపైనున్నవాఁడవు భుజముపైననే మాయమైతివా? ఈపాడుసుడిగాలి యెక్కడనుండివచ్చెను? ఇంక నీసుందరవదనారవిందము నే నెట్లుగాంతును. నేనెందుఁజొత్తును. (అని దుఃఖించుచుండ తృణావర్తునిపై నెక్కి కృష్ణుఁడాకసమునుండి పడును. తృణావర్తుఁడు చచ్చును.) నాతండ్రీ' వచ్చితివా? నా వరాలతండ్రీ' వచ్చితివా? (అని తటాలున నురికి పట్టుకొని) ఇంకరండు! ఇం దొక్క నిముసమైననిల్వరాదు. నిల్చిన చో నిట్టివేయేవోతిష్టములు తటస్థించును (అనియందఱు నిష్క్రమింతురు.) (తెరపాలును)

రంగము.—యశోదగృహము.

(యశోదయు, ఇందిరయుఁ గృష్ణుఁడును బ్రవేశింతురు,)

(12 అనుబంధము.

యశో—ఇందిరా! నేనేమిసేయుదునే; మా బాలకృష్ణునిలీలలుకడుచిత్రములై అవాఙ్మానసగోచరములుగా నున్నవి. ఎంతజోకొట్టినను, నెంతలాలించినను పోరు మానకున్నాఁడు. ప్రొద్దుటనుండి యొకేరీతిగా వెక్కి వెక్కి యేడ్చుచున్నాఁడు. మయిల సోకినదేమో యనిజలకమాడించి రక్షకట్టితి. ధూపము వేసితి. ఇంకెన్నియో చేసితి; నెన్ని చేసినను దనయేడ్పు మానకున్నవాఁడేమిసేతునే?

ఇందిర—అమ్మా! యశోదాదేవీ! ఇదేమమ్మా! యీదినమిట్లేడ్చుచున్నాఁడు! ఆఁకలి యగుచున్నదేమో, కొంచెము పాలిమ్మా.

యశో—ఇంతకుముందే యిచ్చితి. చూడవచ్చినవారెల్లరు నెత్తుకొని లాలించిరి. కాని నిముసమైన నేడ్పుమానఁడు. నీవెత్తుకొని కొంచెమోదార్చుము. అప్పుడైన నూరకొనునేమో? (ఇందిర యెత్తుకొనఁ గృష్ణుఁడేడ్చును. ఇందిరా! నీవెత్తుకొనినప్పటి నుండియు మరింత యేడ్చుచున్నాఁడేమే? ఇంక తొట్లెలోఁ బరుండఁబెట్టుము జోలపాట బాడుదము (పరుండఁబెట్టి యూపుచు (జోలపాడును.)

ఇందిర—ఈనాఁడేమోగాని పిల్లవాఁడు చికాకుపడు చున్నవాఁడు (ముందుజూచి) అదిగో! రాధయుఁ గమలయు వచ్చుచున్నారు. (రాధయు కమలయుఁ బ్రవేశించి)

యశో—రాధా! రావే! నీమేనల్లుఁ డీపొద్దుటినుండియు నీవు వచ్చి యెత్తుకొనవైతివని యొక తీరీతిగా నేడ్చుచున్నవాఁడు. కొంచె మెత్తుకొని బుజ్జగింపుము.

రాధ—(నవ్వుచు) నిజమేనమ్మా. నేను నేఁడే యనుకొనుచువచ్చుచున్నాను (అని కృష్ణు నెత్తుకొన కృష్ణుఁడేడ్పు చాలించి రాధ మొగముఁజూచి ముసిముసి నగవులు నవ్వుచు నూరకుండును.)

యశో—రాధా! నేనన్నది నీకు పరిహాసముగాఁ దోఁచినది. చూచితివా. నిముసములో నేడ్పు చాలించి కిలకిల నవ్వుచున్నాఁడు.

రాధ—అట్లేమియుఁ గాదు. నిద్రవచ్చుచున్నది గావున నేడ్చి యేడ్చి యూరకున్నాఁడు. కమలా! నీ వెత్తుకొనవే, యూరకొనునో యూరకొనఁడో చూతము.

కమల—(ఎత్తుకొనఁ గృష్ణుఁడు మరల నేడ్వఁగా) అయ్యో! గుక్కదిప్పకుండ నేడ్చుచున్నాఁ డిదియేమోనమ్మా! నాయొద్దనుండఁడు. చంకనుండి జారిపోవుచున్నాఁడు. నీకును కృష్ణునకే తగునమ్మా! (ఇచ్చును)

యశో—చూచితివా ? నీచెంతనున్నచో నూరకున్నాఁడు. రాధా
మీయింటికిఁ దీసికొనిపోయి యేడ్పుమానినతర్వాతఁ దీ
కొనిరావే.

రాధ—ఏమోయమ్మా ! నీకొడుకు చాలదుడుకువాఁడు. నాచెంతనుం
డునో, యుండఁడో ! నీయొద్దనేయుంచుకొనుము (యశోద
యఁబోవఁ గృష్ణుఁడేడ్చును.)

యశో—అదిగో ! నేఁజెప్పలేదా? మీయింటికిఁదీసికొనిపొమ్ము.

రాధ—అట్లైనవమ్మా (అనినవ్వి) ఏమేకములా ! ఇందిరా ! మీరింటి
వచ్చెదరా ! కొంచెముసేపిచ్చటనేయుందురా? (తెరలో) అమ్మా

రాధ—అదిగో మారాముఁడు బిలచుచున్నాఁడు. నే బోయెద.

కమల—సరే ! అట్లయిన మేమును మాయిండ్లకుఁ బోయెదము

(అని యందఱు నిష్క్రమింతురు)

రంగము.—రాధగృహము.

(13 అనుబంధము.)

(రాధప్రవేశించును.)

రాధ—(శ్రీకృష్ణునొడిలో నిడుకొని)జగన్మోహనా! శ్రీకృష్ణా; ఇప్పటి
నుండియు నాయందింతప్రేమయా ? ఏమి నాయదృష్టము ! ఈ
వ్రేపల్లెలో నాకన్నధన్యులెవ్వరు ? నావలె నింకొకరు నిన్ను
సేవజేయలేదు. నిన్ను జూడకున్న నేను క్షణకాలమైన నిల్వ
గలనా ? నీదివ్యమంగళవిగ్రహసందర్శనమే నాయానందము.
నీయానందమే నాసర్వస్వము. రాధ వేఱును కృష్ణుఁడు వేఱు
ను గాఁజాలరు. వారికి భేదములేదు. రాధాకృష్ణుల నామైక్య
మందే సారస్యమున్నది. అందే మాధుర్యమున్నది. అందేయ
మృతమున్నది. అందులకే నేను నిన్నింతగాఁ బ్రేమించుచున్న

దానను. అజ్ఞులకు, మూఢులకు, పామరులకుఁ గళంకితముగఁ గనంబడును గాని, నిశ్చయముగా నాప్రేమము నిష్కళంకము. పవిత్రము. శాశ్వతము. రాధాకృష్ణమహామంత్రము చతురక్షరవిరాజితము. "రాధాకృష్ణులు" అను పంచాక్షరి తప్పక ఫలమిచ్చును. కృష్ణా! రాధాకృష్ణా! రాధాకృష్ణా! రమ్ము. రమ్ము. సుగంధతైలముతో నీ వెంట్రుకలను జిక్కుదీసి కోమల కుసుమదామములఁ దురిమెదను. నీసేవఁ జేయుటయే నాకుఁ గర్తవ్యము. నీయాజ్ఞానిర్వహణమే నాప్రయోజనము (అని తలదువ్వి మల్లెపువ్వులు దండలుగట్ట ధరింపఁజేసి) కృష్ణా! ప్రాణనాథా! నీమొగమును దిన్నగ నిల్పుము. నీకుఁ గస్తూరి బొట్టుదిద్దెదను. కదలకుము. (అని తిలకము బెట్టి) ఇదిగో! ఈఫలముల బుచ్చుకొమ్ము. ఈనవనీతమును భక్షింపుము (అని తినిపించి మూతిగడిగి మాటిమాటికి ముద్దుబెట్టుకొనుచు) కృష్ణా! నీవిఁక నిద్రింపుము. నీకొఱకు విరిజాజులు దెచ్చి శయ్యయేర్పఱచితిని.

కృ—(తనలో) ఆహా; యేమి యీప్రేమమాధుర్యము. కొంచెమీమెను సంతోషపెట్టెదఁగాక! (ప్రకా) అత్తా! అట్లే (అని రాధప్రక్కఁ బరుండి తనలో) ఇప్పుడు నిద్రించుచున్నట్లు నటించియీమె మనోభావంబును గన్పెట్టెద (కన్నులు మూయును.)

రాధ—(కృష్ణు నాపాదమస్తకముఁ జక్కఁగాఁ దిలకించి ఆహా! బాలుండయ్యు నీజగన్మోహనాకారుఁడు తన యసమానలావణ్యంబున మన్మథునైన, గ్రిందుసేయఁజాలి యున్నవాఁడు. విచారించిన నీకుమారుడు జన్మించినది మొదలుకొనియదేమో కాని నాచిత్తబు మోహాక్రాంతంబై యున్నది. ఒకక్షణమైన నేతద్విరహంబు

న కోర్వఁజాల. (కృష్ణునుద్దేశించి) శ్రీకృష్ణా ! నాచిన్నికృష్ణా నాప్రాణనాథా ! నాప్రాణప్రియా! నిక్కము వచించెద. ధరణీందుప్రిఁ డెఱిఁగి దండించినదండించుఁ గాక ! అత్త మామ లెఱిఁగి యారడిఁబెట్టిన బెట్టుదురుగాక ! తల్లిదండ్రులెఱిఁగి యెడఁబాసిన బాయుదురుగాక ! బంధువు లాదరింపకున్న నాదరింపకుందురుగాక ! ఇతరులెఱింగి చులుకగాఁజూచినఁ జూతురుగాక ! యింతియేల ! ప్రాణేశ్వరుఁ డెఱింగి ప్రాణంబులఁ దీసినదీయునుగాక ! మనోవాక్కాయ కర్మంబులచే నిన్ను విడువఁజాలను. విడనాడి బ్రదుకఁజాలను. చిన్నికృష్ణా ! ఎన్నఁడు నిన్ను గూడి సౌఖ్యములనుభవింతునో, యెన్నఁడు నీవు పెద్దవాఁడవై నాయనురాగవృక్షంబును ఫలవంతముగ నొనరింతువో, యెన్నఁడు నాయపావనప్రసూనమునీకర్పింపఁబడునో, యెన్నఁడు నా విచారాంధకారము నీ ప్రేమసూర్యకిరణంబులచే పటాపంచలై పోవునో, నాకీ జన్మమున నట్టిభాగ్యము చేకూరునా ? నామనోరథము సిద్ధించునా ? నాతపంబు పండునా ? నానోములు నాకభీష్టప్రదంబులగునా ? ప్రాణనాథా ! ప్రాణప్రియా ! ప్రాణేశ్వరా ! ఏ మొక్కటనని తలంపకుము. ఈ గోపికలెల్లరు నీ దాసీజనములే.

సీ. నీయధరామృత ౹ నిర్ఝరంబులు నేఁడు
   సేరి వాతెరలపైఁ ౹ జిలుకకున్న
నీవిశాలాంచిత ౹ నిర్మలవక్షంబు
   కుచకుట్మలంబులఁ ౹ గూర్పకున్న
నీరమ్యతరహస్త ౹ నీరజాతంబులు
   చికురబంధమ్ములఁ ౹ జేర్పకున్న

నీకృపాలోకన । నివహంబు మెల్లన
నెమ్మొగంబులమీఁద । నిలుపకున్న
గీ. నీనవీనమాన । నీయసల్లాపంబు
కర్ణరంధ్రదిశలఁ । గప్పకున్న
నెట్లు బ్రదుకువార । మెందు జేరెదువార
మధిప! వినఁగదగదె । యాఁదుకుయిలు.

ఇప్పుడింటిలో మామలేదు భర్త లేదు. అత్త లేదు. ఇంకెవ్వరును లేరు. ఇట్టిసమయమున నీవేవయఃపూర్ణుఁడవైనచో నేనెట్లుందునో గదా! నేనెంతయానంద మనుభవించుచుందునో గదా! ఎక్కడిమాట! అంతయదృష్టము నాకు లభించునా!

కృ—(కన్నులు నులుముకొనుచు లేచి) అత్తా! ఏమేమో యనుకొనుచున్నావు.

రా—ఏమనుకొనిన నేమి లాభము.

కృ—లాభములేకేమి కొంచెము చెప్పుమా?

రా—ఏమియు లేదు.

కృ—సరే, నీవు చెప్పకున్న మానెగాని నే నొక్కటి చెప్పెదవినియెదవా?

రా—నాకు నీదాస్యముకన్న విశేషమేమున్నది! చెప్పుమట్లవిందును.

కృ—నీవు పోయి కవాటమును బంధించి రమ్ము.

రా—(నవ్వుచు) కృష్ణా! ఎందులకు.

కృ—అదిగో! నీవు ప్రశ్న వేయుచున్నావు. నీవసలే చెప్పకపోవచ్చును గాని నేను చెప్పినను వినఁగూడదా!

రా—(నవ్వుచు) చాలులే! నీవు చూపులకుఁ జిన్నవాఁడవే కాని నీ మాటలు—

కృ—అబ్బో, నీవిచారమంత యేమైనది! కిలకిల నవ్వుచున్నావు. నే నేదో నీకుమంచి చేయవలెననిన నీవు చిన్నవాఁడవని తిరస్కరిం

చుచున్నావే! నేను చిన్నవాఁడనా! నీవే యెంత పెద్దదానవు గాఁబోలు.

రా—(కృష్ణుని ముద్దిడుకొని) నీ టక్కరి మాటల కేమి? పోనీ! నీవు చెప్పినట్లుగనే తలుపు వేసి వచ్చెదనులే! (అట్లుచేసి) ఇంకఁ జెప్పుము.

కృ—చెప్పుట కే మున్నది? అది నీ యిష్టములో నున్నది.

రా—అదిగో: మరల నీ మాయమాటలు ప్రారంభించినావు. నీవు చెప్పఁదలచిన దేమో చెప్పుము.

కృ—సరే! నిన్నే మనను గాని, నేను పెద్దయగుట మంచిదా, ఇట్లే చిన్నగానుండుట మంచిదా?

రా—కృష్ణా! ఈనిమ్మపరీక్ష యెందులకు? నీ వెప్పుడు పెద్దవాఁడ వగుదువో యని గంపెడాసించి యున్నదాన, నయిన నేండ్లు రాకుండ నిప్పుడెట్లు పెద్దవాఁడ వగుదువు?

కృ—అట్లు శంకింపవలదమ్మా. చిన్నప్పుడు మాగురువుగారు వచ్చి నాకు రెండు మంత్రములను జెప్పెను.

రా—(నవ్వి) ఏమీ! నీవు మంత్రగాఁడవా!

కృ—మంత్రగాఁడనో, తంత్రగాఁడనో, యిప్పుడే చూచెదవులే!

రా—ఆ మంత్రముల పేరేమి?

కృ—వానిపేరుతో నీ కేమిపని? దాని మహిమ జెప్పెద వినుము. వానిని పఠించి చిన్నఁగాఁ గావలెనన్న చిన్నగా నగుదును. పెద్దగాఁగావలెనన్నఁ బెద్దగా నగుదును. అవి నాకు వచ్చును.

రా—(తొందరగ) అట్లయిన నిప్పుడే పెద్దవాఁడవు గమ్ము.

కృ—ఇదిగో పెద్దవాఁడనయ్యెదను. మంత్రము పఠింతునా! ఇంటిలో నెవ్వరును లేరు గదా

రా—ఎవ్వరు లేరు.

కృ—(కన్నులుమూసికొని) ఓకృష్ణుఁడా! రాధ జెప్పెనుఁ గావునఁ బెద్దవాఁడవుగమ్ము.

రా—(నవ్వుచు) ఇదేమిమంత్రము! ఇదేమి జపము!

కృ—(కన్నులు దెఱచి) అత్తా! నేను పెద్దవాఁడనైతినా?

రా—(పకపక నవ్వుచు) ఆ! యథాప్రకారమునకు మోసములేదు. (అని ఎత్తి ముద్దుపెట్టుకొనును.)

కృ—ఏమీ? అంతేనా? ఈసారి చూడుము. మంత్రమును బాగుగా పఠించెదను. (అని కన్నులు మూసికొని పెద్దవాఁడను గావలె నని పదిసారులనును; రాధ యూరక నవ్వుచు ముద్దుబెట్టుకొనుచుండును. కృష్ణుఁడు పెద్దవాఁడగును.)

రా—(బెదరి వెనుకకు తగ్గి యాశ్చర్యముతో) ఆహా! ఇదేమి వింత? ఈమనోహరుఁడు సామాన్యుఁడుగాఁడు. ఆదిదేవుఁడు. ఇమ్మహాత్ముని యవతారము వలన మేమందఱము పవిత్రులమైతిమి. మా పాపంబులు పటాపంచలై పోయినవి. మాకన్న ధన్యులు లేరు. మాకన్న నదృష్టవంతులు లేరు. ఆహా! ఇట్టివింతయెందైనఁ గలదా! ఆదినారాయణుఁడు తానొక చిన్నిశిశువు గావలసి వచ్చెను గదా! ఆహా! కాలమహిమ?

సీ. ఏబాములెఱుఁగక యేపారుమేటికిఁ
 బసులకాపరి యింటఁ బాముగలిగె
ఏకర్మములులేక యెనయునెక్కటికి నీ
 జాతకర్మంబులు సంభవించె
ఏతల్లి చనుబాలు నెఱుఁగనిప్రోడ య
 శోదచన్నులపాలు చూరవనేఁగె

ఏహానివృద్ధులు । నెఱుగని బ్రహ్మంబు
పొదిగిటిలో వృద్ధి । బొందఁజొచ్చె
గీ. ఏతపములనైన । నెలమిఁబండనిపంట
వల్లవీజనముల । వాడఁబండె
ఏచదువులనైన । నిట్టిట్టిడనరాని
యర్థమవయవముల । నందమొందె.

ఆదినారాయణా! అవ్యయానందసామ్రాజ్యసింహాసనాధీశ్వరా! శ్రీకృష్ణా!

సీ. ఏనీగుణములు క । ర్ణేంద్రియంబులుసోఁక
దేహతాపంబులు । దీఱిపోవు
ఏనీశుభాకార । మీక్షింపఁగన్నుల
కఖిలార్థలాభంబు । గలుగుచుండు
ఏనీచరణసేవ । నెప్పొద్దుజేసిన
భువనోన్నతత్వంబు । బొందఁగల్గు
ఏని లసన్నామ । మెప్పొద్దుభక్తిఁగోఁ
దడవిఁబంధసం । తతులువాయు
గీ. నట్టి నీయందు నాచిత్త । మనవరతము
నచ్చియున్నది నీయాన । నాన లేదు
కరుణఁజూడుము కంసారి । ఖలవిదారి
శ్రీయుతాకార మానిని । చిత్తచోర!

శా. నీపద్యావళు లాలకించు చెవులు । న్నిన్నాడు వాక్యంబులు౯
నీపేరం బనిసేయుహస్తయుగముల్ । నీమూర్తిపైఁ జూపులు౯
నీపాదంబులపొంత మ్రొక్కుశిరముల్ । నీసేవపై జిత్తముల్
నీపైబుద్ధులుమాకునిమ్ముకరుణ౯ । నీరేజపత్రేక్షణా!

కృ—(తనలో) ఈ తపస్వికి మోహాముదీరి భక్తిరస ముద్భవించినది

ఇంక నీమెను మోహావశురాలిగా నొనర్చెద. (ప్రకా) అత్తా ఇదిగో! నామంత్రము సఫలమైనది.

రా—(నవ్వి) కృష్ణా! అయిన నన్నిప్పు డేమిచేయమందువు.

కృ—నీవేమి చేయవలయునో? నేఁజెప్పవలయునా? నన్నెందులకుఁ బెద్దవాడవు గమ్మని కోరితివో అది కొంచెము జ్ఞాపకముఁ జేసికొనుము.

రా—నీవు మాయకాఁడవు. నీమాటలు మాయమాటలు. నీతో నెవ్వరు మాటలాడఁగలరు.

కృ—పోనిలే, నేనే చెప్పెదను. ఈ శయ్యపైఁ గూర్చుండుము.

రా—(నవ్వుచు గూర్చుండి ఇంక నేమి చేయవలయును.

కృ—నీనేత్రాంచలమువలె రసంబును వెదజల్లుచు, నీ నడుమువోలె పిడికిటఁ బట్టదగి, నీకుచ కుంభంబులవలె నఖంబులం గ్రుచ్చబడి, నీచిత్తంబువలె నమందరాగంబును బుట్టించుచు, నీగాత్రంబువలె గామక్రిదంబై నీయధరంబువలె రుచికరమై, యేది యుండునో దానిఁ దెమ్ము.

రాధ—(నవ్వుచు) ఓహో! తాంబూలమునకై యెంతకథ గల్పించితిరి! అట్టె తెచ్చి యిచ్చెదను. (తెచ్చిఇచ్చును.)

(తెరలో తలుపుగుద్ది) తలుపు తలుపు.

రాధ—(భయముతో) అయ్యో! ఇంకేమిసేయుదు! ఈసంతోషసాగరంబున మునింగి నానాథునకు భోజనపదార్థములను దీసికొని పోనైతిని క్షుధాకులుండై మహాక్రోధంబున వచ్చియున్నాఁడు. ఇంకేది తెరువు! ఈకృష్ణుఁడే శరణము (కృష్ణునితో) కృష్ణా! నానాథుఁడువచ్చి పిలుచుచున్నాఁడు.

కృ—అయిన నన్నేమి చేయుమందువు? నాకును భయమగుచున్న
యున్నది.

రాధ—ఇంకెట్లు?

కృ—ఇంకెట్లు?

రాధ—అతఁడు వచ్చిన నూరకుండునా?

కృ—అతఁడు వచ్చిన నూరకుండునా?

రాధ—ఈకష్టమంతయు నీవలనే వచ్చినది.

కృ—ఈకష్టమంతయు నీవలనే వచ్చినది.

రాధ—ఎట్లు?

కృ—ఎట్లు?

రాధ—నీవు పెద్దవాఁడ వగుటచేతనేగదా యింతవచ్చినది! నీవు చిన్న
వాఁడవుగనే యుండినచో నానాథుఁడు వచ్చికొంచెము కోపిం
చి యేయనుమానము లేక వెడలిపోవును. ఇప్పుడట్లు వెడ
లిపోవునా?

కృ—నీవు నన్నూరకొననీయక నీవేయింత జేసితివి. నీనాథుఁడు లోని
కివచ్చిన నన్నూరక విడచునా? ఇది మాయమ్మకు తెలియు
నో యేమో నన్నేల మాయింటికి రమ్మంటివి? (అని గడ గడ
వడఁకును.)

(తెరలో మరల తలుపుగుద్ది.

ఏమే, యింక నెంతసేపని యిట్లుందును. తలుపుదీయుదు
వా, లేదా?

రాధ—(భయముతో) కృష్ణా! చిన్నమంత్రము పెద్దమంత్రము నీకు
వచ్చునుగదా? నామనవి నాలకించి నాయందు దయయుంచి
యెప్పటియట్ల చిన్నవాఁడవగుము, లేకున్న నానాథుఁడు నన్ను
ను నిన్నును నూరక విడువఁడు.

కృ—(వెలవెలబోయి) అయ్యో! అత్తా! భయముచేత నేనామంత్రము ననలే మఱచితిని.

రాధ—మఱచిన నెట్లు? ఎట్లయిన జ్ఞప్తికిఁ దెచ్చికొనుము.

కృ—అత్తా! ఇప్పుడది జ్ఞాపకము రాదు. నేనేమి సేయుదును?
(తెరలో) కాళ్ళు కాలుచున్నవి. కడుపులో నాకలియగుచున్నది. తలుపింకను తీయుటలేదు. ఏమి మాటాడవు?

రాధ—అయ్యో! ఎట్లయిన జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము. ఊరకొనఁడు. తలుపు విరుగఁగొట్టియైన లోనికివచ్చును. వచ్చిన తవారుత (ఏడ్చును.)

కృ—అత్తా! నేనేమిచేయుదును! నాకుమాత్రము భయములేదా? నీ వెన్నియైనను నను ము. నాకదియిప్పుడు జ్ఞాపకము రాదు. కాని, నేనొక యాలోచన జెప్పెద వినియెదవా?

రాధ—సరే! ఏదో చెప్పుము.

కృ—నీనాథుఁ డెట్లయిన రాక మానఁడు. వచ్చి యూరకపోవువాఁడు కాఁడు, కావున మనమిద్దఱము కవాటము దెఱువక గొలువను గట్టిగాబిగించి కప్పుకొని పరుండుదము. మన యదృష్టంబున నొకవేళ మనలను జూడకుండఁ బోవునేమో?

(అని నిండ ముసుఁగు బెట్టుకొని పరుండుదురు.)

గొల్ల—(తలుపు విరుఁగగొట్టి లోపలప్రవేశించి నలుదిక్కులు వెదకి రాధనుగాక) ప్రతిదినము భోజనపదార్థములను దీసికొని వచ్చుచు నేడు తీసికొని రాకపోవుట కేమికారణము? తాను దినిపండుకొనినఁ జాలుననుకొనియెను గాఁబోలు! (వెదకి) ఎందును లేదే! ఒకవేళ పరుండియున్న దేమో? (నడచును)

రాధ—(ముసుగులోనుండి)కృష్ణా! ।కొంపమునిగినది. ఇతేవచ్చు చున్నాఁడు. అబ్బా!ఇప్పుడేనా పరియాచకము. ముందు సంగతి చారింపుము.

కృ—నీకేమియు భయము లేదు. నీవు గట్టిగ శాలువను బిగబట్టుము. నేనుపాయము నాలోచించెదనులే. (ఇట్లేయనుకొనుచుండురు

గొల్ల—(పోయిచూచి ఆహా! ఈపాపచరిత, ఈకల్మషవర్తన, నేను లే కుండఁ జూచి, కుక్షినింపుకొని పరపురుషునితోఁగూడి మం తనము గావించి నిద్రించుచున్నది. ఇంక దీనిని సహింపరాదు. (అని గొడ్డలినెత్తి) అయినను దొందరపడనేల? లేపియే చంపె దఁగాక! (అని ముసుఁగుదీయఁగా కృష్ణుఁడు రాధచెల్లెలగుకమ లయైయుండును.)

రాధ—(లేచి) నాథా! వచ్చితిరా? మీకొఱకు భోజనపదార్ధములన దీసికొని రావలయునని యింకను వేళగాకుండుటచేతఁగొంచెము పరుండి పోవుదమని నిద్రించితి. ఇంతవఱకుఁ దెల్వి రాలేదు. అయ్యో! మీకెంత యాఁకలియయ్యెనో? మీరెంత యాయా సపడితిరో? ఛీ! నాబ్రతుకేల? మీగండ్రగొడ్డలిచే నన్నిప్పు డే చంపుడు.

గొల్ల—(తనలో)ఆహా! నేదలంచిన దంతయు నధర్మము, ఈతన్వి మహాపతివ్రత. దీనిమాటలు సత్యమునకు దూరము గాజాలవు. కానియెడల భోజనపదార్ధములను బ్రతిదినము దెచ్చుచు నీ నాఁడేల లేకుండును! ఈనాప్రాణనాయిక మనస్సు నొప్పింపఁ గూడదు. (ప్రకా) నాకేమియుఁ దొందరలేదు. మీచెల్లె లె ప్పుడు వచ్చినది! ఏమివిశేషములు?

రాధ—అదియంతయుఁ దర్వాత చెప్పెదను. మొదట భోజనమునకు లెండు.

—అత్తా! నేనును బోయెదను.

ల్ల—ఏమేమి! చెల్లెలత్తా యనుచున్నది.

రాధ—ఓహో! ఈ పరిహాసమున కేమిలెండు. దాని ప్రారబ్ధము. లోకములో నెందఱు నత్తివాండ్రులేరు. కమలా! పొమ్ము. మఱొక్కప్పుడుకలిసికొందములే, (కృష్ణుండుపోవఁజూచి) నాథా! కమల చాలమంచిది. దానియుక్తి యింకొకరికి రాదు. సరిగాఁ బదిమాటలైన మాటలాడలేదు. అది యక్కాయని పిలువ మీ కత్తయని వినఁబడి యుండవచ్చును. లేకున్న నత్తివలన నట్లు ప లిక్కియుండును. మీరు వచ్చుటచే నిఁక నుండరాదని వెడలిపో యినది.

ల్ల—నాకు దెలియదా? అదిచాలమంచిది. నన్నుజూచిన నెప్పుడు నట్లే తొలఁగిపోవుచుండును. నాకాఁకలి యగుచున్నది. ఇంక భోజనము బెట్టుదువుగాని రమ్ము. (అని యిర్వురు నిష్క్రమిం తురు.(

రంగము.—యశోదగృహము.

(గోపికలతో యశోద ప్రవేశించును)

యశో—మీకంతకష్ట మేమివచ్చినది?

గో—మే మేమని చెప్పుదుము. చెప్పినమీకుఁ గోపమువచ్చునేమో!

యశో—కోప మేమి చెప్పుఁడు,

గో— మీకొడుకు చేయు దుడుకుపనులకు మేముతాళ లేకున్నాము.

కం. పడఁతి! నీబిడ్డఁడు మా
కడవలలోనున్న మంచి కాగినపాలా
పడుచులకుఁ బోసి చిక్కిన
కడవలఁబోనడఁచె నాజ్ఞ గలదో లేదో.

ఇంతియేగాక పిల్లలకుఁ బాలు లేవని బాలింత లెంత వారించిన నూరకొనక నీకుమారుఁడా వులకడకు దూడలవిడచెను. మేమసలే పేదవాండ్రము. ఆ పాలమ్ముకొన్నగాని మాపొట్టగడువదు. ఇంక మేమేమిసేయుదుమమ్మా!

2 గో—అమ్మా! యశోదాదేవి! నిన్న మొన్న బుట్టెనో లేదో కాని యిప్పుడే దొంగతనమున నారితేరినాఁడేమమ్మా? మొన్నటిదినమున మాయింటికి వచ్చి యుట్టిమీదనున్న మీగడ, పాలు, అందకుండుటచే ఱోళ్ళు పీటలు ప్రోగుజేసి వానిపై నెక్కి యక్కడికి నందకుండుటచేఁ గుండకు రంధ్రము సేసి తానుద్రాగినంత త్రాగి తక్కినది పారబోసి మేమింటఁ బ్రవేశింపగానే పారిపోయెను. ఇదిగో! చూడుము (పగిలినకుండనుజూపి) ఇంతియేగాక నిన్నటిదినము మరలవచ్చి.

క. వెన్న దినఁగ రాఁడగని మా
పిన్నది యడ్డంబువచ్చి । పిరిదికి దివియన్
జన్నొడిసిపట్టి చీరెను
జిన్నికుమారుండె యితఁడు । సీతాంశుముఖీ

క. చేబంతి తప్పిపడెనని
ప్రాబల్యముతోడవచ్చి । భవనము వెనుకన్
మాబిడ్డ జలకమాడఁగ
నీబిడ్డఁడు వలువదెచ్చె । నెలతుక! తగునే?

3 గో—అమ్మా! ఇట్టివి చెప్పఁదలంచుకొన్నచో వేలకు వేలు జెప్పవచ్చును. వానికేమిగాని, యిది పెద్దవింత వినుము.

క. కొడుకులు లేరని యొక సతి
గను వగవగ దన్ను మగని । గాఁగైకొనినన్
గొడుకులు గలిగెదరని పైఁ
బడినాఁడిది వినుము శిశువు । పనులే తల్లీ.

గో—అమ్మా! అన్నియు సరే కాని, నీకే మహదైశ్వర్యమున్నచో నందఱికన్న నింత నాలుగుమారు లెక్కువ తినుము. ఇంక నాలుగు మంచిసొమ్ములు మంచివస్త్రములు ధరింపుము. అంతియేగాని నీకొడుకు నిట్లు మాపై విడిచి యల్లరి చేయింపవచ్చునా? ఇంకఁ బెక్కుమాటలతోఁ బనిలేదు. మా మనోనిశ్చయమును వినుము.

క. ఓయమ్మ! నీకుమారుఁడు
మాయిండ్లను బెరుగుపాలు మననీఁడమ్మా
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభులాన మంజులవాణీ.

యశో—మీరెప్పుడును నాకుమారునిపై నేవో నేరములు చెప్పుచునే యుందురు, ఇన్నినాళ్ళకు లేక లేక వాఁడొక్కఁడు పుట్టినాఁడు. వాఁడును జాల మంచివాఁడు. వాఁడిట్టిపనులను జేయునా?

(14) అనుబంధము.

క. చన్నువిడచి చన డిట్టటు
నెన్నఁడు బొరుగిండ్ల త్రోవ నెఱుఁగఁడు నేఁడుం
గన్నులుదెఱవని మాయీ
చిన్నికుమారకుని రవ్వ సేయందగునే.

గో—(కోపముతో) ఎన్నఁడును నిన్నువిడచి యిట్టిటు రాఁడుగా? యెన్నఁడును బొరుగిండ్ల త్రోవనే బోవఁడుగా? అవునమ్మా! యెవ్వరిపిల్లఁడు వారికేముద్దు. కన్నులు సైతము దెరువఁడేమి? చిన్నవాఁడు. పాపము. మేము లేకుండఁజూచి యొంటరిగావచ్చి వెన్న దినుచుండగాఁ బట్టుకొని యిప్పుడే కట్టివేసి వచ్చితిని. మామాటలే యసత్యములో, మీపిల్లవానిమాటలే యసత్యములో, యొక్కసారి మాయింటికివచ్చి చూతువుగాని రా.

యశో—రానక్కఱలేదు. చూడనక్కఱలేదు. ఈమాటలవలననే సత్యము తేలినది. భోజనముఁబెట్టి మీరువచ్చితిరని యిప్పుడే గదా వచ్చితిని. ఇంతలో నిన్నికల్పనములా?

1 గో—నీ వాడు మాటలన్నియు విచిత్రములుగా నున్నవి. సరే! మావి కల్పనలైన నగును గాని, యేడీ మీయింటనున్నాఁడేమో పిలువుము.

యశో—అయిన నేనే కల్పించితిననియా, నీయభిప్రాయము?

1 గో—ఎవరుకల్పించిన నిపుడేమిలే. ముందుబిలువరాదా.

యశో—కృష్ణా! నీవొక్కమారిటురా.

కృష్ణు—(యశోదవీపుపైఁ జేయివైచి తనసంగతి జెప్పిన ముక్కుగోయుదునని సంజ్ఞజేయును.)

1 గో—అమ్మా! చూచితివా? తనసంగతి జెప్పినచో—

కృష్ణు.—(యశోదయొక్కయు, గోపికయొక్కయు నడుమనిలచిగోపిక నోరుమూసి) అమ్మా! నన్నెందులకుఁ బిలచితివి.

1 గో—(బలవంతముగాఁ జేయిదీసికొని) అమ్మా! నానోరుమూయుచున్నాఁడు. చూచితివటమ్మా. నీకన్నులయెదుటనే జరుగుచున్నను నమ్మకున్నా విదియేమమ్మా?

యశో—ఏమో యిదియంతయుఁ జిత్రముగానున్నది. ఇంక మీరింటికిఁ జనుఁడు. ఈనాఁడుమొదలుకొని యింక మీయిండ్లకు రాకుండఁ జేసెదను లెండు.

గోపికలందరు—అమ్మా! ఇంకఁ మేము భరింపఁజాలము. ఇంకనైన మాయిండ్లకురాకుండ తగుశాస్తి జేయుము. (అనినిష్క్రమింతురు)

కృ—అమ్మా! నేను గోనికిపోయి అన్నయ్యతోఁ బద్యాలుజెప్పించుకుంటూ. నేనెచ్చటికిపోనమ్మా! నామీఁద అంతా లేనిపోనిఅబద్ధాలు చెప్తుతారు. వారిమాటలు నమ్మకు.

యశో—సరే పోదువుగాని యొక్కముద్దిచ్చిపొమ్ము. (ముద్దుపెట్టుకొని పంపి) వీఁడెప్పుడును యిల్లువదలియే యుండడు. పొరుగిండ్లకెప్పుడును పోయినట్లే కనుపట్టదు. ఈగోపికలందఱునూ, మాయింట వెన్నదినెనని యొకతెయు, మాయింటమీఁగడఁదినెనని యొకతెయు, మాయింటఁ బెరుగుద్రాగెనని యొకతెయు, మాకోడలిని జేయరాని పనులు జేసెనని యొకతెయు నిట్లే ప్రతిదినమును వచ్చి చెప్పుకొని దుఃఖించుచుండిరి. వీరికసత్యమాడనంత యవసరమేమి వచ్చినది? వీరిమాటలను నమ్మిదండింతునన్న బ్రత్యక్షముగాఁ జూడక యెట్లుదండింతును. తప్పుచేసినను మాచిన్నికృష్ణయ్యను దండింప నాకుఁ జేతులాడునా? ఇదియునుంగాక మొన్న పూతనం బరిమార్చుటయు, శకటాసురుని భంజించుటయుఁ, దృణావర్తుని నిర్మూలించుటయుఁ, జూడగా మహాపురుషుఁడైనట్లు తోఁచుచున్నది. ఏకారణముచేతనోగాని నాముద్దుకృష్ణునిపై నాకొకసారి పుత్రప్రేమయు నొకసారి దైవభక్తియుఁ గల్గుచున్నది. ముందుజూచి (విస్మయముతో) ఇదియేమి యీగోపాలబాలురుమాకృష్ణునట్లు లాగుకొనివచ్చుచున్నారు! ఏమితగవులు బెట్టుకొనిరో? (గోపబాలకులు కృష్ణునిలాగుకొనుచుఁ బ్రవేశింతురు.)

గోపబాలకులు—రా, రా, ఇవ్వాళ్ళ నిన్నూరకవిడిచిపెడతామనుకున్నావేమ్ లే.

కృ—ఊఁ. ఊఁ. ఊఁ. నేనురాను (తేలగిలబడును)

గోపబా— రావూ? రావూ? రాకున్న మీయమ్మను బిల్చుకొనిరామా?

కృ—ఊఁ. ఊఁ. నాసంగతిమీకెందుకు? మిమ్ములనేమన్న అన్నానా? గోవిందా! నేనక్కడ ఆడుకోవటంలే? నిన్నేమైన అన్నానా?

ఉద్ధవా! నీవు చెప్పుము. నీవు చూచుచున్నావా? లేదా? నిన్ను గాని యింకెవ్వరినైనగాని యేమయినా అన్నానా?

గోపబా—(లాగుకొనిపోయి) అమ్మా యశోదమ్మా! చూశావా! మీకృష్ణుడున్నూ మేమున్నూ ఆడుకొంటూవుంటే మీయబ్బాయి వద్దువద్దు అని యెంతఅన్నా వినకుండా యెంతమన్ను దిన్నాడో? నేలపై నెంత ప్రేమయున్నదమ్మా!

యశో—(కోపముతో) ఏమికృష్ణా! ఎందుకు మన్ను దిన్నాడవురా? పైగ వాండ్రు చెప్పినను వినకపోయితివా? సరేలే! నీసంగతి మొదటినుండి యేమియు బాగుగ లేదు. ఎప్పుడును ఏదో యింటిమీదికిఁ దెచ్చుచుందువు. మనయింటిలోఁ దినుటకు వెన్న లేకపోయెనా, మీగడ లేకపోయెనా? మన్నుదినునంత గ్రహచారమేమివచ్చినది?

క. మన్నేటికి భక్షించెదు
మన్నియమము లేల నీవు మన్నింపవు మీ
యన్నయు సఖులును జెప్పెద
రన్నా మన్నేల? మరిప దార్థము లేదే?

కృష్ణు—అబ్బా! అబ్బా! వారిమాటలే నమ్మెదవేమమ్మా! అవియన్నియు నబద్ధాలు. నేనెందుకు మన్ను దినెదను. నాకేమి వెఱ్ఱియా?

వారిమాటలనలే నమ్మవద్దు. వెన్న దినుచుండ నడిగినఁ బెట్ట లేదని నామీఁద కొండెములు చెప్పుచున్నారు.

యశో—చాలులే, యింక నూరకొనుము. మొదటినుండియు నివిట్లే చేయుచుంటివి. నీకు సత్యాసత్యములు లేవు. నీవొకరికి లోఁబడి యుండువాఁడవుగావు. నీకొకరితోఁ బనిలేనట్లే దోఁచుచు

న్నది. నీవు కొండికవయ్యును యింతటికన్న మాటలు చాల నేర్చి
తివి. వీరెవ్వరును నసత్యమాడువారు కారు.

(15) అనుబంధము.

కృష్ణు—అమ్మా ! అయిన వారిమాటలే నమ్మెదవు కాని నామాట
లు నమ్మవా ?

శా. అమ్మా ! మన్ను దినంగ నే శిశువునో నాకొంటినో వెఱ్ఱినో ?
నమ్మంజూడకు వీరిమాటలు మది న్నన్నీవు గొట్టంగ వీ
రీమార్గంబు ఘటించి చెప్పెదరు కా దేనిన్ మదీయాస్యరం
ధ్రమ్మాఘ్రాణము జేసి నావచనముల్ తప్పైన దండింపవే.

యశో—ఏదీ తెఱువుము (కృష్ణుఁడు నోరు తెఱచును విశ్వరూపము గ
నంబడును.) (ఆశ్చర్యముతో) ఆహా! యిదేమి ? చిత్రముగాను
న్నదే ! బ్రహ్మేంద్రాది దేవతలకును, నారదాది మహాయో
గీంద్రులకును దుర్లభంబైన శ్రీమన్నారాయణుని విశ్వరూపం
బును గన్నులార గాంచు భాగ్యంబు లభించినది. ఇది ప్రపంచ
మేనా ? ఇది వ్రేపల్లెయేనా ? ఇది మాగృహమేనా ? నేను
యశోదాదేవి నేనా ? ఏమో! యిదియంతయు నత్యద్భుతముగా
నున్నది. నాకుఁ జిత్తవిభ్రాంతి గల్గినదేమో ?

మ. కలయో ? వైష్ణవమాయయో ? యితర సంకల్పార్థమో సత్యమో
తలపన్నేరకయున్నదాననో ? యశో దాదేవి గానో ? పర
స్థలమో ? బాలకుఁడెంత ? యీతనిముఖ స్థంబై యజాండంబు ప్ర
జ్వలమై యుండుట కేమి హేతువో మహా శ్చర్యంబు చింతింపఁగన్.?

(అని శ్రీకృష్ణునకు సాష్టాంగనమస్కారంబు జేసి) స్వామీ ! చరాచర
మూలకారణా ! నారాయణా ! నీమహిమ నెవ్వరెఱుంగఁగలరు.

నిమాయను బ్రహ్మేంద్రాదులు దెలియలేనప్పు డింక నేనెం
దానను.

సీ. జగదీశ ! యోగీశ ! సర్వభూతాధార !
సకలసంపూర్ణ ! యీశ్వర ! మహాత్మ
కాత్మగతజ్యోతి వై వడి నిఖిలభూ
తములందు నొకఁడవై తనరుదీవు
సద్బోధుఁడవు గుహాశయుఁడవు సాక్షివి
నీయంతవాఁడవై నీవు మాయఁ
గూడి కల్పింతువు గుణములవానిచేఁ
బుట్టించి రక్షించి పొలియఁ జేయు

గీ. దీప్రపంచమెల్ల సృష్టి నీవిప్పుడు
రాజమూర్తులైన రాక్షసులను
సంహరించి భూమి చక్రంబు రక్షింప
నవతరించినాఁడ వయ్య కృష్ణా !

కృ—(తనలో) ఓహో! ఈయమ యనన్యభక్తిజ్ఞాన సంపన్నురాలైన
ఇంక మాయఁగప్పకున్న వీలులేదు. (ప్రకా) అమ్మా
చూచితివా ! నానోటిలో మన్నుగలదేమో చూచితివా? ఇ
టికైన వీరిమాట లబద్ధములని నమ్మెదవా ?

యశో—అవును. నాయనా! నీమాటయే సత్యము. బాలకులారా
మీరు పొండు. (బాలకులు నిష్క్రా) కృష్ణా! నేను పెరుగు
చ్చుచుండెదను. నీ వల్లరి సేయక యిటనే యుండి యాడుక
నుచుండుము. అని (చల్ల జేయుచుండును.)

కృ—(తనలో) నాకొఱకై కాచుకొని నన్ను నిరంతరము స్మరించు
న్న నాభక్తులగు నలకూబరమణిగ్రీవులను శాపవిముక్తులగావిం
వలయును. దీని కేమియుక్తి బన్నుదు. అవుగాక ! ఇప్పుడు

దొంగతనము బయలు జేసెదను. (యశోద చుట్టు దిరుగుచు) అమ్మా నాకు కొంచెము వెన్న బెట్టుము. నాకాఁకలియగుచున్నది. (యశోద వెన్న బెట్టి రెక్కబట్టి యవ్వల గూర్చుండ బెట్టి) నాయనా! ఆడుకొమ్ము. (అని చెప్పగా తిరిగివచ్చి వెన్న దిచ్చుచున్న యశోదపై బడి వెన్న బెట్టుమని యడుగును; తిరిగి యశోద కొంచెము పెట్టును. మరల నడుగును. తిరిగి పెట్టి ముద్దిడుకొనును. తిని యశోద చూడకున్నప్పుడు చల్లలో జేయి బెట్టి కెలికి నాకును యశోద కోపింప నేడ్చుచు ఊఁ ఊఁ అని గారాబము చేయుచు ఆమె పైబడి చీరెకుఁ బూయును.)

యశో—(కోపముతో) ఏమి రాయిది! చేతిమన్నంతయుఁ గలిపి చేసిన చల్లంతయు నాగము చేసితివి. ఇంత పొద్దెక్కినది; యేపనియు గానీయవు.

)—(కవ్వము బట్టుకొని యేడ్చుచు) అమ్మా! నా కాఁకలియగుచున్నది. కొంచెమైన పాలిచ్చినఁగాని నిన్ను విడువను.

యశో—ఇచ్చెదనుగాని యీ పీటపైఁ గూర్చుండుము. పాలు పొంగిపోవుచున్నవి. దింపి పాలిచ్చెదను. (అని పీటపైఁ గూర్చుండ బెట్టి పాలుఁ దింపఁబోవును.)

)—(మూల్గుచు) ఆఁ ఆఁ ఆఁ ఆఁ నా కాఁకలియగుచున్నను కొంచెము పాలిచ్చి పోక పాలు దింపఁబోయెదనా? ఆఁ ఆఁ (అని కవ్వముతోఁ గుండఁ బగులఁ గొట్టి వెన్న దిని పారిపోవుచుండును)

యశో—(పాలు దింపి వచ్చి కుండను జూచి) ఏఁడీ వాఁడు? ఎచ్చటికిఁ బోయెను? కృష్ణా! కృష్ణా! ఎందుబోయెదవు? (బట్టుకొనఁ బోవును)

)—(తప్పించుకొని) అమ్మా! నేనేమియు నెఱుంగను.

యశో—నిన్నేమియు నననుం. పాలిచ్చెదరమ్మా.

కృ—(చేయి చూపుచుఁ నాకిప్పుడు వలదు. వలదు. (అనియటునిటు
దిరుగుచుఁ బట్టుబడకయుండును.)

యశో—వీఁడు చేయుపనులకుఁ గోపింతునా? వీఁడుపల్కు పల్కుల
కు సంతసింతునా?

సీ. బాలుఁడీతండని | భావింతునందునా
యేపెద్దలును నేర | రీక్రియంబు
వెరపెఱుంగుటకునై | వెరపింతునందునా?
కలిగి లేకాక్కఁడు | గానిలేడు
వెరపుతో నా బుద్ధి | విన్పింతునందునా?
తనుదానయై బుద్ధి | దప్పకుండు
ఒండెఱుంగక యింట | నుండెడినందునా?
జొచ్చిచూడని దాక | చోటులేదు.

గీ. తన్ను నెవ్వరైన | దలపోయఁ బాఱెడి
యోజలేదు భీతి యొకటి యెఱుఁగఁ
డెలమి నూరకుండఁ | డెక్కసక్కములాఁడుఁ
బట్టి శాస్తి సేయు | భంగి యెట్లు?

(అటునిటు పరుగెత్తి యెట్లో కృష్ణుని బట్టికొనినప్పుడు) ఓహోహో

క. వీరెవ్వరు శ్రీకృష్ణులు
గారా యెన్నఁగను వెన్న | గానరఁటగదా?
చోరత్వం బించుకయును,
నేరరఁట ధరిత్రి నిట్టి | నియతులుగలరే.

ఇంకెక్కడి కేగెదవు? పాలిచ్చెదననినకొలఁది వినక కుండ బ్రద్దల
జేసి నన్నింతసేపటినుండియుఁ ద్రిప్పలుపెట్టెదవా? అబ్బబ్బా! పుట్టినప్ప
టినుండియు నీ చేష్ట లిట్లే యున్నవి.

సీ. తోయంబు లివియని । తొలఁగక చొచ్చెదు
తలఁచెదుగట్టైనఁ । దరల నెత్త,
మంటితో నాటలు । మానవు కోరాడె
దున్నతస్తంభము । లూపఁబోయె
దన్యులనల్పంబు । లడుగంగఁ బోరెదు
రాచపేటలచాల । రవ్వదెచ్చె
దలయవు నీళ్ళకు । నడ్డంబుగట్టెదు
ముసలిపై హరివృత్తి । మొనయఁజూచె
గీ. దంబరంబు మొలకు । నడుగవు తిరిగెద
వింకఁ గల్కితనము । లేల పుత్రి!
నిన్ను వంపవ్రాల్ప । నే నేరననియో నీ
పట్టు క్రిందుమీఁదు । నెఱుఁగకునికి.

నాకుఁగాక యింకొకరికి నిన్ను బట్టుకొనవశమా? ఇప్పుడు నిన్ను విడచిపెట్టినచో (రోలుకుగట్టి) ఇంక నెక్కడికిఁ బోయెదవో పొమ్ము. అల్లరిచేసెదవా?

(16 అనుబంధము.)

కృ—ఊహు ఊహూ (అని తలనాడించును. యశోదనిష్క్రమించును.)

కృ—ఇంక నిబంధనమే భక్తులబంధనము బాపుఁగాక! (అని రోలీడ్చుకొని పోవును. తెరయెత్తగా నరణ్య మగుపడును. అట నున్న రెండుమద్దిచెట్లనడుమకు రోలీడ్చుకొని పోవును. చెట్లు విరిగి నలకూబరమణిగ్రీవులు స్వస్వరూపము నొందుదురు.)

నల—మణి—(చేతులుజోడించి) దేవాదిదేవా! నారాయణా!

ఉ. వారిజనాభ భక్తజన । వత్సల! దుష్టమదాసురేంద్ర సం
హార! సరోరుహాసన! పు । రారి ముఖామరవంద్యపాదపం

కేరుహా! సర్వలోకపతి! కీర్తితదివ్యమహాప్రభావ! సం
సారవిదూర! నందతనుజాత! రమాహృదయేశ! మాధవా!

స్వామీ! మేము ధన్యుల మైతిమి. మా శాపంబులు విముక్తి నొందె ను. మేమిద్దరము కుబేరు పుత్రులము. నలకూబరమణిగ్రీవు లను వారము. మే మొకనాడు మా కాంతలతో నాకాశగంగయందు జల క్రీడ గావించుచుండ నారదుడచ్చటికి విచ్చేసి, మేముమా సంతోషాం బుధి మునింగి తన్ను గౌరవింపకుండుటచే గనలి మద్దుల మానల్లుశా పంబిడి క్రమ్మర మా ప్రార్థనమున దయార్ద్రచిత్తుండై భవదనుగ్రహ మున శాపవిమోచన మగునని యానతిచ్చె. నేడు నీకటాక్షంబునం జేసి కృతార్థులమైతిమి. బ్రహ్మాదులును నీమహిమ నెఱుంగజాలరు.

సీ. విశ్వంబునీవయై విశ్వంబుజూచుచు
విశ్వంబు సేయుచు విశ్వమునకు
హేతువవైపంచ భూతమాత్రేంద్రియ
ములకుమనఃప్రాణ బుద్ధిచిత్త
ములకెల్ల నాత్మవై మొనసిగుణంబుల
నావృతమగుచుని జాంశభూతి
మగునాత్మచయమున ననుభూతిచేయుచు
మూఢహంకృతులచే మునుగువడక.

గీ. నెరినంతుండవై దర్శ నీయరుచివి
గాకసూక్ష్ముండవై నిర్వి కారమహిమ,
దనరికూటస్థుడన సమో స్తంబు నెఱుంగు
నీకు మ్రొక్కెదమాలింపు నిర్మలాత్మ!

ఇంక మాకు సెలవిమ్ము (నిష్క్రమింతురు.)

కృ—ఇంక నిందు దడయ నేటికి. ఇంటికే పోయెదంగాక. (అనిరోలునీ డ్చుకొనుచు నిష్క్రమించును.) (తెరవ్రాలును.)



సంగీతకృష్ణలీల.

తృతీయాంకము.

(రంగము—బృందావనము.)

(లెక్కలేనిలేగలను దోలుకొనుచు చలిదికావళ్ళతో గొందఱు గోపబాలురును కృష్ణబలరాములును బ్రవేశింతురు.)

(18 అనుబంధము.)

కృ—అన్నయ్యా! మనమందఱ మీబృందావనంబున జక్కగా నాడుకొందమా?

బల—మంచిది. అట్లే కావింతము.

గో—కృష్ణయ్యా, యొకసారి వేణువు పాడుదూ, నీకు దండము పెట్టెదము.

కృ—ఓ, అంతకన్న నాకు సంతోషమేమున్నది. (అనియొకకీర్తన వేణువుతో గానముగావించును.)

అందఱు—(అందఱుసంతోషముతో గంతులుపెట్టుచు కృష్ణుని చుట్టు దిరుగుచు దాళములు వాయింతురు.) (ఇట్లే యాడుకొనుచుందురు.)

కృ—(తనలో) ఓహో! నీవిందు జొచ్చితివా! నేనెఱుఁగ నని తలంచితివి కాఁబోలును. (ప్రకా) బాలకులారా! మన లేఁగలన్నియును జక్కఁగా బచ్చికమేసి విచ్చలవిడిగా విహరించుచున్నవి. ఆహా! యివి యెంతయందముగా నున్నవి. అందులో నీలేఁగ మఱియు నానందముఁ గూర్చుచున్నది. అని యొకలేఁగకాళ్ళను దోకయు బిగబట్టుకొని వెలఁగచెట్టుకొమ్మ విఱిచి కొట్టును. గోపాలకులు సంతోషముతో గేకలు వేయుదురు. వత్సాసురుఁడు పడిచచ్చును.)

అందఱు—బలే? మంచి తమాసరాబలే? యిశిత్రింరా, సూడ్రా, సూడ్రా (గొంగడులను విసరివైచుచు ఉరుకుచుచప్పట్లు గొట్టుచు యేంకుట్టమూర్తివయ్యా! యేంకుట్టమూర్తివయ్యా!

కృ—ఇంక ఆడుకొందము రండు.

గో—కుట్టయ్యా; అదిగో! సూశావు. బలే? కొంగ జెపం సేత్తుందే మున్లాగ! అబ్బో అబ్బో, కదలుకుండున్నదే, దగ్గరికి బోయి సూత్తాంరాండి (అనియందరుఒకపెద్దకొంగదగ్గరికిబోయిచూతురు.)

కృ—(తనలో) స్వామి! తమరిక్కడ వేంచేసి యున్నారు. చాల సంతోషము. చాలసంతోషము. (అనిదగ్గరును) కొంగ తటాలున పెద్ద నోరుజాచి కృష్ణుని మ్రింగును.)

అందఱు—అయ్యో? కిట్టయ్యా! అయ్యో! కిట్టయ్యా! యేమైపోయినావు కిట్టయ్యా! మేమేంసేత్తుం కిట్టయ్యా! ఈపాడుకొంగ యెక్కణ్ణుంచి వచ్చిందో కిట్టయ్యా! అరే? సూత్తారేంరా, కొట్టండి పొడవండి పొడవండి సంపండి సంపండి బంగారంవొంటి కిట్టయ్యను మింగితే ఊరక యిడుత్తారా? రాళ్ళిసిరెయ్యరేంరా

(అని రాళ్లుకఱ్ఱలు మొదలగువానిని విసరి వేయుదురు. కొంగ కృష్ణుని గ్రుక్కును.)

కృ—(లేచి కొంగ దౌడలు చించును; కొంగ రాక్షసుఁడై పడిచచ్చును)

గో—అరేవ్! మన మిక్కడ వుండొద్దురా, పోదాం పదండ్రా! కిట్టయ్యమీఁద యేదో పాడుముండాకొడుకులు పగపట్టినట్లుంది. (అని యందఱు నడతురు.)

కృ—గోపాలబాలకులారా! మనము దఱమును జాలఁ బ్రయాసఁ జెందియున్నవారము. అదిగో! చక్కని కాసారము కనంబడుచున్నది. అక్కడి కేగుదము రండు (అని పోయి) ఓహో! ప్రియసఖులారా!

శా. ఎండన్ మ్రగ్గితి రాఁకటంబడితి రింకేలా విలంబింపఁగా
రండో బాలకులార! చల్దిగుడువన్ రమ్యస్థలం బిక్కడీ
దండన్ లేఁగలు నీరుద్రావి యిరవొందన్ బచ్చికల్ మేయుచున్
దండంబై విహరించుచుండఁగ సమంచత్ప్రీతి భక్షింతమే.

అందఱు—అదిగోరా కిట్టయ్య సెప్పుతుండాడు రాండిరా రాండిరా, సద్దెన్నం తిందాం రాండిరా, (అని యందఱు వచ్చి కృష్ణుని నడుమనుంచుకొని కూర్చుండుదురు.)

1. గో—వోరేవ్ నా కంచం సూశావురా, యెంత నున్నంగా వుందో? (రాయిచూపును.)

2. గో.—నీదేం బాగుందిరా, పట్టినల్లరాయి. నాదిసూడ్రా.

1. గో—నీ దేదిరా సూసేది.

2. గో—పెద్దాకురా!

3. గో—మా రింటినుంచి సిక్కాలు దెచ్చుకోలేదు కామట్టి రా

యి, లప్పలు వేసుకుంటారు. నాకేంగాచారంరా. మంచిసిక్క
వుంది.

4. ఇదిగో ! నేను సిగురంటాకులు దెచ్చానా౯. వారే ! వాడు
సూడు తీగెలుతీగెలే తెంపుకొచ్చాడేంరా. వారే
వెంకన్నా ! నూ వింత వెఱ్ఱినుండాకొడుకేందిరా ! యెంతకె
ఱ్ఱిగొల్ల(డైనా గడ్డిమీ(దనటా౯ తినటం.

1. అరే వుండా౯ యేందో సప్పుడౌతుంది.

2. ఏందిరా ఆ సప్పుడు ?

1. వారేవ్ వెంకన్నా. ఆ యెఱ్ఱన్నను సూశావు; పుల్లన్న దబా
దిబి గుద్దుతున్నాడా౯ పాపం.

2. వాడు మా పొగరుమోతులే, మొన్న యేదో ఊరికిబోయి సా
తానమ్మోర్నిగూడా యిట్లాగే కొట్టాడటా౯ ! సూత్తారేం సం
పండి. (అందఱు పుల్లన్నను కొట్టుదురు.)

పుల్లన్న—మీ కిదేం పోగాలంరా. నన్ను కొట్టారేంరా. కిట్టయ్యా !
సూడుసూడు నన్ను వీండ్లంతా కల్సి సంపుతున్నారు.

కృ—పుల్లన్న నెందుకు(గొట్టెదరు ?

2. ఈడెందుకు యెఱ్ఱన్నను గొట్టాలె.

పుల్ల—నన్ను కిట్టయ్యా యేను వాయిస్తున్నాను సూడమని సెప్పినారు.
సూత్తుంటే నా ఉల్లిగెడ్డకారం యెందుకా౯ జెయ్యాలా౯ ?

కృ—(నవ్వి) ఇందులకేనా ? నే నావకాయ పెట్టెదనుతిను. (అ
పెట్టును.

1. కిట్టయ్యా మామంచోడా౯ ! ఆయనంతమంచిమనిసే లేడు.
నాకుమాత్తరం పెట్టడ నో౯న్నావు ?

కృ—సరే నీవును తినుము. (పెట్టును).

2. (పుల్లన్నతో) నాకోయ్. ఉల్లిగెడ్డకారం. నీ క్కాస్తైనా బెత్తా ననుకొన్నావా ? ఏంబెట్లన్లే!

పు—నా కేంవొద్దు! నాకుమాత్తరం వూరగాయకారంలేదా?

2. ఏవూరగాయకారమైనా నాఉల్లిగెడ్డకారంమీాది కొత్తుందా ? లొటలొటలొట (అనియూరించుచు తనలో) ఇదే మంచిసమ్యాం (అని మూడవవాని పదార్థము తినును.)

3. ఇదేందిరా, నాకంచంలో దంతా కాజేసినావు ?

2. ఎబ్బే, నాకేందెల్సురా, నీ కంతసమ్మకం లేకపోతే నానోరు సూడు. నా నేపాపం యెర్గను.

4. సరేగాని, అంతేగాని, దానికేంగాని, దీనికేంగాని, కాని——

1. సంగతి యేందో సెప్పేసెయ్యావేందిరా. అట్లా గుంజాకో సత్తావు?

4. నామాటొర్నంతే, నీవ్వింటేఱుచు లేకపోతే లేసి పో.

1. సెప్పరా సెప్పరా

4. అడ్డెడు అన్నం తింటారని యూర్కే అని ఊర్కే తింటారని ఊర్కేతింటారని.

1. ఇఘు సాలిచ్చురా ? ఇట్లేక నచ్చిపోతుండాను.

4. ఓశ్ అబ్బా ! నీవు సక్కంగ మాట్లాడుతావుకామోసు. ఎవ డైన తింటాడా ?

1. అబ్బా ! బతికి బైటబడ్డావురా ?

4. ఎవడా ?

3. నీవు గాదురాస్, నేనా.

4. మరి నామాటకు జెబేబు సెప్పవేంరా. ఎబ్బే నీ సేతేం అవుతుంది.

5. లేకేంరా ! ఓ ! సాలామందియున్నారు. అడ్డెడు లెక్కం,పుత్త రమేం అంటా.

4. యేడ్చావులే. యెదవనాగన్నా.

1. ఊరక కొయ్యాటానికేంలేరా వాడట్లాగే కోస్తాడు.

6. ఏందిరా కోశేది ?

4. ఏందా ? నీ మొగం.

5. నీ మొగం యేందిరా ?

4. నీమొగం యేందంటే, లేతలేతసొరకాయలాఁ.

5. సూత్తావు మరి తమాసా ?

1. ఏత్తినాఁ.

5. తింటే యేం యిత్తావురా ?

1. మా అన్నం అంతా యిడ్సిపెట్టిపోతామాఁ.

5. సరే సూడు (అని తినలేక తినలేక తినుచు) ఓ ఉ ఉ. ఓ ఉ ఉ (డోకును)

4. పొరుసానికోసం తిన్లేక సత్తుండాడాఁ ముండాకొడుకు.

3. (ఒకపిల్లవానితో) నాన్నా ! ఒకనవ్వు నవ్వురా సూత్తాను.

పిల్లవాఁడు—(నవ్వును.) వాఁడు వాని పెరుగన్నము తినును. యేం యేం. యేం. నా అన్నం తిన్నాడు ఊ. ఊ. ఊ. (యేడ్చును)

2. పసిపూరగాడిదితినడం యేం రోగంరా ! నీది నీవు తినాఁదూ (అనిచావగొట్టును.) నాన్నా యింద తిను. తిను (అని తనయన్నము పెట్టును.)

3. కొడుతే కొట్టాడుగాని బలే పెరుగన్నంరా.

కృ—(చల్దిగుడుచుచు, చేతి కడ్డము రాగా వేణువును మొలలో దోపుకొని కఱ్ఱను జంకలో నిఱికించి యున్నపు ముద్దను చేతిలోఁ బెట్టుకొని) ఓహో ! సఖులారా !

మ. వినుఁడో బాలకులార ! కేళిపు లటవీ వీథిఁ మహాదూరముం

జనియెం గోమలఘాసఖాదనరతో త్సాహంబుతో నెందు బో

మెనొ? యేమయ్యెనొ? క్రూరజంతువులచే । నే యాపదం బొందెనో?
కని తెత్తుం గుడువుంను చల్ది గొరత । ల్గాకుండ మీ రందఱుఁ.

(అని పరిక్రమించి వెదకుచు) ఈవైపున నరిగినట్లున్నవి. ఇవిగో! అడుగుజాడ లగపడుచున్నవి. (కొంతదూరము నడచి వెదకుచు నిష్క్రమించును.)

బ్రహ్మ—(ప్రవే) ఈ బాలకుఁ డెవ్వఁడోగాని మహాసమర్థుఁడుగా నున్నవాఁడు నేనప్పటినుండియుఁ జూచుచున్నవాఁడ, ఈతని బల మెఱింగెదఁగాక! ఇప్పుడీ లేగలను గోపబాలురను దాచెద నేమి సేయునో చూతము (అట్లుచేసి నిష్క్ర)

(తెర వ్రాలును.)

1 రంగము:—బృందావనము.

(కృష్ణబలరాములు, లేగలు గోపబాలురును ప్రవే)

కృ—నన్ను వంచించుటకై చతుర్ముఖుఁడు గోవత్సంబులను దాచుటయు నేనును దత్తదాకారంబులను దాల్చి విహరించుచుండుటయు నేటికి సంవత్సరమైనది. ఇంతవఱకును వానికి మదీయసామర్థ్యంబు దెలియనట్లున్నది.

బల—(తనలో) ఆహా! ఇది పరమాశ్చర్యంబుగా నున్నది. పూర్వస్థితికిని, వర్తమానస్థితికిని జాల భేదంబు గన్పట్టుచున్నది. ఏలనన ?

సీ. చన్నుమానినయట్టి । శాబకశ్రేణిపై
 గోగణంబులకును । గోపకులకు
నబ్బంగి వాత్సల్య । మెబ్బంగి నుదయించె
 హరిఁ దొల్లి మన్నించు । నట్లు వీరు

మన్నించుచున్నారు ǂ మమత జేయుచుఁ బ్రీతి
నంబుజాక్షునిగన్న ǂ యట్లు నాకు
బ్రేమమయ్యెడి, డింభ ǂ బృందంబుగనుగొన్న
నిదిమహాద్భుతమెందు ǂ నెఱుఁగరాదు
గీ. మనుజదైవతదానవ ǂ మాయయొక్కొ
కాక నాభర్తయగుచున్న ǂ కమలనయను
మాయయో ? కాక యితరుల ǂ మాయ నన్ను
గలపనోపదువిభుమాయ ? గాగనోపు.

బ్రహ్మ—(దూరమున బ్రవేశించి) ఆహా ! యేమిది ? (అనిగుహాలోని గోగోపకులనుజూచి)

శా. మందంగల్గినవత్సబాలకులు నా ǂ మాయాగుహాసుప్తులై
యెందుంబోవరు లేవరిప్పుడును వే ǂ రేచేయనాకన్యులొం
డెంనున్నేరువిధాతలుం, బగులుపీ ǂ కెవ్వార, లెట్లైరొకో?
యెందే తెంచిరొకృష్ణుతో మెలగువా ǂ రేరియ్యెడన్ నేటికిన్.

యెంత విచారించినను దీనికి గారణం బెఱుంగరాకున్నది గదా ? చరాచరంబులగు నివియన్నియుబ్రహ్మవలననే గదా! సర్వకాలములయందును సంభవించుచుండును. అట్టి బ్రహ్మ నేను గాక యింకెవ్వఁడును లేడు. ఇంకెవ్వఁడును సృజింపఁజాలఁడు. అట్లచో బ్రహ్మనగు నేనుండగా నీగోవత్సంబులును గోపబాలురును నెట్లు సృజింపఁబడిరి. ఆహా ! ఇది పరమాశ్చర్యముగా నున్నదే.

కం. పుట్టితి బుద్ధియెఱింగితి
పుట్టించితిజగము సగము ǂ పోయెను బ్రాయము
బట్టితినూతనసృష్టులు
పుట్టుట లేదారయిట్టి ǂ బూమెలు భూమిన్.

దీనికేమో మహత్కారణ ముండక తీరదు. (చూచి) ఆహా ! అదిగో?! అదిగో ? బాలకు లందఱు నింద్రనీలచ్ఛాయలం గుఱుడించు శరీరంబు లలరార హారకుండలకిరీటవనమాలికలు ప్రకాశింప శ్రీవత్సచిహ్నంబులును కాంచనకంకణంబులును మంగళాంగదంబులును విలసిల్ల, శంఖచక్రాదిదివ్యాయుధంబులనుధరించి చతుర్భుజవిభ్రాజమానులై సుందరపీతాంబరపరిశోభితులై సచ్చిదానందరూపులై సాక్షాన్నారాయణుని యపరావతారంబులై ప్రకాశించుచున్నారు. అవురా?

ఉ. బాలురఁగంటి నాచెయిది । బాసినవారిని మున్నువారి నేఁ
గోలఁగఁ జూచునంతటన । భూరినిరర్గళమర్గమప్రభా
జాలముతోడఁ జూపులకు । జాలమిదెచ్చుచున్నవార, లే
మూలమొ? మార్గమెయ్యదియొ । మోసమువచ్చెఁగదే విధాతకున్

ఆహా ? నా నేత్రంబులు ముకుళితము లగుచున్నవి. బుద్ధి మందమగుచున్నది. వేయేల ! సమస్తావయవంబులును బరవశంబు లగుచున్నవి. నేనేమి సేయుదును.

కృ—(తనలో) చతుర్ముఖునిపనియైనది. బ్రహ్మాభిమాన మడఁగిపోయినది. ఇంకఁ బ్రాకృతశరీరము నవలంబించెద. (యథాప్రకారముగా నందఱు గాన్పింతురు.)

బ్రహ్మ—అబ్బ. ఇప్పుడు జీవంబులు వచ్చుచున్నవి. (అని కొంచెము కొంచెము కన్నులువిప్పి) ఆహా ! విష్ణుమాయ యనిర్వచనీయము. అగమ్యగోచరము. (అని కృష్ణునికడ కరిగి సాష్టాంగనమస్కారముఁ జేసి) అహా ! పరమేశ్వరా ! నారాయణా ధన్యుఁడనైతి ! ధన్యుఁడనైతి.

సీ. శంపాలతికతోడి । జలదంబుకైవడి
మెఱుఁగుటొల్లియతోడి । మేనివాని

కమనీయమృదుళాన్న కబళవేత్రవిషాణ
వేణుచిహ్నంబుల వెలయువాని
గుంజావినిర్మిత కుండలంబులవాని
శిఖిపింఛవేష్టిత శిరమువాని
వనపుష్పమాలికా వ్రాతకంఠమువాని
నళినకోమలచర ణములవాని

గీ. గరుణగడలుకొనిన కడగంటివానితో
పాలబాలుభంగి బరగువాని
నగుమొగంబువాని ననుగన్నతండ్రిని
నినుభజింతుమ్రొక్కి నీరజాక్ష.

(మరల సాష్టాంగ నమస్కారంబుజేసి) జనకా. నారాయణా!

(19) అనుబంధము.

మ. ననుమన్నించి, భవజ్జనంబులకు నానందంబు నిండించుని
తనురూపం బిదె నామనంబున కచింత్యంబయ్యె నీయుల్లస
ద్ఘనవిశ్వాకృతి నెవ్వఁడోపునెఱుఁగం గైవల్యమై యొప్పునా
త్మనివేద్యం బగు నీదు వైభవముచం దం బెట్టిదో యీశ్వరా!

ఆహా! ఈగోపకుమారుల యదృష్టమే యదృష్టము.

ఉ. ఎన్నఁడునైన యోగివిభు లెవ్వనిపాదపరాగ మింతయుం
గన్నులగాన రట్టిహరి గాఁగిటజేర్చుచు, జెట్టబట్టుచున్
దన్నుచు, గ్రుద్దుచున్, నగుచు దద్దయుబైబడి కూడియాడుచున్
మన్ననసేయు వల్లవకుమారులభాగ్యము లింతయొప్పునే.

దేవాదిదేవా! పురుషోత్తమా! వేయిమాటలతోఁ బనియేమి?

శా. ఏలా బ్రహ్మపదంబు? వేదములకు న్స్వీకింపఁగారాని ని
న్నీలోకంబున, నీవనాంతరమునం దీమందలోఁ "గృష్ణ!" యం

చాలాపాదసమస్తభావములు నీ | యందే సమర్పించు నీ
వేరెలందొక్కని పాదరేణువులు పై | వేష్టించినం జాలదే.

అహా !

మ. నిను హింసించిన పూతనాదులకు | మున్ నీమేటిసంకేతమి
చ్చిన నీకుం బరదారపుత్రగృహగో | స్త్రీప్రాణదేహాదు లె
ల్లను వంచింపక యిచ్చు గోపకులకున్ | లక్షింప నేమిచ్చెదో
యని సందేహము దోఁచుచున్నది ప్రప | న్నానీకరక్షామణీ.

క౦. సర్వము నీవ యెఱుంగుదు
సర్వవిలోకనుఁడ వీవ | జగదధిపతివిఁక
సర్వాపరాధు నను నో
సర్వేశ ! యనుగ్రహింపు | చనియెద నింకన్.

కృ—మంచిది. (బ్రహ్మ మఱల నమస్కరించి నిష్క్రమించును. కృష్ణుఁడు బ్రహ్మ దాచిన గోవత్సగోపబాలకులు రాగాఁ దాను సృష్టిని మాయము జేసి) అన్నా ! మనమందఱ మట జని క్రీడింతమా?

బల—మంచిది (అని పరిక్రమింతురు) (గోపాలకులను గార్చిచ్చు చుట్టుకొనును.)

గోపా—అయ్యో ! కార్చిచ్చు కార్చిచ్చు.

ఉ. అదె వచ్చెన్ దవవహ్ని ధూమకణకీ | లాభీలదుర్వారమై
యిదె కప్పెన్ మము నెల్లవారి నిటమీ | దేలాగు రక్షింపు నీ
పదపద్మంబులకాని యొండెఱుఁగమో | పద్మాక్షు! యోకృష్ణ! క్రమ్ము
క్కెద మోరామ! మహాపరాక్రమ! దవా | గ్నిన్ వేగవారింపవే

అయ్యో! శ్రీకృష్ణా! అట్లు చూచెద వేమి తండ్రీ! ఝుంఝూమారుతము

వీచుచున్నది. జ్వాల లాకసము నంటుచున్నవి. చూడుము చూడుము ఇంక నిలువశక్యంబు గాదు. కటకటా! కృష్ణా!

శా. నీ చుట్టాలకు నాపద ల్గలుగునే ? నేమెల్ల నీవార మ
న్యాచారంబు లెఱుంగ మీఁకుఁడవు మా ? కాభీలదావాగ్ని
దేచందంబున నింక దాటుదుము మ ? మ్మీక్షించి రక్షింపవ
న్నా! చంద్రాభ! విపన్నులన్, శిఖివితా ? నచ్ఛన్నులన్ ఖిన్నులన్

ఇంక నీవుపేక్షించినచో మాప్రాణంబులు దక్కవు.

కృ—(విని) ఓహో! దావాగ్ని విజృంభించి గోగోపసమూహంబులను జుట్టుకొనుచున్నది. ఓ బాంధవులారా! మీరెల్లరు నితరచింతలందక్క యొక్కమారు కన్నులను మూసికొనుఁడు (గోపాలురట్లుచేయు) (దావాగ్నిని మ్రింగి) ఇంక నేత్రములను దెఱువుఁడు. (అందఱు అట్లు చేయుదురు) ఇదిగో సాయంకాలము గావచ్చినది. ఇంక మనమింటికేగుదము. పశువులను మరలింపుఁడు. (గోవులను మరలింప వారితోఁ జనుచు వేణువువాయించుచు నిష్క్రమించును.)

20 అనుబంధము.

రంగము:— యశోదమందిరము.

(యశోదాకృష్ణులు ప్రవేశింతురు.)

యశో—ఏమిరాకృష్ణా! లేనిపోని జగడములు దెచ్చుచున్నాఁడవు.

కృ—అమ్మా! నేనేమెఱుంగను. వీరందఱు నాపైఁ గిట్టక చెప్పుచున్నారు.

య—వారికేమి, నీమీఁదపగయా? నీవు మొదటినుండియు గడుసువాఁడవే. నీసంగతి నేనెఱుఁగనా? ఎప్పుడు నెవరో యొకరితోడ గిల్లి జగడములు పెట్టుకొనుచునే యుందువు. ఈసారి యెవరితోనైన బోట్లాడితివా నిన్నేమిచేతునో చూడు.

కృ—(బిక్క మొగము బెట్టి) నేను బండుకొనియుండ వాండ్రిందఱు మాయింటికివచ్చి నన్ను లేపి మాయమ్మ కొట్టును; నేనురానన్నకొలఁది మీయమ్మ యింటివద్ద లేదు. మన మెక్కడఆడుచున్నది ఆమెచూడవచ్చినదా? అని రారమ్మని నన్నులాగిరి. నేనసలేరాను. మీరేమన్ననుసరే యని నేను చెప్ప మీ అమ్మతో అబద్ధములు చెప్పి కొట్టించెదము చూడుమని పోయినారు. వారిమాటలనే నమ్మి నిష్కారణముగా నాపై కోపపడుచున్నావు. ఊఁ ఊఁ ఊఁ (ఏడ్చును.)

య—(నవ్వి) చాలులే నీదొంగయేడ్పులు. ఎంతలో యెంతమాయ బన్నితివి; ఎప్పుడు నబద్ధమాడని మీయన్న రాముఁడును నీవల్లరిచేసినట్టు చెప్పినాఁడు. పోనీ వారన్నచోఁ గిట్టక చెప్పినారనుకొందము. మీయన్నయ్యకుఁగూడ నీపై నేమిపగయున్నదిరా?

కృ—అదిగాదమ్మా! నిన్న నీవు దీనినిండ బెట్టి యిచ్చితివే, యామీఁగడ నేను తినుచుండ నన్నయ్య వచ్చి యేమిరా కృష్ణా! నాకుఁ గొంచెము పెట్టవురా; కొంచెము పెడుదూ; అని నేను కొంచెమైన దినకముందే నాగిన్నెను లాగికొనవచ్చెను. నేను పరుగెత్తి గదిలోనికిఁ బోయి సాంతము తినునని తలుపు వేసుకొన్నాను. తనకుఁ బెట్టలేదని కోపముతో నీకుఁ జెప్పినాఁడేమో.

య—(తనలో) నాచిన్నికృష్ణుని ముద్దుమాటలు అమృతంపు దేటలు; చిన్నవాఁడైనను బెద్దవారికన్న నెక్కువగా మాటలాడ నేర్చినాఁడు. ప్రతిదిన మెన్ని తప్పులు జేసినను అదేమి తెల్వియో? తనమీఁద లేకుండ దప్పించుకొనుటయేగాక, యితరులమీఁదనే పెట్టుచుండును. వీని యాగడము జూచిన కొట్ట బుద్ధిపుట్టును. వీనిమాటలు విన్న జేతులాడవు. నాపిల్లవాఁడని నేను వాని

యల్లరులకు సహింతును. గాని యిరుగు పొరుగు వారెందుల
కూరకుందురు! ఎట్టులైన దండింపక తప్పదు. చిన్నతనమనిఁ
యూరకొనినచోఁ బెద్దవాఁడైనను, నిట్లే చేయుచుండును.

క. లాలనమున బహుదోషము
లోలిం బ్రాపించుఁ దాడనోపాయముల
జ్ఞాలగుణంబులు గల్గును
బాలురకును దాడసంబె పథ్యం బరయన్.

(ప్రకా) నీవెన్నియైన జెప్పుము. నీమాటలను నమ్మను. ఇక్కడనుండి యైన, నెవ్వరిజోలికి బోవక యేయల్లరియుఁ జేయక తిన్నగానుండుము. ఇదిగో యిక్కడనుండి కదలితివా!

కృ—అమ్మా! నేనెక్కడికిని బోను. ఇక్కడనే యుండెదను. కాని నీవు త్వరగా వచ్చి వెన్నమాత్రము బెట్టవలెను సుమా?

య—(కృష్ణుని ముద్దుబెట్టుకొని) నాన్నా! అట్లే పెట్టెద. నీవెక్కడికిఁ బోకు మిప్పుడే వచ్చెద. (నిష్క్రి)

కృ—మాయమ్మ వెడలిపోయినది. వెడలిపోవుచు నెక్కడకుఁ బోవలదని నియమించినది. కాని నేనిట నున్న నాకెట్లుప్రొద్దుపోవును? నేనెందులకు జన్మించితినో దానిని ముందు విచారింపక వృథా కాలహరణమేల చేయవలెను. కాళిందీనదినంతయుఁ దనవిష జ్వాలలచే దూషితంగావించి యనేకుల జీవములంగొను చున్న కాళియుని గర్వంబును ముందుగా నడంపవలయును. (తెరవంకఁజూచి) తల్లి వచ్చుటలేదుకదా! (మరలజూచి) వచ్చుటలేదు. ఇంక నేను తిన్నగ నవ్వలదాటి మా యుద్ధవబలరామాదులం గలసికొని గోపాలకులతోఁ గందుకక్రీడ గావించెదఁగాక (అని పరుగెత్తుచు నిష్క్రమించును.)

రంగము—కాళిందీ నదీతీరము.

(కృష్ణబలరాములును, ఉద్ధవుఁడును, గోపాలకులును ప్రవేశింతురు.)

1. గో. ఊరికే పోట్లాడుకోవడం యెందుకురా; కిట్టయ్య సెప్పినట్లు యినుకొందాం. (అందరు) చరి చరి.

కృ—నేనొక్కడ నొకటి; మీరందఱు నొక్కటి. మీరా వైపున నుండుఁడు; నేనీవైపుననుండెద. ఎవరు గెల్తురోచూతము.(బంతులాడగా బంతి మడుగులోఁబడును.)

1 అయ్యో! బంతి మడుగులో యేసివాడా్ౕరి కిట్టయ్య.

2. పోనీలే! మడుగుకాడికి పోకుండి. బంతి పోతే పోయింది. ఇంటికెల్లి యింకోటి తెచ్చుకోవచ్చులే.

3. అది బంతంటే బంతిరా? ఓరైనాదిగి తీసిత్తే బాగుంటుందిరా.

4. అవునా్ౕరి, మంచి బంతేగాని, దాన్లోదిగి ఓరుతీత్తారు. యెర్రిన్నా! నీవేమైనాదిగి తీత్తావురా.

5. అమ్మయ్యో! నాశాతగాదు. అది సాలలోతుంది. దానికాడికెల్లి తేనే వాళ్ళు తిరుగుతుందని మాముసలమ్మ శెప్పింది.

ఉ—అవును. అవు నందఱు, దానిలో బెద్దసర్పమున్నదని యనియెదరు

కృ—ఓ బాలకులారా! మీరేమియు విచారింపకుఁడు నేనిప్పుడే మడుగులో దిగి మీబంతిని దెచ్చి మీకిచ్చెదను.

అందఱు—అమ్మయ్యో! అమ్మయ్యో! కిట్టయ్యా! కిట్టయ్యానువ్వు! వొద్దు వొద్దు. పోకయ్యా! పోకయ్యా! బంతిపోతే పోయిందిలే! యెదవబంతి దాని లెక్కేం పత్తరం యేం. దానితాతబంతులు తెత్తాంలే, అంతగా దొరక్కపోతే యింకోఆట ఆడుకొందాంలే.

కృ—అయిన మీరిచ్చటనే యుండుఁడు. ఈవృక్షమెక్కి యామడుగెంతలోతుగలదో చూచివచ్చెదను. (అని వృక్షమెక్కి మడుగులోదూకును.)

1.నీవు పొమన్నావు.

2. నువు పొమ్మని, సూశావ్ నామీఁద బెడుతుండవే.

3. ఎవ్వరు పొమ్మంటేంలే, దానికిప్పుడేం శేత్తాంగాని జారి పడ్లే దుగదా !

4. లేదురా ? పడాలనే పడ్డాడ్రి.

1. ఏమ్రా? అరే! యింకా రాడేంరా. పాపం వొత్తాడో రాడో.

2. అదిగో పాము కుట్లయ్యాను జుట్టేసుకొని కరుత్తుంది. ఇంకేమి రావటం.

ఉద్ధ—(చూచి) ఆఁ యేమి మాకృష్ణుని బాము గరచుచున్నదే (కృష్ణుని వంకఁ జేతులుచాచి) అయ్యో! కృష్ణా! నిన్ను బాముగరచుచున్నదా తండ్రీ!

కం. విషకుచయుగ యగురక్కసి
విషకుచదుగ్ధంబు ద్రావి విషవిజయుఁడవై
బిసరుహలోచన! యద్భుత
విషయుఁడవగు నీకు సర్ప విష మెక్కఁగదా.

1. మనమందఱం యింటికెల్లి యశోదమ్మతో సెప్పుకొందాం రాండిరా.

(అందఱునిష్క్రి)



సంగీతకృష్ణలీల.

చతుర్థాంకము.

రంగము:—యశోదగృహాంగణము.

[యశోదయు గోపబాలకులును బ్రవేశింతురు.]

గో—అమ్మా! అమ్మా!

య—ఏమిరా అట్లేడ్చెదరు. మాకృష్ణుఁడేడి?

గో—అమ్మా మాకు జెప్పుటకు నోరు రాకున్నది.

య—అదేమి! మీతో నాడుకొనుటకు రాలేదా!

గో—మేమందఱము, అడవికి బంతులాడుకొనుటకేగి యాడుకొనుచుండ మాబంతి మడుగులోఁ బడెను. ఎవరును దిగవలదు. అందఱము నింటికిఁ బోదమని నిశ్చయించుకొంటిమి. ఇంతలో మీకృష్ణుఁడు చూచెదనని చెట్టుపై నెక్కి,

మ. కటిచేలంబు బిగించి, పింఛమునఁ జక్కఁగఁ గొప్పు బంధించి, దో
స్తటసంస్ఫాలన మాచరించి, చరణద్వంద్వంబు గీలించి, త
త్కుటశాఖాగ్రము మీఁదనుండి యురికెన్ గోపాలసింహంబు ది
క్తటముల్ మ్రోయ హ్రదంబులో గుభగుభధ్వానం బనూనంబుగన్

వెంటనే యొక్క పెనుబాము విషజ్వాలలం గ్రక్కుచు వచ్చి చుట్టుకొని గట్టిగా కఱచినది.

య.—హా! తండ్రీ! కృష్ణా! (మూర్ఛిల్లి మరల లేచి దుఃఖముతో

కం. కట్టా! కాలభుజంగము
గట్టలుకన్నిన్ను గఱవ గంపించితివో
తిట్టితివో పాపపువిధిఁ
బట్టి, మముందలఁచి రాక పలవించితివో?

ఓ బాలకులారా! మాకృష్ణుఁడెక్కడనున్నవాఁడో యక్కడకునన్నుదీసి కొనిపొండు.

గో.—అమ్మా! అల్లే మావెంటరమ్ము. (అందఱునిష్క్రమింతురు.)

రంగము:—కాళిందీ హ్రదము తీరము.

[యశోద గోపబాలకులు ప్రవేశింతురు.]

య.—హాతండ్రీ! కృష్ణా! నీవు సర్పదష్టుండవై దుఃఖమనుభవించుచుండ నీపాడుకన్నులతో నూరక చూడవలసివచ్చెఁగదా?

కం. పన్నగము మమ్ము గఱవక
నిన్నేటికిఁ గఱచె కృష్ణ! నెమ్మిగలిగి నీ
వున్నను మము రక్షింతువు
నిన్నుఁ రక్షింప మేము నేరము తండ్రీ.

అయ్యో, నాముద్దుకృష్ణా! యింతకుముందే యెచ్చటికేగవల దిచ్చట నేయుండుమని యెన్నోవిధములఁ జెప్పి పోయితినే. ఇంతలో నెంత యాపదఫలించెనురా! నిముసమైన నిన్ను గనకున్న బరిపరివిధంబులఁ బరితపించు మాకందఱికిని దూరమైతివే, అయ్యో నాతండ్రీ! నాచిన్ని కృష్ణా హా కృష్ణా! కృష్ణా!

ఉ. చూడవదేమి? గారవపు జూపుల మమ్ము, సఖాళితోడ మా
టాడవదేమి? నర్మముగ, నందెలుపాదములందు మ్రోయనే
డాడవదేమి? నర్తనము లవ్వలిమ్రోలను గోపికావళిం
గూడవదేమి? నవ్వులకు గోపకుమారవరేణ్య! చెప్పుమా.

అయ్యో! నినువీడి యింకెట్లు బ్రతుకగలను!

సీ. శ్రవణరంధ్రంబులు సఫలతఁబొందంగ
నెలమి భాషించువారెవ్వరింక
కరచరణాదుల కలిమిధన్యతనొంద
నగిరిపైఁ బ్రాకువారెవ్వరింక
నయనయుగ్మంబులు నతిగృతార్థములుగా
నవ్వులు సూపువారెవ్వరింక
జిహ్వలు గారవ శ్రీజేరఁ బాటల
యెడఁబలికించువారెవ్వరింకఁ

గీ. దండ్రి! నీవు సర్పదష్టుండవైయున్న
నిచట మాకుఁ బ్రభువులెవ్వరింక
మరిగి పాయలేము మాకు నీతోడిద
లోక మీవు లేసి లోక మేల?

ఉ—అమ్మా? యూరడిల్లుమూరడిల్లుము. శ్రీకృష్ణునకేమియు భయము లేదు. అతఁడు మనుష్యుఁడు గాఁడు. బ్రహ్మాదులప్రార్థనఁగైకొని భూభారము హరించుటకై యిట్లవతరించియున్నాఁడు. పూతనాది దుష్టరాక్షస సంహారంబును గని విని యెఱింగియు నిట్లు సామాన్యులవలె భ్రాంతినొందెద వేలనమ్మా? నీకొడుకిప్పుడే కాళీయుని గర్వంబడంచి రాఁగలఁడు. (కృష్ణుఁడు కాళీయుని

ఫణములపై తాండవమాడుచు గనబడును) (చూచి) అమ్మా! అమ్మా! అటుచూడు మటుచూడుము.

సీ. ఘనయమునానదీ । కల్లోలఘోషంబు
　　　　సరసమృదంగ ఘో । షంబుగాఁగ
సాధుబృందావన । చరచంచరీక గా
　　　　నంబుగాయకసుగా । నంబుగాఁగ
కలహంససారస । కమనీయమంజు శ
　　　　బ్దంబులుదాళ శ । బ్దములుగాఁగ
దివినుండి వీక్షించు । దేవగంధర్వాది
　　　　జనులుసభాసద । జనులుగాఁగ

గీ. పద్మరాగాది రత్న ప్ర । భాసమాన
మహితకాళియఫణిఫణా । మండపమున
నళినలోచన విఖ్యాత । నర్తకుండు
నిత్యనైపుణ్యముఁ జేర్చి । నృత్యమాడె.

యశో—(చూచి) ఆహా! ధన్యురాలనైతిని! ధన్యురాలనైతిని. నాజన్మ సార్థకమయ్యె ఆహా! ఉద్ధవా!

మ. గతజన్మంబుల నేమి నోచితిమొ? యా । గశ్రేణులేమేమిచే
సితిమో? యెవ్వరికేమి పెట్టితిమొ? యే । చింతారతిం బ్రొద్దుపు
చ్చితిమో? సత్యములేమి పల్కితిమొ. యే । సిద్ధప్రదేశంబుద్రొ
క్కితిమో? యిప్పుడుసూడగంటిమిచటం । గృష్ణార్భకున్నిర్భయుఁ

స్వామీ! చరాచరమూలకారణా! నారాయణా!

ఉ. ఎట్టితపంబు జేసెనొకొ । యెట్టిసుకర్మము లాచరించెనో?
యెట్టినిజంబు పల్కెనొకొ । యీఫణి పూర్వభవంబునందుము
న్నట్టిమహానుభావులకు । నెన్నఁడు జేరువగానినీవు నేఁ
డిట్టివినోదలీల దల । కెక్కటించెదవీ ఫణీంద్రుపై

(నీటిలోనుండి కాళీయుని భార్యలు ప్రవేశింతురు)

౨౧ అనుబంధము.

1. కా—భా—ఆదిదేవా! పుండరీకాక్షా! రక్షింపుము రక్షింపుము

శా. బాలుండీతఁడు మంచివాఁడనుచు జెప్పన్ రాముకూరిరుండుదు
శీలుండౌనప్పుడైననేము సుభగ శ్రీబాసి వైధవ్య దు
ష్టాలంకారముఁ బొంద నోడెద మనాథాలాపమాలింపవే,
చాలున్ని పదతాండవంబు పతిభిక్షం బెట్టి రక్షింపవే.

(నమస్కరించును.)

కా—భా—జగదీశ్వరా! శ్రీకృష్ణా! నీ నిగ్రహంబునకు మేమెంతవారము. మాకు పతిభిక్ష బెట్టిరక్షింపుము.

గీ. మమ్ము బెండ్లిసేయు మాప్రాణవల్లభు
ప్రాణమిచ్చి కావు భక్తవరద!
నీవుసేయుపెండ్లి నిత్యంబు భద్రంబు
చిన్ననాఁటి పెండ్లి పెండ్లిగాదు.

(కృష్ణుండు మడుఁగులోనుండి యొడ్డుకు వచ్చును, వెంటనే దుఃఖించుచు పోయి కృష్ణునెత్తుకొని యశోద గోపబాలురతో నిష్క్రమించును.)

(కాళీయుఁడు మడుఁగువిడచి భార్యలతో నిష్క్రమించును)(తెర వ్రాలును.)

రంగము-గృహము.

(వెంకన్న-సరోజిని ప్రవేశింతురు)

వెంక—యిగ్గో ఆశేవ్ యింటున్నావా యియ్యాల పిల్లోడుసాలాసాలా సికాకుపడుతూ వుండాడు. నీవెచ్చేటంతోకుండావుండి పిల్లోణ్ణి యేడ్పించకుండా నే వచ్చేవరకు వంటజేసి సిద్ధంగావుండాలె. ఏమ్మాట్లాడా! బద్దరం. బద్దరం.

సరో—మీ రెక్కడికి వెళ్ళెదరు?

వెంక.—నాను జీవాలకాడికెల్తున్నాను. యెల్లనట్టయితే పెద్దగొల్ల జీతంయిత్తాడామరి. మనమసలేపేదోళ్ళం యిద్గోయెల్తున్నాను. బద్దరంసుమా.

(నిష్క్రమించును.)

సరో—ఇప్పటికి నాపీడవదలినది. మాకృష్ణుని చెంతకెప్పుడు పోవుదమన్న నిముసమైన నిల్లు విడచి పోడు. ఈపిల్లవాఁడెప్పుడును గడియ కదలనీయఁడు. ఒకటే యేఁపు. యేమిసేయుదును. ఈనాఁడెట్లయిన గృష్ణుని జూచితీరవలయును.
(విచారించి) అయ్యో? చంటికూనయే, యేడ్వడా? ఊఁ యేడ్చినేమి యేడ్వకున్ననేమి? యింకెట్లైననేమి? కృష్ణుఁడే నాజీవము. కృష్ణుఁడే నా ప్రాణము. కృష్ణుడే నా సర్వస్వము. ఇంతయేల సమస్తంబును శ్రీకృష్ణుఁడే. శ్రీకృష్ణుఁడువినా నాకుఁబ్రపంచములేదు. నాప్రాణనాథుఁడు, నామనోహరుఁడు, నారక్షకుఁడు, శ్రీకృష్ణుఁడే—వానిని స్మరింపక, వానిసేవ జేయక, వీనులారవాని వేణుగానమును వినక, యొక యరనిముసమైననిల్వఁజాల (తెరలో వేణుగానము) అదిగో వేణుగానము వినవచ్చుచున్నది. ఆహా!

సీ. విశ్వమోహనమైన ॥ వేణునినాదంబు
సరసగంభీరగ ॥ ర్జనముగాఁగ
మహనీయనిర్మల ॥ మందహాసద్యుతి
లలితసౌదామిని ॥ లతికగాఁగఁ
దలచుట్టు బాగుగ ॥ దనరుపింఛపుదండ
శైలభేదనశరా ॥ సనముగాగ

కరుణాకటాక్ష వీక్షణ సుధావర్షంబు
సలిలధారాప్రవర్షంబుగాఁగ.

గీ. జూడనేతెంచు గోపాల ? జనమునింద్రి
చాతకంబులదురవస్థఁ జక్కఁ జేసి
కృష్ణమేఘంబు బహుతరకీర్తి నొప్పె
విమలబృందావనాకాశవీథియందు.

ఈసమయమునందే శ్రీకృష్ణుని సేవింపవలయును. (పిల్లవాని నుయ్యాల లోనుంచి నిష్క్రమించును. పిల్లవాఁడేడ్చుచుండును.)

(22 అనుబంధము.)

వెంకన్న—(ప్రవే) యేందిదీ. పిల్లోఁడు యెక్కెక్కి యేడుత్తుండాడు. యిదెక్కడికో పోయింది, దీనికెప్పుడు పొరుగిండ్ల పెత్తనాల్తోటే సరిపోతుంది. అక్కడనే కూసుంటది. యెంతబిల్చినా రాదు. వూకో హాయి వూకో మీయమ్మవత్తుండాల్లే. యేమే వశేవ్. (పిల్లవాఁడెక్కెక్కి యేడ్చుచుండ) వూకోరా! వూకోరా! (కోపముతో) సిగ్గులేనిముండ, వొక్కమాలిసెప్పితే సిగ్గుండాలె. యెన్నిదిట్టినా యెన్నిగొట్టినా పౌరుసంలేసి బ్రతుకెందుకు. సీ యంటే కుక్కకు సిగ్గుంటది. యిప్పుడెందుకు! రానీ రానీ నా తమాస సూపిత్త ? (పిల్లవాఁడు మరల బిగ్గరగా నేడ్వఁగా) యింకేం శెయ్యాలె. యీడియేడ్పు యెక్కువైంది. అదా రాదు. కాసేపు వుయ్యాలయినా వూపిసూత్తా (వుయ్యాలవూపుచు) (పాట) వూరుకోరాకొడక వూరుకోవేరా. నోరు యెండీపోవునో యేమొయింకా, హాయ్ వుల్ వుల్ హాయ్ నీయమ్మసచ్చింది యింకయేముందీ, బాయమ్మ మీవదినె పాలుతాగ్రిగుదువు హాయ్—యింకవూరుకోడు-యీడెప్పుడు సత్తాడో-నాకుకోపంవత్తేనా నేలకేశికొడ్తా-చిన్నంగ జెప్పితేయినాలె-వూకోవుల్

వులే వుల్ హాయ్. ఆయీ (అనివూపి) నే నొచ్చి గంటసేపైందిగందా. యింకా రాలేదు. సూశావా. దీన్ని యేమిశేశ్నా పాపంస్సుందా? వూపీ వూపీ నా ప్యాణం యిసికేత్తావుంది. యిదేగడియ బుట్టింగో. యింకా శేపట్కవత్తేనా శిగ్గోశి యెల్లగొడ్తా యాడికైనా యెత్తే తొందరగా రావొద్దూ. పిల్లగాణ్ణి సూస్కోవొద్దూ. యింతమాత్రం తెల్దూ. వూకో. వూకో. (ఊపుచు పాట) యెవణ్ణొ మరిగిందీ-యింతసేపైందీ నాపానం యిసికిందీ నాశాతగాదూ హాయ్—యీళ్ళ సట్టమంతా యింతే పెండ్లయ్యేటప్పుడే యీండ్ల మరేద తెల్సింది. అంతా యిట్లాగే వుంటారా అనుకొన్నాంగాని లేకమోతే ఓకుసూత్తాడంటా. నేనైనా యెర్రంగా పుల్లంగావుందని శేస్కున్నాను. యిన్నాళ్ళ మట్టి కాపురం శేత్తున్నాముగంనా ఒక్కనాడైనా సుకం గలిగిందానాకు (పిల్లవాండు మరింత యేడ్వగా) నాకడుపులో కాలిపోతావుంది. నానెచ్చేవర్కు కూడొండమని శెప్పిపోతే నేనట్లా పోంగనే పిల్లోణ్ణి తొట్లో యేశింది. దాందార్ని అది పోయింది. రాత్రింబ్బూంచి నాకు జప్వేలేదు. శాకిరి శెయ్యాకుంటే తప్పదు. యేంశేశేది. యీడి నోరెండిపోతుంది యియ్యాల యీడిప్యానం నాప్యానంగూడా పొయ్యేటట్టుంది ఉశ్. వూకో వూకో. (పాట) పైస బొమ్మనుసూశి బాగాముకోరా-దానినొకపామైనా గర్వదేమిరా హాయ్. పాలిచ్చిపోయినా బాగుండుకొమకా: యీలోపుగా నీవు రాంగిరైనపోరా హాయ్. మా పుల్లన్న యింటికెల్లి కూత్తపాలముక్కనివచ్చి పోశిసూత్తా. (పాలుదెచ్చి) యిన్నిపాలు యీడికెంమకూ. కాసిన్ని నేను దాగుతా. (తాగి) యింకాశానావున్నై, యీడిమొగం యిన్నితాగుతాడు. (మరికొంతతాగి.)

పుల్లన్న—(గ్రివే) వోగే యెంకి న్నా, పిల్లోడికి పాలోయకి నువ్వు
తాగుతుండ వేంది రా. నువ్వు తాగటానికేనా పాలోశింది. నీ
కేంరోగం వొచ్చింది. అంబలి తాగరాదూ కలిబోసుకొని; నీ
పెళ్ళాం యింకా రాలేదేరా

వెంక—అదెక్కడ సచ్చిందో నాకు తెల్దు. దానిమాట నాకాడ
తేవొద్దు. యీడు పాలు తాక్కమోతే అందాక నాను తాగు
తుండాను. లేకమోతే సావమంటావా యేం. యియ్యన్ని
యీడు తాగుతాడూ !

పుల్ల—యెయ్యాసే; పాలన్ని నువ్వే తాగినా వేంద.

వెం—ఇయ్యి తాగుతే అంతే సాల్లే; వోడికుతుకు నాడిదే, అది
వాదిలిమెట్టి పోతే పిచ్చోడనా యేం ? పెద్దోడైతే యీడు
నన్ను బతికిత్తాడా అంతా చరిగ్గుంటేనే చరి.

పు—సాల్లే: పాలుబోయ్ పిల్లోడికి, (సరోజనిప్రవేశించుచూచి) ఇగ్గో
నోయ్ నీపెండ్లాం వత్తుంది.

(23) అనుబంధము.

వెం.—(పాలన్ని దాగ్రి) (నడుముగట్టి కర్ర బుచ్చుకొని) ఇంత శాప
టిదాంక యాడికెల్లావే, నీవు సిగ్గులేనిముండే ! మీవాండ్లం
తాయింతే. నిన్నురక్కపోయి సేసుకున్నా. పిల్లోడు యేడ్చి
యేడ్చి సచ్చిపోంతు. పూపివ్రాపి నాను సచ్చిపోయినా. ఇదం
తా సూశి సూశి యీపుల్లన్న సచ్చాడు. ఇంకెందుకు వొచ్చా
వు లంజకాన. ని అమ్మ యింతే. నీ చెల్లెలు యింతే. నీ అక్క
యింతే, నువ్వింతే. మీయింటోళ్ళు యెవరు సంసారం శేశారు.
మాయింటికి రావొద్దు. యెల్లిపో. సుకంపడి కులుక్కుంటూ
యిప్పుడొచ్చినావూ. పాలిచ్చిపోవద్దూ.

సరో—నే నెక్కడికిని బోలేదు. గోవిందమ్మబిడ్డ సమర్తాడినది. అందరు ముత్తైదువలు పోవుచుండ నేనుఁగూడ ఇప్పుడే కడుపునిండ పాలిచ్చి యుయ్యాలలోఁ బరుండఁ బెట్టి నిద్రబుచ్చి వెళ్ళితిని. వీని దుంపతెగ? వీడెప్పుడును పోరుబెట్టుచునే యుండును. వీఁడు చావనైన చావఁడు. కొంచెముసే పక్లే పరుండరాఁడు! నీవైన కొంచె మాగి రారాదా? ఏమి పడిపోయినదని యిప్పుడే వచ్చితివి. యింతలోనే యున్నితిట్లా? మావాండ్ల మర్యాదయు మీవాండ్ల మర్యాదయు నీవీథివారందరికిని తెలియును నోరు మూసికొనుము. నీచర్య యేమియు బాగున్నది కాదు. నేనింక నిక్కడ నుండను. నాపుట్టింటికి పంపించు,

వెంక—పుల్లన్నా? యింటున్నావా! నువ్వే సెప్పు. ఇట్లా అయితే సంసారం యెట్లా యేమత్తుందో నువ్వేసెప్పు.

పుల్ల—సరోజినీ! చరేగాని ని వింతసేపెందు కున్నావే దబ్బునా్రికా

సరో—అన్నా! ఇప్పుడే పోయితిని. వాండ్రు రానీయ లేదు.

పుల్ల—చక్లే. పిల్లోడికి పాలివ్వు. యెంకన్నా కొట్లాడుకోకుండీ. అన్నం తిను.

వెం—నాను తిన్ను. దాన్ని తినమను, అది ముందు తింటే గాని ముందు తిన్ను.

పుల్ల—అమ్మాయీ! నీవు తిని నీమొగుడికి పెట్టు. కొట్లాడుకోకుండి నే నింటికెల్తా. (వెళ్ళుచు సరోజిని వినకుండ వెంకన్నతో, వోరేయెంకన్నా! ఇది మాగడ్సుదిగాని దీనితో నువ్వేగ లేవ్. నువ్వెడికైనా యెల్లితే గుమ్మానికి లింగకాయతాలం యేసి మరియెల్లు. నచ్చినట్లు పడుంటుంది. మళ్లొచ్చి తీస్కో. నా నిట్లా సెప్పానని మాత్తరం దాంతో సెప్పకు. తినుతుంది.

వెం—చరే నువ్వెల్లు (పుల్లన్నపోయిన తర్వాత) వాసేవ్. అన్నం పెట్టే, (తిని) యిద్దో నేను పనికెల్తుండా ? తల్పు వేసుకో; మళ్లీ యాడికైనా పొయ్యేవ్. పిల్లగాణ్ణి ఆడిచ్చుకుంటా యింట్లో వుండు (వాకిలికి తాళము వేసి నిష్క్రమించును.)

సరో—యీయన వెడలిపోయెను. చాలసేపటికి గాని రాడు. పిల్లవాఁడిప్పుడే నిద్రించినాఁడు. కృష్ణుని యాజ్ఞాప్రకారముగ నిప్పుడే భుజించి యలంకరించుకొని తత్సన్నిధి కరిగెద (అట్లు చేసి తలుపు రాకుండుటచే) ఇదేమిచిత్రము. కవాటము రాకున్నది ? పోవుచుఁ దాళము వేసెను గాఁబోలు. ఇంకెట్లు పోవుదును. హా కృష్ణా ! జగన్నాయకా ! నా మనోనాయకుండవగు నీదర్శనంబు జేయుటకై యిట్లు దుఃఖించుచున్నదాన ? ఇట్టిచో నీవు గాక యింకెవ్వరు దిక్కు. హా ! యదుకులకమలాకర ప్రభాకరా ! హా వల్లవీజనమనోరథ పాటచ్చరా ! రక్షింపుము. రక్షింపుము. నామనోరథ మీడేర్పుము. అనన్యసులభమగు నీదివ్యమంగళవిగ్రహము నొకసారి నా నేత్రములకుఁ గన్పించి ధన్యురాలిని జేయుము.

ఉ. ఏపరమేశ్వరుం డ్జగము లెన్నిటి గప్పెఁ మాయ గప్పగా
నోపక పారతంత్ర్యమున ? నుండుమహాత్మక ! యట్టినీకు ను
ద్దీపకభద్రమూర్తికి సుధీజనరక్షణవర్తికిందనూ
తాపము వాయ మ్రొక్కెద ను దారతబోధనచక్రవర్తికిన్.

స్వామీ ! మాపూర్వపుణ్యం బెట్టిదో కాని యఖిలలోకేశ్వరుండవైన నీతో మాటలాడుచు నాటలాడుచు, నిరంతరంబును స్వేచ్ఛారూపంబున గ్రీడించుచుంటిమి. బ్రహ్మాదులకైన నిట్టి భాగ్యము చేకూరువా ? భాగ్య మన్న గొల్లలదే భాగ్యము. అదృష్టమన్న గొల్లలదే యదృ

ష్టము. స్వామీ ! నీదివ్యమంగళవిగ్రహమును సందర్శించి యేతరుణి వ రింపకుండును. నీవాగమృతము గ్రోలి యేకామిని విరహాగ్నిం బరితపిం పకుండును. నీ వేణుగానంబును విని యేసుందరి కందర్పుని బారిం బడ కుండును. హా ! కృష్ణా !

సీ. నీపాదకమలంబు నెమ్మి డగ్గఱంగాని
    తరలిపోవంగం బా దములు రావు
  నీకరాబ్జంబులు నెరినంటినిపగాని
    తక్కినపనికిహ స్తములు సాగవు
  నీవాగమృతధార నిండగ్రోలంగంగాని
    చెవులన్యభాషలు సేరి వినవు
  నీసుందరాకృతి నియతి జూపంగ గాని
    చూడన్యంబులం జూడ్కికవలు

గీ. నిన్ను కాని పలుక నేరవు మాజిహ్వ
  గొల్లననుచుం బలుక నోడవీవు
  మామనంబులెల్ల మరపించిదొంగిలి
  తేమిసేయువార మింక కృష్ణ !

ఆహా !

ఉ. కుండలదీప్తగండమును కుంచితకుంతలఫాలమున్, సుధా
  మండితకల్లవాధరము మంజులహాసవిలోకనంబునై
  యుండెడునీముఖంబుగని యుండగవచ్చు నెమన్మథేశుకో
  దండవిముక్తబాణముల దాసులమయ్యెదమాదరింపవే.

(అని సాష్టాంగనమస్కారముజేయ బూని)

సరో — ఆహా ! ధన్యురాలనైతిని. ధన్యురాలనైతిని.

ఉ. ఏవిభుపాదపద్మరతు లెన్నండు నెవ్వరుబొందలేని వెం
  దో్రవజరింతురట్టిబుధ తోషక ! నీవరుదెంచుటంబ్రిమా

దావృతమయ్యెఁ జిత్తముగ్రొ । త్తార్థతనొందెమనోరథంబునీ
సేవబవిత్రభావమును । జెందె శరీరము నేఁడు మాధవా,

కృష్ణుఁడు సరోజినిని కౌఁగిలించుకొని భూమిలోనికిఁ గొంపోవును.

(తెరవ్రాలును)

రంగము:—నందునిగృహాంగణము.

(నందుఁడు, గోవిందుఁడు, కృష్ణుఁడు మఱికొందఱుగొల్లలు ప్రవేశింతురు.)

నందుఁడు—గోవిందా ? ఆయుత్సవము చేసేనా ?

గోవిం—అవును చేసే ?

కృ—తండ్రీ ! యేయుత్సవము ?

నం—కృష్ణా ! మేము ప్రతిసంవత్సరము నింద్రయాగమును జేయుదుము.

కృ—అది చేసే వచ్చునా యేమి ?

గో—అవును. అందువలననే మీతో నాలోచింపవచ్చితిమి.

కృ—(వినయముతో) ఇందఱు పెద్దలుండ నే నెంతవాఁడను. అయిన నియాగముఁ జేసిన నేమిఫలము ? ఎవ్వఁడు ప్రభువు ? ఏ యే సాధనములు గావలయును ?

నం—ప్రభువు దేవేంద్రుఁడు. అధికారి మేఘుఁడు. శక్తికొలఁది దధిక్షీరాగులు సాధనములు. దీనిఫలమువినుము.

గీ. మఖముసేయ వజ్రి । మదిసంతసించును
వజ్రి సంతసింప । వానగురియు
వానగురియఁగపవ్రు । వసుమతిబెఱుగును
కసవ్రుమేసిధేను । గణముబ్రతుకు.

క. ధేనువులు బ్రతికెనేనిన్
మానదు ఘనమైనపాడి మందలగలుగున్
మానుగను బాడిగలిగిన
మానవులును సురలు దనిసి మనుదురు పుత్రా!

కృ—తండ్రీ! నీవు సర్వజ్ఞుండవు. నీకు నేను జెప్పునంతటివాఁడను గాను. కాన సమస్తమును గర్మమువలననే గల్గుచున్నది. ఎవరు బ్రతికినను గర్మమువలననే గాని యీ యింద్రునివలన గాదు. మీ రీయింద్రుఁడే కారణ మని యనుకొనుచున్నారు. ఈశ్వరునకైనను గర్మమును దాటుటకు వీలు లేదు. ఇంక నీ యింద్రుఁడెంత?

సం—కుమారా! నీ మాట లేమో విచిత్రములుగా నున్నవి.

కృ—ఇందు విచిత్ర మేమియును లేదు; అందఱును బాగుగ నాలోచింపుఁడు. సత్త్వము, రజము, తమము, అనిగుణములు మూఁడు. అందు రజోగుణంబున జగంబు జన్మించును. రజోగుణప్రేరణముననే మేఘములు వర్షించును. వర్షముచేఁ బాడిపంటలును వానిచేఁబ్రజావృద్ధియు నగును. అంతియగాని యీయింద్రుఁడేమియుఁ జేయఁజాలఁడు. నిష్కారణంబుగ నితని నారాధింప నేల? పశువులకుఁ బర్వతంబులకు నుత్సవము జేయుటమంచిది. ఇదియునుంగాక, ఇంద్రుఁడొకవేళ కోపించునని తలంతురేమో?

శా. కోపింపం బనిలేదు శక్రునికిఁ, దా గోపించుగా కేమి సం
క్షేపం బయ్యెడిదేమి? పట్టణములు న్గేహంబులుం దేశముల్
వ్యాపారంబులు మాకుఁబోవొడినె శైలారణ్యభాగంబులన్
గోపత్వంబున నుండుచున్ మనకు సంకోచింపఁగా నేటికిన్.

ఈయాగము నాకును సమ్మతమే కావున.

శా. గంధాలంకరణాంబరావళులచేఁ గైసేసి యిష్టాన్నముల్
బంధుశ్రేణియు మీరలున్ గుడిచి భాషారతిన్ వేడుకన్
సంధిల్లన్ గిరిగోద్విజాదుల నమస్కారంబు గావింపుఁడో
జం ధర్మంబని కోఁచెనేని జనకా! జన్మంబు ధన్యంబగున్.

సం—కృష్ణా! నీవు చెప్పినది బాగుగనే యున్నది. అట్లే చేయుదము.

(అందఱు నిష్క్ర)

రంగము:—అరణ్యములో గోవర్ధనపర్వతము.

కొందఱు గోపబాలకులు ఆవులను దోలుకొని వత్తురు. తర్వాత గోపబాలకులు వాకరకఱ్ఱలను బుచ్చుకొని వత్తురు. పిమ్మట గోపికలు పెరుగు, పాలు, మీగడ, నేయి, వెన్న, మొదలగు వానిని కుండలలోనుంచి నెత్తిపైఁ బెట్టుకొని వత్తురు. కొందఱు గోపబాలికలు గుత్తులను జేతఁ బట్టుకొని వత్తురు కొందఱు రామభజన జేయుచు వత్తురు. కొందఱు పరిహాసము లాడుకొనుచు వత్తురు)—

1 గో—కిట్టయ్యా! కిట్టయ్యా! దండాలు.

2 గో—నాను గూడ పెడతానాఁ. కిట్టయ్య యెఱ్ఱిగొల్లోడు కాఁడ్రా దేముడాఁ. కిట్టయ్యా! దండం సామీ.

కృ—(వేణువును వాయించుచు వారి నడుమ నాడుచుండును. పిల్లలందఱు గొంగడు లెగురవైచుచు నాడుదురు. కొందఱు తాళములు వాయింతురు)

3. కిట్టయ్యా! యేందయ్యా మాఠ్యానవు యిది. యీ పాటొద్దు. యింకోటి పాడు. ఆయాల పాడితివే అది పాడు. (కృష్ణుఁడట్లే పాడును).

4. బ్యావ్మలయ్యాలు శెవులు గింగురు మనేతట్టు యేందిరా అట్లు అరుస్తారు.

3. నీ యెత్తి గూల? అర్వటం గాదురా; మంతరాలు మంతరాలు.

4. మంతరాలు సత్తుండారూ! నే నేందో అనుకొన్నానా. ఋయ్యాల బ్యామ్మల రొట్టె నెయ్యిలో పడిందిరా. (బ్రాహ్మణులు పుణ్యాహవాచనము సేయుదురు)

6. ఇదిగోనయ్యా బ్యామ్మడా నెయ్యిగుత్త ఇంక మాట్లాడక యెల్లిపో. బ్రాహ్మణులు సత్కారములు పొంది నిష్క్రమింతురు)

కృ—ఓగోపగోపికలారా! పశువులకుఁ బసుపు బూసి మీరందఱును మీమీశక్త్యనుసారముగ నీపర్వతమును బూజింపుఁడు.

గో—సిత్తం సిత్తం (అని తాము తెచ్చిన పదార్థము లన్నియుఁ బర్వతము ముందు బెట్టి పర్వతమున కెదురుగాఁ బశువులను దెచ్చి నిల్పుదురు. గిరిపూజ జేయుదురు.

కృ—(తనలో) నేను వీరందఱను నమ్మించితిని. ఇందురుని గర్వమీనాఁటినుండి తప్పక నశించితీరును. (ప్రకా) ఓబాలకులారా! ఆబాలవృద్ధంబుగా నావాక్యమును శ్రద్ధతో నాలకింపుఁడు. మన మీనాఁడెంత భక్తిశ్రద్ధలచేత నీపర్వతమును బూజింతుమో యంత పాడిపంటలు గల్గి సుఖించెదము. కావున గొంచెమైన దాచుకొనక పెరుగు, చల్ల, మీగడ, వెన్న, మొదలగు మీమీపదార్థము లన్నియు నిట నునిచి మీరందఱును జాటునకు బొండు. నేను నివేదన జేసెదను.

అందఱు—సిత్తం సిత్తం (అని అట్లు చేసి చాటునకుఁబోదురు.)

కృ—(లేచి తొంగిచూచుచు) ఎవ్వరును లేరుగదా; మరలజూచి) ఎవ్వరును లేరు. ఇంక నాలస్యము చేయఁగూడదు. ఈ పదార్థము లన్నియుఁ ద్వరగా భుజింపవలయు. (అంతయుఁదిని)

ఓహో ? గోపికాగోపాలకులారా! మీరందఱును ఇంక రావచ్చును.

గో—(వచ్చి పదార్థములు లేకుండుటఁ జూచి) కిట్టయ్యా! మీగడ, అన్ని యేయీ?

కృ—(నవ్వుచు) ఈపర్వతము కామరూపి; మనమొసంగిన పదార్థమంతయు భుజించుటచే మనయెడ సంపూర్ణానుగ్రహముఁజూపె ననుట నిశ్చయము. ఇంక మనకు మన పశువులకు మన సస్యములకుఁ దప్పక శుభమగును. కావున మీరందఱొక్కమారు దీనికి సాష్టాంగనమస్కారముఁ జేయుఁడు. (అట్లుచేయగా) ఇంక మనమందలకుఁ జని కొంచెము విశ్రమింతము రండు. (అని యందఱు తమతమ చోట్లకుబోవుదురు.

[తెరలో]

ప్రళయప్రవర్తకంబులగు నోసంవర్తకమేఘంబులారా! నా యాజ్ఞ వినుఁడు.

శా. ఉద్యత్సంపద నమ్మఁదతనయో ద్యోగంబునన్ వెఱ్ఱులై
మద్యాగంబు విసర్జనీయ మనిరీ మర్త్యుల్ వడిన్మీరు మీ
విద్యుద్వల్లులఁగప్పి గర్జనములన్ వేధించి గోవుల్ జనుల్
సద్యోమృత్యువుఁ బొంద రాల్గురియుఁడీ శౌర్యం బవార్యంబుగన్
(గోపాలురపైనను గోవులపైనను రాళ్ళు పడును)

1. గో—ఏందిదీ? రాళ్ళు పడుతుండయే. యెంకన్నా? యిదేంది రా పగోళ్ళేరైనా యేత్తుండారా యేం గాశారం.

2 గో—మనకోళ్ళు పగోళ్ళుండారశా?

3. గో—పైనుంచి పడుతున్నట్లున్నయిరా?

4. గో—యిదేందో గాశారం సుట్టుకున్నట్టే ఉంది సూత్తే.

5. గో—యెన్న డిట్ట లేదే. యిదేందబ్బా యిట్లా రాళ్ళు పడుతుండై.

1. గో—వారేవ్, నాబుఱ్ఱ యెగిరిందిరోయ్—మాఁబాప్పంపిల్ల గాఁడు బద్దరం; గొంగళిముసుగెయ్.

2. గో—ఓరెంక న్నోరెంకన్నా! నీమీాద పడుతుండాయిరా రాళ్ళు? ఆసెల్లల్లో వోడైనా వున్నాడేమో సూడండిరా సూడండి.

3. గో—అరే మబ్బు కమ్ముకొని వత్తావుంది. సీకట్లుపడుతుండయి.

4. గో—అబ్బా సత్తినాన్రో యెఱ్ఱన్నా. బుఱ్ఱమీాఁద రాయిబడ్డది. అబ్బా—అబ్బా—ప్యాసం అన్నుముట్టిందిరా.

5. గో—ఆవు లంబే అని అరుత్తుండయిరా, పాపం యిదేందో మన సావుకే వచ్చింది.

1. గో—లేకమోతే మాఁమూలు పంఁడుగొదిలిపెట్టితే యిందయ్య ఊరుకుంటాఁడూ. నజ్లాయన మాట యిన్నాం; యింతగాశారం బట్టింది.

2. ఇది ఆలోచిచ్చాల్సినమాటే; ఇందయ్య కోపగించుకొని రాళ్ళ వర్సాలు గురిపిత్తుండాఁడు. ఇఁక సత్తాఁం పా, ఆఁవోళ్ళైటు పాయినోర్రి. పిల్లగాళ్ళు మాత్తరం ముందు సత్తారు. ఇంకేం బతుకు. యెవడిదారి వాడిదే, యేంవురువులు? యేంమెఱుపులు యేందార్లు, యేందార్లు, కళ్ళు సిత్రిం సిత్రింలో బడుతుండయి. ఇదంత యశోదమ్మకొఁడుకు పెట్టిందే; ఆకిట్టయ్య యీా సాయుల యెక్కడైనా వున్నాడేమో కేకెయ్యండి పలుకుతాఁడేమో?

గొల్లలుఅందరు—ఓకిట్టయ్యా! కిట్టయ్యా! కిట్టయ్యా!! ఓహోవ్ !!!

1. ఇంటి కప్పుడే యెల్లుండాలె. యీామబ్బు పట్టింది సూశి, బలే

ఉపాయంవుందిలే ఆయఁదగ్గిర; సూశావు పిలిచెన్న పోలేదు

గొల్లలు—ఓ దొంగకిట్టయ్యా ! దొంగకిట్టయ్యా !! దొంగకిట్టయ్యా !! ఓహోహోవ్ !!!

కృ—(విని తనలో) ఓహో ? తన కర్పింపలేదని యెంచి దేవేంద్ర వైభవంబున మదించి కన్నులు గానక పురందరుఁడు కోరులేని యీ సాధుజనులను బాధించుచున్న వాఁడు. అవుగాక ! వీని మదం బడంచెద. (అని కాసికోక బిగించి యెలుఁగెత్తి) ఓహో! గోగోపగోపికాజనులారా ! భయంపడకుఁడు. భయంపడకుఁడు.

చ. కలగకుఁడీ వధూజనులు ! కంపమునొందకుఁడీ వ్రజేశ్వరుల్,
తలగకుఁడీ కుమారకులు ! తక్కినవారలు రాలవానచే
నలగకుఁడీ, పశువ్రజము ! నక్కడనక్కడనిల్వనీకుఁడీ,
మెలపున మీకు నీశ్వరుఁడు ! మేలొసగుం గరుణార్ద్రచిత్తుఁడై.

గొల్లలు—కిట్టయ్య పిలుత్తుండాడు రాండి రాండహోయ్-చేతులు చేతులు బట్టుకోండి, కళ్ళగపడవ్, శెట్టు, శామ, రాయి; రప్ప సూశి ముందోడు శెప్పుతుండాలె.

కృ—ఇదిగో ! నేనీపర్వతంబు నెత్తుచున్న వాఁడ. గోవులు—గోపికలు గోపాలకులు—ఆబాలవృద్ధంబుగా నెల్లరును దీనిక్రిందికి వచ్చి నిలువుఁడు. అని చిటికెన వ్రేలుతోఁ బర్వత మెత్తును.

1. గో—వాకేవ్ గుట్టక్రిందికి మోతిమా గుట్టొదిలిపెట్టితే అంతా అణిగి సత్తాం; ఈసావు అబద్ధం ఆసావు నిజం.

కృ—ఓహో. గోపాలకులారా ! ఒక్కరును బర్వతము క్రిందికి గారేమి.

శా. బాలుం డీతఁడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపఁగా,
జాలండో యని దీనిక్రింద నిలువన్ శంకింప, గాఁబోల దీ
శైలాంభోనిధిజంతుసంయుతధరాచక్రంబు పైఁబడ్డనా
కేలల్లాడదు, బంధులార! నిలుఁడీ క్రిందన్ బ్రమోదంబునన్.

గొల్లలు—ఇంక బెయం లేదు, కిట్టయ్య యెంత దయిర్యం లేకపోతే యింతగుట్టెత్తు తాడశా—రాండి రాండి నునకు బెయం లేదు. (అని అందరులోనికిపోయి) అరే, అరే, వొదిలిపెట్టుతున్నట్టున్నాడోయ్! సత్తాం సత్తాం-కఱ్ఱలడ్డంపెట్టండి (అందఱు అట్లు సేయుదురు. కొంతసేపు వర్షము ఘోరముగ గురిసి వెలయును.

కృ—ఓహో! గోపాలకులారా!

క. ఉడిగెను వానయు గాలియు
వడిసెడినదులెల్లఁ బాలపవరద లిగిరె, కొం
డడుగుననుండక వెడలుఁడు
కొడుకులు కోడండ్రు సతులు గోవులు మీరున్.

గొల్లలు—(ఇవ్వలికివచ్చి) ఇక్కడవుంటే యెల్లాగైనా సత్తాం; కొంప శేరుకుందాం పాండి. (అని యురుకుచు నిష్క్రమింతురు కృష్ణుఁడును నడచుచుండును)

ఇంద్రు—(ప్రవేశించి పాదములంబడి) స్వామీ! పురాణపురుషా

(24) అనుబంధము.

మ. నిను బ్రహ్మాదు లెఱుంగలేరు జడతానిష్ఠుండ; లోకత్రయా
వనదుర్మానగరిష్ఠుఁడన్, విపులదుర్వైదుష్యభూయిష్ఠుఁడన్
వినయత్యాగవరిష్ఠుఁడన్, గుణనగ ? ర్వశ్రేష్ఠుఁడన్, దేవ!
ఘనలీలావిభవంబు పెంపుదెలియంగా నెవ్వఁడన్ సర్వగా.

మఱియు నోజగన్నాయకా !

శా. నీసామర్థ్య మెఱుంగ మేఘములచే నీఘోషమున్ భీషణో
గ్రాసారంబున ముంచితిన్ మఖము నాకై వల్లవుల్ సేయరం
చోసర్వేశ ! భవన్మహాత్వమున నా యుద్యోగ మిట్లయ్యె నీ
దాసున్నన్ను గృతాపరాధు గరుణన్ దర్శింపవే మాధవా !

కృ.—మంచిది లెమ్ము. సాధువుల కెన్నడు నెగ్గుసేయకుము. పోయి రమ్ము.

ఇం.—చిత్తము (అని మరల నమస్కరించును. అందఱు నిష్క్రమింతురు)

సంగీతకృష్ణలీల.

పంచమాంకము.

రంగము-బృందావనము.

అక్రూ—(ప్రవేశించి) ఆహా! (నడచుచు)

ఉ. ఎట్టితపంబు సేయఁబడెఁ । నెట్టిచరిత్రము లబ్ధమయ్యెనో
యెట్టిధనంబు లర్థులకు । నీబడెనో తొలిజామునందు, నా
యట్టివివేకహీనునకు । నాదిమునీంద్రులు యోగదృష్టులం
బట్టఁగలేనియీశ్వరుని । బ్రహ్మమయుం హరిఁజూడఁగల్గెడిన్

యోచించిచూడ పరమదుర్మార్గుఁడైనను కంసుఁడు నాకు మహోపకారమునే గావించినవాఁడు. ఏలయనఁ ?

ఉ. శూరులు దొల్లి యేవిభుని । శోభితపాదనఖప్రభావళిం
జేరి భవాంధకారములఁ । జిక్కక దాటుదు రట్టిదేవునిన్
వైరముతోడనైన బిలు । నన్నను బంచి శుభంబు సేసె ని
ష్కారణమైన ప్రేమ యిదె । కంసునిబోలు సఖుండు గల్గునే !

(విచారించి ఇంతవఱకును నా పుణ్యవిశేషము బాగుగనే యున్నది. కాని, యొక్కవిషయముననే విచారమగుచున్నది.

మ. ఇతఁ డాకంసునిచేతఁ బంపువడి నన్ హింసింప నేతెంచినాఁ
డతిదుష్టుండని చూచునో సకల భూతాంతర్బహిర్మధ్య సం
గతుఁడౌటం దలపోసి నన్ను సుజనుంగాఁ జూచునో? యెట్టియు
న్నతిగావించునొ యేక్రియం బలుకునో నాభాగ్య మెట్లున్నదో.

(చూచి) అదిగో! ఘాతుకక్రూరజంతువులవలని భయంబు నప్రమత్తులై చూచుచు ముదుసలిగొల్లలు పరుగిడుచున్నవారు. (నడచి) ఆహా? పచ్చికను మేసి విచ్చలవిడిగా గోగణంబు లదిగో విహరించుచున్నవి. (మఱియొకవైపుజూచి) అల్లదిగో గంభీరధ్వనులతో రంకెలు వేయుచు వృషభరాజంబులు నడగొండలవలె నడయాడుచున్నవి. గోపబాలకు లదిగో పాటలు బాడుకొనుచు గోవులను గాచుచున్నవారు. ఇంకను సందేహ మేమి?

మ. అలకభ్రాజితమై సుధాంశునిభమై హాసప్రభోద్దామమై
జలజాక్షంబయి కర్ణకుండలవిరాజద్గండమైయున్న యా
జలజాతాక్షుముఖంబు సూడఁగలుగన్ సత్యంబు నాకు నా
వలదిక్కేఁగుచునున్న యీవనమృగవ్రాతంబు లీత్రోవలన్

ఆహా!

ఉ. మాపటివేళ నేనుజని మాధవుపాదసమీపమందు దం
డాపతితుండనైన నతఁడాశుగకాలభుజంగవేగసం
తాపితభక్తలోకభయదారణమైన కరాబ్జమాదలన్
మోపి హసించి నాకభయముం గృపతోడుత నీయకుండునే.

ఇంక నిచ్చట నాలసింపనేల? త్వరగాబోయి సందర్శించెదగాక (నిష్క్ర)

రంగము—అరణ్యము.

(అక్రూరుఁడును రామకృష్ణులును బ్రవేశింతురు.)

కృ—అక్రూరా! భయము లేదు. మన మీనాఁడే మధురాపురమున

కరుగఁగలము. ఇంతకును గంసుఁడు మమ్ము హింసింపనెంచెనుగా!

అక్రూ—ఒకవిధమునవా? పరమమూర్ఖుఁడు కావుననే భవన్మహామహిమము గుర్తింపక పూతనాదుల నంపి విఫలమనోరథుండై యంతతో నూరకొనక చాణూరముష్టికాదులను నిన్నువధింప అయ్యో! నేనెంత పాపపుమాటనాడితిని

కృ—(నవ్వి) అక్రూరా! తప్పులేదు చెప్పుము.

అక్రూ—నియమించి ధనుర్యాగము జేయుచును. నీవుపోయి రామకృష్ణుల దోడ్కొనిరమ్మని నన్ను బుత్తెంచెను. ఈధనుర్యాగము మీయాగమనమునకై కల్పింపబడినదే గాని వేఱుకాదు. దేవా! నాకుభయమగుచున్నది. ఆకంసుఁడు మహాక్రూరుఁడు, కాలసర్పము. వానిబారింబడకుండ నెట్లు నీవీ మహావిపత్సముద్రము నుత్తరింతువో!

కృ—(చిఱునవ్వుతో) ఏమియు భయము లేదు. అదియంతయు నీవుచూచుచుందువుగదా! కాని యడిగినదె యడుగుచుంటినని విసుగుజెందక యింకొకమారు చెప్పుము.

మ. నెఱి నేఁడిక్కడ నీవు రాఁగ వగతో ? నీతోడ నేమైన నా
కెఱుఁగం జెప్పుమటంచు జెప్పరుగదా ? యేమందు రావార్తయే
తెఱఁగున్ లేదని డస్సిరో వగచిరో ? దీనత్వముం జెందిరో
వెఱతో నాతలిదండ్రు లెట్లువడిరో ? విన్పింపు మక్రూరకా!

అక్రూ—(దుఃఖముతో) ఏమని చెప్పుదును! కడుంగడు కృశించి యున్నవారు. నేను నాప్రయాణము నెఱింగించి కుశలంబునుగ పోయిరమ్మని దీవించి నిన్ను గంసుని బారిఁబడకుండ నెట్లయిన జేయుమనియు నాచిట్టితండ్రికుశలంబుగ నున్న శాశ్వత కారాగృహవాసమునైతేమి మా కానందదాయకమనియుఁ జెప్పి

కృ—(నిట్టూర్చి) అయ్యో! నేనెట్టిపాపాత్ముఁడను; అక్రూరా!

క. జననీజనకులవృద్ధులఁ
దనయుల గురు విప్రసాధు దారాదుల నే
జనుఁడు ఘనుఁడయ్యు బ్రోవక
వనరును జీవన్మృతుండు వాఁడు ధరిత్రిన్.

నాజననీజనకుల నెన్నఁడు సందర్శింతునో? ఎన్నఁడు వారు కష్టములనుండి విముక్తులగుదురో! అక్రూరా! రథము ద్వరగా దోలుము.

అక్రూ—చిత్తము. (తోలును. తెర యెత్తఁగాఁ గాళిందీనదియగపడును.) మహాభాగులారా! మీరిందే యుండుఁడు. నేనీకాళిందీనదియం దిప్పుడే స్నానము గావించి వచ్చెదను. (అని రథముదిగి నదిలో విధివిధానముగా స్నానముఁ జేసి ఆశ్చర్యముతో) ఆహా! ఏమిది! ఈజలమున బలరామకృష్ణులు సాక్షాత్కరించి యున్నవారు. అత్యద్భుతముగా నున్నదే! వీరు రథమధ్యమున గదా యున్నవారు! ఒకవేళ రథము దిగి వచ్చియున్న వారేమో చూచెదఁగాక (అని రథముపై నున్న రామకృష్ణులఁ జూచి) ఆహా! నాకేమియుం దోఁచకున్నయది ? రామకృష్ణులు రథముమీఁద నేయున్నవారు. మొదట వీరిని రథముపైఁ జూచితి. పిమ్మట నీనదీజలమునఁ జూచితి. మరల రథముపైఁ జూచితి. ఇప్పుడు తిరిగి వీరిందున్నవారు. మనోభ్రమముగాదుకదా అయిన నిందు మున్గి చూచెద (మునిగి, ఆశ్చర్యముతో లేచి) ఆహా! ఈనాఁడు నానేత్రయుగ్మ మెంతపుణ్యముగావించెనో?

సీ. ఆభోగిభోగపర్యంకమధ్యంబున
వలనొప్పుపచ్చని పటమువాని
మేఘంబుపైనున్న మెఱుఁగుచందంబున
నురమున శ్రీదేవి యొప్పువాని

మునుతేటులుదివ్య ముఖచతుష్కముగల
    తనయుఁడాడెడి జోడుఁ దమ్మివాని
కదలినబహుపద క్రిమివిశేషంబుల
    రవముసూపెడినూపు రములవాని

గీ. జలజగర్భరుద్ర సనకసనందన
    సద్ద్విజామరప్ర శస్యమాన
    చతురుఁడైనవాని సౌందర్యఖనియైన
    వానినొక్కపురుష వర్యుఁగాంచె.

ఈ పురుషుఁడు నన్ను గన్నతండ్రి! నాచిన్నికృష్ణుఁడుగాక యితరుఁడు గాఁడు. (అని సాష్టాంగనమస్కారముఁ గావించి లేచి చేతులు జోడించి) దేవాదిదేవా! నారాయణా!

దండకము.

శ్రీ మానినీమానచోరా శుభాకార! వీరా! జగద్ధేతుహేతు ప్రకారా! సమస్తంబు నస్తంగతంబై మహాలోలకల్లోల మాలాకులాభీలపాథోనిధిం గూలగా బాలకేళీగతిం దేలి నారాయణాఖ్యం బటు ఖ్యాతి శోభిల్లు నీనాభికంజంబులో, లోకపుంజంబులం బన్ను విన్నాణియై మన్న యాబమ్మ యుత్పన్నుఁడయ్యెంగదా? పావకాకాశవాతావనీవార్యహంకార మాయామహామానసాకల్ హృషీకాదులున్ లోకముల్ లోకబీజంబులున్ నిత్యసందోహమై నీమహాదేహమందుల్లసించున్ వసించున్నశించున్ జడత్వంబు లేకాత్మయై యొప్పు నీయొప్పిదంబెల్ల నోచెల్లఁ జెల్లన్ విచారింప దా రెంతవా రెంతవారైన మాయాదులా మాయతోఁ గూడి క్రీడించులోకానుసంధాత యాధాత నిర్ణేతయే, నీకళారాశికిం గొంద అంభోజగర్భాదు లధ్యాత్మలందున్ నశేషాధిభూతంబులందున్ ననేకాధిదైవంబులందున్ సదాసాక్షివై యుండెదం చుం, దదంతర్గతజ్యోతి వీవుండవంచుం, ద్రయీపద్ధతిం గొందఱుం దాద్రిదేవా

భిధానంబులన్, ఱెక్కడొక్కండవంచున్, మఱిం గొందఱా రూఢ కర్మంబులం ద్రుంచి సంసారముం ద్రెంచి సన్న్యస్తులై మించి విజ్ఞాన దక్షుండవంచున్ మఱిం బాంచరాత్రానుసారంబుగా ద్వన్మయత్వంబుతోఁ గొందఱీవాత్మవంచున్ మఱిం గొందఱా వాసుదేవాది భేదంబులన్ నల్వురై చెల్వు వాటింతువంచున్, మఱిన్నీవు నారాయణాఖ్యుండవంచున్ మఱిం బెక్కుమార్గంబులన్ నిన్ను నగ్గింతు రగ్గేమి యేఱుల్ పయోరాశినే, రాసులై కూడుక్రీడన్, విశేషంబులెల్లన్ విశేషంబులై డిందె నీయందనూనంబు లీనంబు తా నేకరాకేందుబింబంబు కుంభాంతరంబంబులం బింబితంబైన వేఁడున్న దే మెన్న నేలా? ఘటాంతర్గతాకాశముల్ దద్ఘటాంతంబులం దేకమా రేఖ లోకావధిన్ నీక నే పోకలంబోక యేకాకివై యుండు దీశా! కృశానుండు నెమ్మోము, సోముండు భానుండు కన్నుల్, దిశల్గర్ణము, లుర్వి పాదంబు లంభోనిధుల్కుక్షి, శల్యంబు లద్రుల్ లతాసాలముల్ రోమముల్, గాలి ప్రాణంబు బాహుల్ సురేంద్రుల్, ఘనంబుల్ గచంబు, ల్నభోవీధి నాభిప్రదేశంబు, రేలుం బగళ్ళున్ నిమేషంబు, లంభోజగర్భుండు గుహ్యంబు వర్షంబు వీర్యంబు, నాకంబు మూర్ధంబు, గా నేకమై యున్న నీమేనిదండ, న్నబ్జయోజాతగర్భాండముల్ మండితోదుంబరానోకహానేకశాఖాఫలాపూరితానంతజంతుప్రకాండంబు లీలం బ్రసిద్ధోదరాశిస్థ జంతుప్రకారంబుగా నిండియుండు న్మహారూప నీరూపముల్ వెగ్గలంబుగ్గడింప న్లయాంభోధిలోఁ మీనుమేన న్విరోధి న్నిరోధించి సాధించి ము న్వేదకున్వేదరాశిం బ్రసాదింపవే ద్రుంపవే కైటభశ్రీమధుం జక్రివై మొత్తవే యెత్తవే మందరాగంబు రాగంబుతోఁ గూర్మలీలాపరిస్పందివై, పందివై మేదిని న్మీదికిం ద్రోచి దోషాచరున్ గొమ్ముల న్నెమ్ములం జిమ్ముచుం గ్రువ్వవే త్రివ్వవే ఘోరవైరిన్ నృసింహుండవై దండివై దండి వైరోచనుం గాచి యాచింపవే పెంపవే మేను బ్రహ్మాండమున్నిండ బాలుండవై

రాజకోటిస్వ్రపాటంపవే రాజవై రాజబింబాస్యకై దుర్మదారి న్విదారిం
పవే నొంపవే క్రూరఖల వ్యాసుదేవాదియాగంబుల్ శుద్ధబుద్ధుండవై వై
రిదారాంతరంగంబులన్నంతరంగంబు లుంగాగరాగింపవే పెంపుదీపింపవే
కల్కిమూర్తిం బ్రవర్తించి నిన్నెన్న నేనెవ్వడన్ నన్ను మాయావిప
న్నున్ విషణ్ణుంబ్రసన్నుంబ్రసన్నుండవై ఖిన్నతం బాపిమన్నింపవే పన్న
ధీఫిశ తల్పాకృపాకల్ప వందారుకల్పా! నమస్తే నమస్తే నమస్తే నమః

మ. కలలంబోలెడి పుత్రమిత్రవనితా రాగాదిసంయోగముల్
జలవాంఛారతి నెండమావులకు నా సల్సేయుచందంబునన్
దలతున్సత్యములంచు మూఢుడ వృథా తత్వజ్ఞుడన్గాను నీ
విలసత్పాదయుగంబు సూపి కరుణ న్వీక్షింపు లక్ష్మీపతే!

(అని మరల నమస్కరించి చూచి) ఓహో భగవానుడంతర్హితుం
డయ్యె నింక నేగెద (అని నదినుండి కృష్ణుని చెంతకు వచ్చును.)

కృ—(నవ్వుచు) అక్రూరా. కాళిందీప్రవాహము సమీపముననున్న
నింతయాలసించితి వేమి అందు నీకేమైన చోద్యములు గానంబ
డియెనా యేమి ?

అక్రూ—(దోసిలి యొగ్గి వినయముతో) దేవా!

క. నీలోన లేనిచోద్యము
లేలోకములందు జెప్ప నీశ్వర ! నీటన్
నేలన్నింగినినున్నవె
నీలోచోద్యంబులెల్ల నెగడె మహాత్మా.

నిమహిమ మచింత్యముగదా ? ఇంకద్వరగా బురమున కరుగుదము.
(అనిరథమునుదోలును. అపటిక్షేపమున మధురాపట్టణముగనంబడును.
స్వామీ ! మధురానగరమున కరుదెంచితిమి. ఈదాసునిగృహమున
(కు విచ్చేసి పవిత్రము జేయుడు.)

కృ—కంసునివధించినపిమ్మట నీభవనంబునకు వచ్చెదము. ముందు నీవేగి కంసునకు మారాక నెఱింగింపుము. (అక్రూరుఁడునివృత్తిమింప బరిక్రమించిచూచి) అన్నయ్యా! యెవ్వఁడో యొకరజకుఁడు వచ్చుచున్నవాఁడు. వానివలన వస్త్రములం గైకొందము. (రజకుఁడు ప్రవేశింప వానింగని) ఓరీ రజకా! మేము మీరాజుగారిబంధువులము. విశేషించి యిప్పు డతిథులము గూడనైయున్నవారము. తదాజ్ఞచేతనే మీగ్రామమునకు వచ్చితిమి. కావున నీయొద్దనున్న సుందరములగు పరిశుద్ధవస్త్రములను మాకిమ్ము; మాయందలో మంచివస్త్రములు లేవు. కావున నడుగుచున్నారము; మీరాజుగారు మాకు మేనమామయగును.

రజకుఁడు—(కోపముతో) ఏందీ? సాలాసాలామట్టుకున్నదే. ఓరను కొవ్వాను! బద్దరంసుమీ?

కృ—నోరు మూసికొని ముందిమ్ము. (అని తీసికొనఁబోవును.)

రజ—(గుంజుకొని) సాల్ సాల్లే, పోపో పెబువుగారియంశ నీకుఁ బట్టింది పాలు యెన్న పెరుగు మీగడ తెగదిని దున్నలాగ బల్సికిందా మీదా యెరక్కున్నారు. సూడు నాను ఎల్లి యేంశాత్తానో దొరోరిబట్టలే యియ్యాలి నీకు?

కృ—ఏమి, యిచ్చెదవా లేదా?

రజ—నాను ఇయ్యను; ఏంశేత్తావో శెయ్.

కృ—ఎందుల కూరక చచ్చెదవు. తిన్నగానిమ్ము.

రజ—(పెద్దగానవ్వి) యేందదీ యేందదీ మల్లాఅను. బక్కపీనుగవు నువ్వేనా నన్నుసంపేది? ఈపప్పు వాకాడ ఉడుకుతుందనుకున్నావా యేం; పిచ్చోడా పోపో.

కృ—ఛీ ఛీ దుష్టుఁడా ! దురహంకారివి. నిన్ను సైరింపఁగూడదు. (త లపైఁ గుద్దును రజకుఁడు చచ్చును. వానియొద్దనున్న వస్త్రములు ధరించి) అన్నా ! ఇంక మనమేగుదము రమ్ము (నడచి) అదిగో మాలాకారుఁడు వచ్చుచున్నాఁడు. వానింజూడ నుత్తమునివలెఁ గన్పట్టుచున్నవాఁడు. పోయి పుష్పమాలికలను గొందము. (నడతురు)

మాల—(ప్రవేశించి) అయ్యా, మీరెవరు ?

కృ—మేము రామకృష్ణు లను వారము.

మాలా—(ప్రేమ వినయములతో) నాతండ్రులారా ! మీరేనా? మా నాయనరాలా ! మీరాకకై చంద్రచకోరన్యాయముగా నెదురుచూచుచున్నవాఁడ. మీదర్శనంబున గృతార్థుఁడ నైతిని. ఇవిగో పరిమళభరితములైన పుష్పమాలికలను ధరింపుడు. (అని రామకృష్ణుల కంఠములలోఁ బుష్పమాలికలు వైచి నమస్కరించును.)

కృ—(సంతోషముతో) మాలాకారా ! నీభక్తికి మెచ్చితి. నీ కేమి కావలయునో వరము గోరుకొమ్ము.

మా—నాతండ్రీ! యిచ్చెదవా ?

కృ—తప్పక యిచ్చెదను.

మా—నిజముగా ?

కృ—నిజము; ముమ్మాటికి నిచ్చెదను,

మా—నాతండ్రీ ! నను గన్నతండ్రీ ! అట్లయిన సర్వకాల సర్వావస్థలయందును నాకు నీనామసంకీర్తనమును గృపజేయుము.

కృ—మంచిది. అట్లే యిచ్చితి నీక బొమ్ము (మాలాకారుఁడు కృష్ణనామస్మరణము జేసికొనుచు నిష్క్రమించును) అన్నా ! అదిగో

గొక కుబ్జ వచ్చుచున్నది. దానిచెంత సుగంధ మున్నట్లున్నది. (కుబ్జప్రవేశించును) (సమీపించి.)

క. ఎవ్వరిదానవు లేపము
లెవ్వరికిం గొంపోనుచు న్నేగుదు నీవే
రెవ్వతె మాకిమ్మన్నియు
నివ్వటిలెదు చక్కనగుచు న్నీరజనేత్రా!

కుబ్జ—మాకు నీరజనేత్రిమ, లెక్కడివిలే నీవుగావున చక్కనివాఁడ వైతివి. అందఱికిని జక్కఁదనము లెక్కడినుండి వచ్చును! నేను కంసునిదాసిని; నాపేరుకుబ్జ, మీకు సుగంధము కావలసిన నిదిగో నలందెదను (అని గంధము బూయును.)

కృ—(చిఱునవ్వుతో) నామాటలు నీకు విపరీతములుగాఁ దోఁచినవి గదా? ఇదిగో చూడుము. నీవు చక్కనిదానవో కావో (అని దానిమొడలు విఱచిన నది జగన్మోహనాంగి యగును.)

కుబ్జ—(చిఱునవ్వుతో) సరే! సరేలే! ఉన్నదాని నుండనీయక యిట్లుచేసితి వేమి? నిన్నూరక విడువను. మా యింటికిరమ్ము. (అని యుత్తరీయముఁ బట్టుకొని లాగును.)

కృ—(చిఱునవ్వుతో)ఇప్పుడుగాదు తర్వాతవచ్చెదనులే.

కు—నిన్ను నమ్మఁగూడదు. వచ్చెదవో రావో.

కృ—తప్పకవచ్చెద పొమ్ము (కుబ్జనిష్క్రమించు) అన్నయ్యా! మనమిట్లాలస్యమొనర్చుట బాగుగ లేదు. కంసుని సభా భవనంబునకే పోవుదము.

బల—మంచిది (యిర్వురునిష్క్రమింతురు) (యవనిక పడును.)

రంగము:—కంసుని సభాభవనము ముంగిలి

(రామకృష్ణులును మావటివాఁడును ప్రవేశింతురు.)

మావ—ఓరోరి బాలకులారా! ఎందుబోయెదరు! ఇదిగో! కువలయాపీడము ఈమదగజము బారింబడి యెట్లుబ్రతుకఁగలరు ! నేనెవఁడనో యెఱుంగుదురా ?

కృ—నీవెవ్వఁడవైన మాకేమి ?

శా. ఓరీకుంజరపా ! మాదెసకునీ వుద్యన్మదేభేంద్రముం
బ్రేరేపంబనిలేదు, త్రిప్పుమరలన్ వేప్రేరేచిననిన్నుగం
భీరోగ్రాశనితుల్యముష్టిహతులన్ భేదించి నేడంతకుం
జేరంబుత్తు మహోత్తరద్విపముతో సిద్ధంబుయుద్ధంబునన్.

మావ—ఆఁ అట్లయఁ జేసితివి లే (అని కృష్ణునిపైకి గజమును దోలును. కృష్ణుఁడు కువలయాపీడమును, మావటివానిని జంపి లోనికరుగును) (తెర వ్రాలును.)

రంగము:—కంసుని సభాకూటము.

(కంసుఁడు మంత్రులు అనేకజనులు చాణూరముష్టికులు ప్రవేశింతురు)

కంసు—(విని యులికిపడి) అదిగో కృష్ణుఁడుమాటాడినట్లువినంబడుచున్నది. ఓరీ డింభకా ! యెందుబోయెదవురా ? నిలు నిలుము. (అని లేచును)

1 మంత్రి—మహారాజా ! ఇందు కృష్ణుఁడు లేఁడు.

కంసు—ఓరీ ! యనృతము లాడెదవా ? నీ వెవఁడవు?

1 మంత్రి—మీపాదసేవకుఁడ నగు మంత్రిని.

కంసు—ఏమి నీవు మంత్రివా ? కృష్ణుఁడవుగావా ? అయిన నేనే పొరఁబడితిని.

1 మంత్రి—ఓరీ సేవకా! ప్రభువుగారు విచారగ్రస్తులైయున్నారు. కొంచెము వీచుము (సేవకుఁడు పంఖాతో వీవ దగులును.

కంసు—(ఉలికిపడి ఇదిగో కృష్ణుఁడు హస్తముచే నన్ను మోదినాడు. ఇంక నే నెట్లూరకుండగలను. వీఁడు హరియైనను గిరియైనను వధంపక మానను.

1 మంత్రి—(తనలో) దేవకీ వసుదేవుల చెఱబెట్టినది మొదలుకొని యీమహారాజున్మత్తునివలె జగమంతయు హరిమయముగాఁ జూచుచున్నాఁడు.

సీ. శ్రవణరంధ్రములనే శబ్దంబు వినఁబడు
    నదిహరిరవమని యాలకించు
నక్షిమార్గమునఁనె య్యదిసూడఁబడు నది
    హరిమూర్తిగానోపు నంచుఁజూచుఁ
దిరుగుచో దేహంబు తృణమైనసోకిన
    హరికరాఘాతమో యనుచునులుకు
గంధంబు లేమైన ఘ్రాణంబుసోకిన
    హరిమాలికాగంధ మనుచునదరుఁ

గీ. బలుకు లెవ్వైన పలుకుచో హరిపేరు
వలుకవడియో యనుచు భ్రమసివలుకు
దలఁపు లెట్టివైన దలఁచియా తలఁపులు
హరితలంపులనుచు నలుగఁదలఁచు.

ఎంతవిచారించినను దీనికిఁ బ్రతిక్రియగానకున్న వారము.

కంసు—(సేవకునిఁజూచి) ఓరీ కృష్ణుఁడా! నీవేనా నన్ను వధించునది? (కొట్టఁబోవ)

సేవ—(వడఁకుచుఁ గాళ్లపైఁబడి) ప్రభూ! రక్షింపుము. నే నేలినవారి సేవకుఁడను.

పరిచారకుఁడు—(ప్రవేశించి) మహారాజా! జయమగుఁగాక! రామ కృష్ణులఁట, యెవ్వరో యిర్వురు గోపబాలకులు నచిధనుశ్శా లలోని ధనువువిఱచి తత్పాలకులనుసంహరించి యటనుండి కడ లివచ్చి ద్వారదేశంబుననున్న కువలయాపీడగజమునువధించి యంబష్ఠునింబరిమార్చిలోనికి విచ్చేయుచున్నవారు.

కంసు—సరే రానిమ్ము.(సేవకుఁడు నిష్క్రమించును.) మంత్రులారా! పరిచారకులారా! భటులారా! మల్లులారా! వింటిరా కృష్ణుఁడిచ్చటికి వచ్చుచున్నాఁడఁట.

1. మంత్రి—రానిండు. మల్లయుద్ధంబునకుం బురికొల్పి మనవీరులచే సంహరింపఁ జేయుదము.

కం—అవును. ఇది చక్కగానున్నది.

శా. విన్నాణంబుల బోరనేర్తురు మహావీర్యప్రతాపాదిసం
పన్నుల్ మీరలు మేటిమల్లుగములై ప్రఖ్యాతులై పెంపుతో
నున్నారా బలకృష్ణులంబెనకువన్ మర్దించి మత్ప్రీతి కా
సన్నుల్గండు పురీజనుల్గ్యాడనో చాణూర! యోముష్టికా!

చాణూ—ముష్టి—మహారాజా! మాకు వేఱుగాఁ జెప్పవలయునా? రానిండు రానిండు.

రామ కృ—(ప్రవేశింతురు.)

చాణూ—ఓహో! గోపడింభకులారా! వచ్చితిరా? రండు. మీరెం దులకిచ్చటికి రప్పింపబడితిరో యెఱుంగుదురా? యెఱుఁగనిచో జెప్పెద వినుఁడు. గోపబాలకులతోఁగూడి మీరిర్వురువనము లలో సంచరించుచు యుద్ధనైపుణ్యమును సంపాదించితిరని విని మీశక్తిసామర్థ్యంబులెఱుంగుటకై మామహారాజుగారు మిమ్మి ప్పుడిటకు రప్పించినారు.

కృ—అయిన నది మాభాగ్యమని తలంచెదము.

చాణూ—అయిన మల్లయుద్ధంబునకుం గడంగెదరా? ఇదిగో నాపేరు చాణూరుఁడు. ఇతనిపేరు ముష్టికుఁడు మమ్ముల మీరో మిమ్ములను మేమో గెల్వవలయును.

కృ—ఏమో! మాచేతనైనంతవఱకుఁ బెనఁగిచూచెదము.

చాణూ—ఏమి యీగర్వోక్తి! ఓయీ? గోపాలకృష్ణా? యుద్ధమనిన నేదిగాఁ దలంచుచున్నాఁడవు?

మ. జవసత్వంబులు మేలె? సాముగలదే । సత్రాణమే మేను? భూ
ప్రవరుం బోసన మిమ్ముఁ గావలెనె, । పాళీ లభీష్టంబులే?
పవివో, కాక కృతాంతదండకవవో? । ఫాలాక్షునేత్రాగ్నివో
నవనీతంబుల ముద్దగాదు మెసఁగన్ । నాముష్టి గోపార్భకా!

కృ—(నవ్వుచు) చాణూరా! నీవేమైన ననుకొనుము.

ఉ. సాములు లేవు పిన్నలము । సత్వముగల్గనరాదు మల్లసం
గ్రామవిశారదుల్గులిశ । కర్కశదేహులు మీరు మీకడన్
నేము చరించుటెట్లు ధర । నీపతి వేడ్కలు సేయువారముం
గాము వినోదముల్ సలుప । గాదనవచ్చునె యొక్కమాటికిన్.

నీతోడ నేనును ముష్టికునితో నాయగ్రజుఁడును బోరెదము.

చాణూ—ఏమీ! నాతోడనే బోరెదవా?

శా. నాతోఁ బోరఁగ నెంతవాఁడవిసిరో । నాపాటియే నీవు, వి
ఖ్యాతుండన్ గులజుండ సద్గుణుఁడ స । త్కర్మస్వభావుండ నీ
కేతాదృగ్విభవంబులెల్ల గలవే? । యీవీటఁ బోరాడుటన్
వేత్రితల్ నూడఁగఁగుప్పిగంతులిడుచే । వీక్షింపు గోపార్భకా.

ముష్టి—గోపాలకృష్ణా! యేమి నీతెల్వి.

శా. స్థాణుం డెచ్చఁడు, బ్రహ్మగాఁడు వి । ష్వక్సేనుఁడవ్వాఁడా, జగ
త్ప్రాణుఁ డమ్మనఁడీశుగాఁడని, మహా । బాహాబలప్రౌఢి న
క్షీణుం డాజికి నెల్లినేఁడనఁడువై । చిత్రిన్వినోదించు న
చ్చాణూరుండొక గోపబాలుఁడనికిన్ । శక్తుండుగాకుండునే.

కృ—వృథావాచాలత్వముతో బనిలేదు. ఎవరు శక్తులో యెవరశక్తులో యిప్పుడే తేట తెల్లముగ గలదు.

చాణూ—(కోపముతో) ఏమీ వృథావాచాలత్వమా? సమయము వచ్చిన జారిపోవచ్చునని తలంచుచుంటివి కాఁబోలు. అట్టియాటలు నాముందు సాగవని ముమ్మాటికి నమ్ముము.

సీ. చలమునననుడాసి । జలరాశిజొరరాదు
నిగిడి గోత్రముదండ । నిలువరాదు
కేడించికుంభిని । క్రిందికిఁబోరాదు
మనుజసింహుఁడనని । మలయరాదు
చేరినబడవైతు । చేసాఁచఁగారాదు
బెరసినాముందట । బెరుగరాదు
భూవాధహింసకుఁ । బోరాదుననుమీరి
శోధింతుగానలఁ । జొరగరాదు

గీ. హ్రిబలమూర్తిననుచు । భాసిల్లఁగారాదు
ధరఁబ్రబుద్ధుఁడనని । తలఁపరాదు
కల్కితనముజూపి । గర్వింపఁగారాదు
తరముగాదు కృష్ణ! । తలగు తలగు.

కృ— ఇట్టివారి ననేకులను జూచితిని.

చాణూ—నీవుచూచినవారలు వెఱ్ఱిగొల్లలు. గోపాలకృష్ణా! యుద్ధ మనఁగ నీకేమోబోధపడకుండ నున్నట్లున్నది. ఇదియొకవిచి

త్రిమని తలంపకుము. ఒకవేళ నీవు శ్రీమన్నారాయణుఁడవే యని భావించినచో నిటువినుము.

సీ. మహిమతో నుండంగ - మధురాపురముగాని
పొలుపార వైకుంఠ - పురముగాదు
గర్వంబుతో నుండఁ - గంసునిసభగాని
సంసారరహితుల - సభయుగాదు
ప్రకటించి వినఁగ నా - బాహునాదముగాని
నారదు వీణాస్వ - నంబుగాదు
చదురులాడఁగ మల్ల - జనవిగ్రహముగాని
రమతోడి ప్రణయ వి - గ్రహముగాదు
గీ. వెలసి తిరుగంగ వేదాంత - వీథిగాదు
మొరఁగిపో, ముని మనముల - మూలగాదు
సాగినడువంగ - భక్తుల జాడగాదు
శౌరి నామ్రోల నీవెందు - జనియె దింక.

(అని కృష్ణునిపైకిఁ బోవును. కృష్ణచాణూరులును రామముష్టికులును మల్లయుద్ధము సేయుదురు. రామకృష్ణులు చాణూరముష్టికులను వధింతురు. తక్కిన మల్లులు పారిపోవుదురు.)

సభ — మేలు మేలు కుమారులారా! మేలు మేలు.

కంసు — (అదరిపడి యుచ్చైస్స్వరముతో) ఛీ! ఛీ! ఏమి యీసందడి? ఏమి యీయల్లరి?

ఉ. వల్లవబాలురన్ నగరి - వాకిటికిన్ వెడలంగద్రొబ్బుఁడీ
గొల్లలముట్టికోల్లనుఁడు - గొబ్బున నందుని గట్టుఁ డుర్వికిం
దెల్లముగాగ నేఁడు వసు - దేవుని జంపుఁడు, తండ్రిగాఁడు వీఁ
డెల్లవిధంబులం బరుల - కిష్టుఁడు కావున నుగ్రసేనునిన్

కృ—ఏమీ నీగర్వము ! యుద్ధమున జయించినమాకు వీరపూజగావింప
కపోవుటయేగాక నిష్కారణముగ నిరపరాధులను బాధింపనాజ్ఞాపించు నీవంటి రాజాధముని క్షమింపఁగూడదు. (అనిసింహాసనముపైకిలంఘించి కంసునిజుట్టుపట్టుకొని క్రిందికీడ్చును.)

కంసు—ఓరీ బాలకా ! విడువుము, విడువుము. లేకున్న నీఖడ్గముచే నీ శిరంబు ఖండఖండములై రాలిపడును. (అనికత్తినెత్తును.)

కృ—ఓరీ! క్రూరనరాధమా! ఇంకనిన్ను క్షమింపఁగూడదు. (అని యొక చేతఁ గత్తిబట్టుకొని సంహరించి సభామధ్యంబునంబడవైచును)

అందఱు—(పారిపోవుదురు. తెరవ్రాలును.)

సంపూర్ణము.

సంగీతకృష్ణలీలనాటకములోని కీర్తనలు.

కేతవరపు రామకృష్ణ శాస్త్రులుగారిచే రచియింపబడినవి.

1 అనుబంధము - కంసుఁడు

హిందుస్థానీ కాఫీరాగము - ఆదితాళము

ప॥ దేవకీ. దేవకీ. నిన్నిక చంపక విడువగలనె పాపిని ॥
చెలియలంచు దలఁతుగాని ॥ శత్రుజనని యనుచునే ॥
తలపనైతినె మ్మనమున నిన్నికచంపక వదలగలనెచానా ॥ దేవ ॥

. అనుబంధము - దేవకి.

హిందుస్థానీ కాఫీ - ఏకతాళము.

ప॥ హాహాహాహా ఆహా సోదరా !
అ॥ కనవె ననుపరమకృపను । చెలియలగానా హాహా ॥
చ॥ బాలను. నేగోలను. చాలగ తెలియనిదానన్.
ఏలాగోధము జెందన్.
ఓయన్నా. మనవియన్నా. । వినకున్నా. నికనున్నా.
ధరణేని నాకైనదిక్కు. నీకన్నా ॥ హాహా ॥

3. అనుబంధము - వసుదేవుఁడు.

ఖరహరప్రియరాగం - ఏకతాళము.

ప॥ ఓకంసరాజ ఇటుదయమాలి
అ॥ ఈకలికిన్ వధియింపగ బూనకు ॥ నీకిదిన్యాయమె తలపన్ ॥ఓ॥
చ॥ మానిని జంపుట తగదిదిధరణీ ॥ పాలురధర్మంబే ॥
మానుము నీదగు సోదరి జంపకు ॥ పాతకమిఁక దరిజేరున్ ॥ ఓ ॥

4. అనుబంధము కంసుఁడు.

శంకరాభరణ స్వరము - ఏకతాళం.

ప॥ ఛీఛీ తుంటువానను గనవా । నీతుల నుపదేశించెదవా
కన్నుమిన్నెఱుఁగ వాపలువా । కావరమునను దూరెదవా
ఖడ్గధారనీ కంఠమును వేగ । ఖండింతుననుచు నెఱుఁగవుగా ॥ఛీఛీ॥

5. అనుబంధము ఇంద్రాదులు.

మోహనరాగం - రూపకతాళము.

ప॥ శ్రీధరమదన జనకహారి ॥ పాతకహార
సరసిజాక్ష దివ్యపాలననిపుణ ॥ శ్రీ ॥
అ॥ దితిజనాశ । దివిజ పోషపతిత పావన
నరహరి శ్రితజన । వరదకరివరద॥ శ్రీ॥
చ॥ సదాహృదయమునఁ దలతుము పరమపురుష నళిన నయన
సురనుత । కావలేవా । దేవదేవ । పాపహార॥ శ్రీ ॥

6. అనుబంధము. వసుదేవుఁడు.

మాయామాళవగౌళ - ఆదితాళము.

ప॥ హా ఇందిరాబంధూ । ననుపరమకృపను కనుదీనబంధూ॥ హా ॥
చ॥ దిక్కు లేకయున్న ॥ మమ్ము. దేవదేవ బ్రోవవే
కాంచరాదా. కరుణరాదా పరమపాదా. విదితవేదా ॥ హా ॥
కడకు నేమీకారను బడి । గాసిలితి మోదైవమా
బ్రోవవయ్యా రాగదయ్యా । భక్తులమయ్య వల్లనయ్య ॥ హా ॥

7. అనుబంధము. దేవకి.

యదుకుల కాంభోజిరాగం - రూపకతాళము.

ప॥ కరుణాత్మానినునుతింప । తరమే లోకరక్షకా

అ॥ చెరసాలాబడి శోకా । తురులమైతిమయ్యయ్యో॥ కరు॥
పరమపావన జగదధీశ । సరసిజాక్షమాధవా
చ॥ పరమాత్మనీకు దివ్య ॥ చరణంబులనమ్మినాము॥ కరు॥
కఠినమానసుండు కంసుండు । కన్నబిడ్డలజంపెనయ్యో
కమలనయన కలుషహారణ । కరుణజూపుమయ్యా తండ్రీ ॥కరు॥

8 అనుబంధము. కంసుండు.

శంకరాభరణ స్వరములు – ఏకతాళము.

ప॥ చండశాసనుండ నేను చాలునింక వదరకుమా
మండితాసి చేగొని నీ । మగనిని నినుంగూల్చెదన్॥ చండ॥
ఛీ దురాత్మురాలా ! చెల్లెలవానీ వింక
చెల్లదిట్టులాడ నీకు । చేగొన గూడును వినుమా॥ చండ॥

9. అనుబంధము. కంసుడు.

శంకరాభరణస్వరములు – ఏకతాళము.

ప॥ సైనికులారా మీరిపుడే । శాత్రవమండలముల నెల్లన్
సాహసంబునను గొని । మన కారాగారమ్మున బంధింపుడీ
శూరులరై చరియింపుడి । వీరత్వంబును వీడకుడీ
సారబలాఢ్యులు దైత్యులనన్ । పోరునగూల్పుడు శత్రువులన్ సైని.

10. అనుబంధము. యశోద.

హిందుస్థానీ కాఫీరాగం ఏకతాళము.

ప॥ రారా శశిసమ సువదన సకల గుణగణ నిరుపమ
రారా బిరబిర. తనయా. గోకులసుందరరూపా సుత॥ రారా॥
చ॥ గజ్జెలందియలు గల్లున మ్రోయంగ కలకల నవ్వేడి
నెమ్మొగంబున వరగుణయుత నను చేరుము
యదుకులబాలా॥ రారా॥

11. అనుబంధము.

శ్రీరాగము - ఆటతాళము

జోజో ఘనశ్యామా జోజో సన్నుతనామా
జోజో సౌందర్యధామా॥ జోజో॥
అనుపమ గుణగణ ఆనందమయ్య ఘన
అమిత సన్ముని మానసానంద సంధానా॥ జోజో॥

12. అనుబంధము యశోద.

బేహాగ్ రాగము ఆదితాళము.

ప॥ ఎంతవిచిత్రమైన నామనమునకును.
సంతత మద్భుతముగ దోచెనహా॥ ఎంత॥
అ॥ బాలగోపాలుని లీలల గన్గొన
చాలగ నద్భుతముగ దోచెనహాహా॥ ఎంత॥
సాకీ॥ భళిరా పూతన జంపినట్టి విధమున్ భావింపగా నా కెదన్
కలయో నిక్కము యెంచ లేని విధమై కన్పట్టె యాశ్చర్యమై
బాలుని కృష్ణుని కనులనుగాంచిన పరమామోదమై
తోచెడినహాహా॥ ఎంత॥

13. అనుబంధము. రాధ.

కమాచిరాగం - ఆదితాళము.

ప॥ భళిరా నాభాగ్యమ ప్యారె॥ భళి॥
అ॥ ముద్దులొల్కెడు వీని మోముదమ్మితీరు। మున్నెరికడనైన
గాంచిన దానన॥ భళి॥
కమలదళముబోలు కందోయి విందొప్ప కాంతలకెల్ల
మనోహరముగా। కంతు జయంత వసంతాదులను గేరు
సుందరమానంద దాయకముగా ఆహా విభ్రమముగా
తోచె నామదికి॥ భళి॥

15. అనుబంధము. యశోద, కృష్ణుఁడు.)

బేహాగ్ రాగము. చతురశ్రి - ఏకతాళము.

ప॥ ఇదియేరా తనయా మన్ను దింటివటనీ
యశోద॥ కేలరా! సుగుణాకర! వినవేలరా తగునటరా॥ ఇది॥
అ॥ పూనికతో పంచభక్ష్యములు గల్గనిదియేలా బాలా॥ మన్ను
కృష్ణు॥ నామాటలన్నై నాతల్లి వినరాదె
నేమన్ను తిన్నదిలేదే ఇదివాదె
సరిసరి నేనా నరహరిపేరున సమయము జేసెదగానీ
వినుదీని
యశో॥ మోసబుచ్చుచుంటివి ఇది దోసముకాదె బాలా
మాటలా వినవదేలా మేలములా గోపాలా
బూటకములు చాలా బల్కెదేలా గోపాలకా
ఇది యేలా బాలా॥ మన్ను॥

16. అనుబంధము (యశోద, కృష్ణుఁడు.)

బేహాగ్ రాగము - ఆదితాళము.

యశో—ప॥ నిలునిలు బాలక యెందులకరిగెదు
కట్టెద నిఁక నిన్ కొట్టెదను.
ఇటుపరుగు లిడగనేలా। తలపోయగనిదియేలా
పలుమరు నీవిటు పారగనేటికి. నిలునిలునిలు గోపాలా
కృష్ణు॥ తల్లివినుమా. దయగనుమా. దండింపకుమా నన్నికన్
తప్పులజేయను మన్నింపవె నన్ను మాతా.
యశో॥ నిలునిలు॥

17. అనుబంధము (నలకూబర, మణిగ్రీవులు.)

మోహనరాగం - ఆదితాళం.

ప॥ జగదాధారా। నగధరా। సారసలోచన। శ్రితమందారా॥జగ॥
అ॥ కరుణాపారావారారారా। కల్మషార్తిహర దైత్యవిహార॥ జగ॥

(1) ఎంత సెప్పినాను బుద్ధి। యింతైన లేకుండపోయె।
ఎంత తిట్టినాను సిగ్గు ఏమియు లేకుండపోయె
ఎంత సేపు కొంపలంబడి యేడుస్తుండది। నేనింకూర
కుండగలనా। రానీ తమాస జూపిస్తను కాని॥ ఏడ॥

23. అనుబంధము. బేహాగ్ - ఏకతాళము.

(గొల్ల వెంకన్న భార్యను జూచి)

ప॥ ఛీ ఛీ ఎందేగినావే రండా ఎగ్గులేదా। సిగ్గులేదా
కాపురము పైనీకు॥ ఛీ పో॥ ఛీ॥
ఎగ్గు సిగ్గులన్ని వదలి యిళ్లవెంబడి తిరుగుతావు।
సిగ్గులేదే నీకు॥ ఛీ పో॥
చ॥ ఇట్టి దాన్ని నిన్ను దెచ్చి। కట్టి పెట్టినారు నాకు
నట్టేట ముంచినావు పోపో॥ ఛీఛీ॥

24. అనుబంధము. శంకరాభరణము - అదితాళము.

(దేవేంద్రుడు.)

ప॥ పాలయమాం శ్రీ। పతితపావన నామా॥ పాల॥
అ॥ కారుణ్యగుణాన్విత। దాసజనోదార॥ పాల॥
చ॥ నీల నీరద ఘన। శ్యామల దేహా। పాలిత పరమ
పావననామా. పాలితాఖిలభువనసముదయ।
వైరిరాక్షసగర్వభంజన। రక్షితాఖిలసురేశాది
పూజితా। భార్గవీరమణా॥ పాహి॥

మోహన.—ఆది.—అనూరుడు.

నేధన్యుడనైతి నింకను। నీరజాక్ష
నిఖిలేశ్వర దేవదేవ మహానుభావా॥

వేదాంత వేద్యా శ్రీ । విశ్వరూప జగదీశా విమలహృదయ
సుప్రకాశ । వేడితినిను సర్వేశా॥ వే॥
లీలామానుష విగ్రహా । బాలానీమహిమ నెన్న । జాలా నీదా
సులఁ గనవేలా గోపాలా॥ వే॥

కృష్ణుఁడు—కంసుఁడు.

శంకరాభరణ స్వరములు - ఏకతాళం.

కంసు—ప్రబల ఖడ్గధార నీశిరంబు ద్రుంచి వైచెదర । బాలక నా
యెదుర నీ । విలీలను బల్క నీ । ప్రాణములను దీసివేయు వాఁడ
బాలకాధమా ।

కృష్ణ—నిన్ను జంపి లోకములకు । నేచుడ మేర్జెసెదర । నీదుచేష్టల
కును కన్నీరు గార్చు భూసతిర । నిన్ను జంపి యూరడించు
వాడ బాలకాధమా॥ ప్ర॥